సూక్ష్మ సాగునీటి పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. జిల్లా రైతాంగానికి ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతంలో బోర్ల కింద పంటలు సాగు చేసే వారికి ఎంతో ఉపకరించిన సూక్ష్మసేద్యాన్ని అందని ద్రాక్షలా మార్చింది. ఆ ఐదేళ్లలో మూడేళ్లు పథకాన్ని నిలిపివేయగా మరో రెండు సంవత్సరాలు మొక్కుబడిగా అమలుచేసినా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. పైగా రాయితీలోనూ కోత పెట్టింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ మంచి పథకంపై దృష్టిపెట్టింది. క్షేత్రస్థాయి పరిస్థితిపై అధ్యయనం ప్రారంభించింది. ఆయా కంపెనీలతో మాట్లాడి పరికరాలు అందించేందుకు అంతా సిద్ధం చేస్తోంది.



- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ సర్కార్
- మూడేళ్లు నిలిపివేత, తర్వాత రెండేళ్లు మొక్కుబడిగా అమలు
- రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.160 కోట్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వని వైనం
- గత టీడీపీ హయాంలో విస్తృతంగా అమలు
- ఆ ఐదేళ్లలో రూ.362 కోట్లు ఖర్చు
- మళ్లీ దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం



సూక్ష్మ సేద్యానికి జవసత్వాలు

ఒంగోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అరకొర సాగు నీటి వనరులతో అవస్థలు పడే రైతులకు ఎంతో మేలు చేసేది సూక్ష్మ సాగునీటి పథకం. అందులో సగం వాటా నిధులు కేంద్రం నుంచి వస్తాయి. మిగతావి రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. ఈ పథకం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేస్తారు. అలాంటి అద్భుత పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసింది. అసలు పథకం గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. రైతులు గగ్గోలు పెట్టినా స్పందించలేదు. అయితే గతంలో 2014-19లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం విస్తారంగా అమలు చేసింది. రాయలసీమ ప్రాంతంతో సమానంగా జిల్లాలోని రైతులకు 90శాతం సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలను అందించింది. ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వ కాలంలో ఈ పథకం కింద 46,134 మంది రైతులకు సుమారు రూ.362 కోట్లతో పరికరాలు అందించి 51,301 హెక్టార్లలో సాగుకు అవకాశం కల్పించింది. వివిధ రకాల పండ్లతోటలు, మిర్చి ఇతర ఆరుతడి పంటలను రైతులు సాగు చేశారు.

అరకొరగా అమలు.. రాయితీలోనూ కోత

2019-24 మధ్య ఐదేళ్లకు మరో లక్షన్నర హెక్టార్లలో ఈ పథకం విస్తరణకు టీడీపీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అయితే జిల్లాలో రైతాంగానికి ఎంతో ఉపకరించే ఈ పథకాన్ని 2019లో అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. తొలి మూడేళ్ల ఆ ఊసే ఎత్తలేదు. అలా రాష్ట్రవ్యాప్తంగా సూక్ష్మసేద్యం పథకాన్ని నిలిపివేయడంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో 2022-23లో మళ్లీ ప్రారంభించింది. ఆ ఏడాది సగం సాగుకాలం ముగిశాక అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. జిల్లాకు ఆ ఏడాది తొలుత 16వేల హెక్టార్లకు అనుమతి ఇచ్చారు. అలాగే 2023-24లో కూడా 9,540 హెక్టార్లకు మంజూరుచేశారు. అలా రెండేళ్లలో 17,740 హెక్టార్లకు మాత్రమే ఈ పథకం అమలైంది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన 90శాతం రాయితీని మాత్రం అమలు చేయలేదు. ఇదిలాఉండగా వైసీపీ ప్రభుత్వం ఆ రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ పథకం అమలుకు సంబంధించి మన జిల్లాలో రైతుల వాటా రూ.41 కోట్లు, ప్రభుత్వ వాటా రూ.160 కోట్లు కాగా పరికరాలు అందించిన కంపెనీలకు కేవలం రైతుల వాటా నగదు మాత్రమే జమ చేసింది. ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.160కోట్లలో ఒక్క రూపాయి ఇవ్వలేదు. అలా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1,165 కోట్ల మేర పెండింగ్ పెట్టింది.

కంపెనీలకు భరోసాతో ముందుకు..

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ పథకానికి జవసత్వాలు కల్పించే చర్యలు చేపట్టింది. అయితే వైసీపీ ప్రభుత్వం చెల్లించకుండా నిలిపేసిన పెండింగ్ బకాయిలు ప్రతిబంధకంగా మారాయి. ఈ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెండింగ్ బకాయిలపై కంపెనీలకు భరోసా ఇచ్చారు. తొలిగా ఇటీవల రూ.176 కోట్లు విడుదల చేశారు. మిగిలిన వాటిని విడతల వారీగా చెల్లించేలా హామీ ఇచ్చారు. ఈ ఏడాది మళ్లీ భారీగా సూక్ష్మసేద్యం అమలుకు సహకరించాలని కంపెనీలకు సూచించారు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన మైక్రో ఇరిగేషన్ పథకం తిరిగి పునరుజ్జీవం పొందనుంది. అందుకు సంబంధించిన ప్రక్రియను ప్రస్తుతం సంబంధిత అధికారులు చేపట్టారు.



సూక్ష్మసేద్యం క్షేత్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

రైతులకు సూక్ష్మసేద్య పరికరాలు | ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు(కలెక్టరేట్) : రైతులు కొత్తగా సూక్ష్మ సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి వెంటనే అందజేస్తామని ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. కొత్తపట్నం, టంగుటూరు మండలాల్లోని ఉద్యాన, సూక్ష్మసేద్య క్షేత్రాలను ఆయన సోమవారం సందర్శించారు. ముందుగా కొత్తపట్నం మండలం ఈతముక్కలలో కూరగాయలు, ఇతర పంటలకు అమర్చిన సూక్ష్మ సేద్య పరికరాలను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. అనంతరం టంగుటూరు మండలం కందులూరులో సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం కింద నాటిన నిమ్మతోట (మూడేళ్ల)ను సందర్శించారు. రైతు రామా రావుకు అందించిన రాయితీలను అడిగి తెలుసుకున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులు కృష్ణారాజు, రంగారావులు ఇచ్చిన సూచనలు, సలహాలపై పదిరోజుల్లో ఒక నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూక్ష్మసేద్య పథకం సంచాలకులు పీవీ రమణయ్య, జిల్లా ఉద్యానవన అధికారి గోపీచంద్, ఉద్యాన అధికారి ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన ఉధృతం

- నేడు చలో విజయవాడ.. కమిషనరేట్ వద్ద ధర్నా
- అక్కడే తదుపరి కార్యాచరణను ప్రకటించే అవకాశం



ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 16 : పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గించడాన్ని నిరసిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేపట్టిన ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. వారంరోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో మంగళవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులకు పీజీ ఉన్నత విద్యను అందించేందుకు ఇన్ సర్వీసు కింద 30శాతం కోటా ఉండేది. దాన్ని 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో నంబరు 85 జారీ చేసింది. ఈ జీవోకు వ్యతిరేకంగా వారం నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి పీహెచ్‌సీ వైద్యులు నిరసన తెలిపారు. మూడు రోజులపాటు ఓపీలను బహిష్కరించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడంతో మంగళవారం చలో విజయవాడకు రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడంతో జిల్లా నలుమూలల నుంచి వైద్యాధికారులు ఆ కార్యక్రమానికి హాజరుకానున్నారు. వైద్యారోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేయనున్నారు. ప్రభుత్వం స్పందించి జీవోను రద్దుచేయకపోతే తదుపరి కార్యాచరణ ప్రణాళికను అక్కడే ప్రకటించనున్నారు.

ఎస్‌ఐల బదిలీ

- 10 మందికి పోస్టింగ్, ముగ్గురు వీఆర్‌కు

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 16 : జిల్లాలో ఎస్సైల బదిలీలు చేపట్టారు. పది మందికి పోస్టింగు ఇచ్చారు. ముగ్గురిని వీఆర్‌కు పిలిచారు. బదిలీలన్నీ పశ్చిమప్రాంతంలోనివే కావడం విశేషం. మరికొందరికి రెండు మూడు రోజుల్లో స్థానచలనం ఉంటుందని సమాచారం. అదేసమయంలో ర్యాంకర్ ఎస్సైలు కూడా పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్నారు.

ఎస్సై పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రాంతం
టి.త్యాగరాజు	కనిగిరి	వీఆర్
టి.శ్రీరామ్	వీఆర్	కనిగిరి
పి.శివనాగరాజు	హెచ్ఎంపాడు	వీఆర్
కె.మాధవరావు	వీఆర్	హెచ్ఎంపాడు
జి.కోటయ్య	వీఆర్	పీసీపల్లి
టి.కిషోర్‌బాబు	ఒంగోలు వన్‌టౌన్	పామూరు
బి.ప్రేమ్‌కుమార్	సీఎస్‌పురం	వీఆర్
ఆర్.సుమన్	వీఆర్	సీఎస్‌పురం
కె.మధుసూదనరావు	కొమరోలు	వెలిగండ్ల
ఎం.వెంకటేశ్వర్లు నాయక్	వీఆర్	కొమరోలు
టి.రాజకుమార్	వీఆర్	కొనకనమిట్ల
బి.బ్రహ్మనాయుడు	వీఆర్	త్రిపురాంతకం
పి.రాజేష్	వీఆర్	పుల్లలచెరువు



విడుదల కాని ఎన్‌హెచ్‌ఎం నిధులు

- రూ.కోటి మాత్రమే ఇచ్చి పట్టించుకోని కేంద్రం
- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు విఘాతం

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 16 : జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలు, ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధుల కేటాయింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ విషయంలో కేంద్రప్రభుత్వం సాచివేత ధోరణిని అవలంబిస్తుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాకు ఇప్పటివరకూ సుమారు రూ.3కోట్ల వరకూ రావాల్సి ఉండగా కేవలం రూ.కోటి మాత్రమే ఇచ్చింది. వాటిని అత్యవసర సేవలకు వినియోగించారు. మిగిలినవి ఇప్పటివరకూ ఇవ్వకుండా కేంద్రం తాత్సారం చేస్తోంది.

వైద్యశాలల నిర్వహణ కష్టతరం

వైద్యశాలలకు కేటాయించాల్సిన నిధులను కేంద్రప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడం వాటి నిర్వహణ కష్టతరంగా మారింది. కొన్ని వైద్యశాలల్లో వైద్యాధికారులు నిధులు వచ్చినప్పుడు డ్రాచేసుకోవచ్చన్న ఉద్దేశంతో ముందస్తుగా మెడికల్ షాపుల్లో అప్పు చేసి అత్యవసర మందులను కొనుగోలు చేస్తున్నారు. అయితే నిధుల విడుదలలో తీవ్రజాప్యం జరుగుతుండటంతో వైద్యాధికారులు కూడా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు అధికంగా ఉండటంతో ప్రజానీకం వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. అయితే అక్కడ అవసరమైన నిధులు అందుబాటులో లేకపోవడంతో వైద్యాధికారులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు నిధుల వినియోగం

జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 64, యూపీహెచ్‌ఎస్‌లు 19, ఏపీయూహెచ్‌పీ వైద్యశాలలు 10 ఉన్నాయి. ఈ ఆసుపత్రుల అభివృద్ధి కేంద్రం ఏటా నాలుగు క్వార్టర్‌లుగా ఎన్‌హెచ్‌ఎం కింద రూ.12కోట్ల వరకూ ఇస్తోంది. ఈ ఏడాది తొలి విడత రూ.3 కోట్లు జూన్‌లోనే రావాల్సి ఉంది. అవి విడుదలైతే ఒక్కో పీహెచ్‌సీకి రూ.1.75 లక్షలు, యూపీహెచ్‌ఎస్‌కు రూ.1.75 లక్షలు, ఏపీయూహెచ్‌పీ వైద్యశాలలకు ఒక్కో దానికి రూ.ఐదు లక్షల చొప్పున కేటాయిస్తారు. ఈ నిధులతో వైద్యశాలలకు అవసరమైన కొత్త పరికరాలతోపాటు అత్యవసర మందులు కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. కానీ రూ.కోటి మాత్రమే విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం మిగిలిన వాటి గురించి పట్టించుకోలేదు. దీంతో ఆసుపత్రుల్లో ఏమీ కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇంకోవైపు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతభత్యాలను ఆరోగ్య మిషన్ నుంచి విడుదల చేయాల్సి ఉంది. అందుకు సంబంధించి కొంతమేర ఇస్తుండటంతో వాటిని వెంటనే జీతాలకు సర్దుబాటు చేస్తున్నారు.

డీఈవో కార్యాలయం.. అవినీతిమయం

- వరద విరాళాల్లో గోల్‌మాల్
- మరికొన్ని వ్యవహారాల్లోనూ చేతివాటం
- సీఎంకు ఫిర్యాదు చేసిన టీఎన్‌యూఎస్
- విచారణ చేయించాలని వినతి



ఒంగోలు (విద్య), సెప్టెంబరు 16: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం వసూలు చేసిన విరాళాల్లో కొంత మొత్తం గోల్‌మాల్ అయినట్లు ఆరోపణలు నెలకొన్నాయి. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర మండల విద్యాధికారులు, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు, ఉప విద్యాధికారుల ద్వారా విరాళాలు వసూలు చేశారు. అయితే జిల్లా విద్యాశాఖ ద్వారా ఎవరెవరి నుంచి ఎంత మొత్తం వసూలు చేసింది? ఆ నిధులను ఏమి చేసింది గోప్యంగా ఉంచారు. దీంతో ఈ నిధుల విషయంలో డీఈవో సుభద్ర అవినీతికి పాల్పడినట్లు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆరోపించారు. ఈవిషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. వరద బాధితుల విరాళాల స్వాహాపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో సీఎంకు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌కు, పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీకి కూడా ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

డీఈవోపై టీఎన్‌యూఎస్ చేసిన మరికొన్ని ఆరోపణలు ఇవీ..

* డీఈవో కార్యాలయంలో అవినీతి పెచ్చరిల్లింది. నిధుల స్వాహాపై సమగ్ర విచారణ చేయాలి.
* ప్రజాప్రతినిధుల సిఫార్సులను పక్కనపెట్టి కొందరు టీచర్ల వద్ద భారీ మొత్తాలను వసూలు చేసి డీఈవో కార్యాలయం, సమగ్రశిక్ష కార్యాలయంలో డిప్యుటేషన్లు వేశారు. ప్రజాప్రతినిధులు చెబితే నిబంధనలు అంగీకరించవంటున్న డీఈవో ఏ నిబంధనల ప్రకారం వీరికి డిప్యుటేషన్లు వేశారో విచారణ చేయించి నిగ్గుతేల్చాలి.
* ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొందరు అనర్హుల వద్ద రూ.10వేల నుంచి రూ.20వేల వరకూ వసూలు చేసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇచ్చారు. దీనిపై విచారణ చేయాలి.
* ఉద్యోగోన్నతులు పొందిన టీచర్లలో కొందరు వివిధ కారణాలతో తిరిగి పాత పోస్టుకు వెళ్లేందుకు రివర్షన్లకు దరఖాస్తు చేస్తే వారి వద్ద రూ.70వేల నుంచి రూ.80వేల వరకు వసూలు చేశారు.
* డీఈవో కార్యాలయంలోని ఐటీ సెల్‌లో మూడు పోస్టులలో నియమించేందుకు మూడో కంటికి తెలియకుండా ముగ్గురు టీచర్ల పేరుతో పాఠశాల విద్య కార్యాలయానికి ఆన్‌లైన్‌లో ఫైల్ పంపారు. ఈ వ్యవహారంలో భారీ మొత్తంలో చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.
* పాఠశాల ప్రారంభ అనుమతులు, ప్రభుత్వ గుర్తింపునకు భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారు. ఈ విషయాలన్నింటిపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామశెట్టి వెంకటేశ్వర్లు కోరారు.

సాగునీటి రంగంపై దృష్టి సారించాలి

- మంత్రి స్వామిని కలిసి కోరిన రైతుసంఘాల ప్రతినిధులు
- వివిధ అంశాలపై వినతిపత్రం



మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

ఒంగోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వపరంగా ప్రత్యేక దృష్టి సారించాలని వివిధ రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం సాగునీటి అవసరాలు, ప్రాజెక్టుల పూర్తిపై సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు నేతృత్వంలో వివిధ సంఘాల ప్రతినిధులు మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిని సోమవారం తూర్పునాయుడుపాలెంలో కలిశారు. వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం వరినాట్ల సీజన్ కాగా సాగర్ కుడి కాలువ ద్వారా జిల్లాకు రావాల్సిన వాటా మేర నీరు వచ్చేలా చేయాలని కోరారు. ఆయకట్టులో వరి సాగుకు పూర్తి స్థాయిలో నీటి అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అంశాలపై చర్చించేందుకు తక్షణం జిల్లాస్థాయి సమావేశాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. అలాగే గుండ్లకమ్మ అన్ని గేట్లకు మరమ్మతులు చేసి రబీకి నీరివ్వాలని కోరారు. వెలిగొండ పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. కొండపి నియోజకవర్గంతోపాటు పొదిలి మండలాన్ని అటు వెలిగొండ, ఇటు సాగర్ కాలువలకు అనుసంధానం చేసి భవిష్యత్‌లో ఆ ప్రాంతంలోని మెట్ట భూములకు సాగు నీరు శాశ్వతంగా అందేలా చూడాలన్నారు. మంత్రి స్వామి స్పందిస్తూ ప్రభుత్వపరంగా రైతులకు మేలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసి వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి పోలవరపు వెంకట్రామయ్య, రైతు సంఘాల ప్రతినిధులు పమిడి వెంకట్రావు, కె.వీరారెడ్డి, వి.సుబ్బారావు, కె.ఆంజనేయులు, మండవ శ్రీనివాసరావు, షేక్ మాబు, సీహెచ్.సుధాకరరావు తదితరులు ఉన్నారు.



ముమ్మరంగా వరినాట్లు

- నారు కొనుగోలుచేసి వేస్తున్న సాగర్ ఆయకట్టు రైతులు
- బీపీటీ రకం వైపు ఎక్కువ మంది మొగ్గు
- కూలీలకు పెరిగిన డిమాండ్

వివరాలు లోపలి పేజీల్లో..

ఉన్నా..లేనట్లే..!

నిరుపయోగంగా నాగులుప్పలపాడు ఆర్టీసీ బస్టాండ్

ప్రయాణికుల అగచాట్లు

పట్టించుకోని సంస్థ అధికారులు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 16: ఒకప్పుడు ఆర్టీసీ బస్సుల రాకపోకలు సాగిస్తూ ప్రయాణికుల రద్దీతో నిత్యం



శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

కళకళలాడిన నాగులుప్పలపాటు ఆర్టీసీ బస్టాండ్ అధికారుల నిర్లక్ష్యంతో నేడు నిరుపయోగంగా మారింది. చివరకు బస్టాండ్ భవనం బిచ్చగాళ్లకు, మందుబాబుల అడ్డాగా మారింది. మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో సుమారు 20 ఏళ్ల క్రితం ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా బెంచీలు, ఫైబర్ కుర్చీలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా మరుగుదొడ్లను నిర్మించి వాడుకలోకి తెచ్చారు. బస్టాండ్‌లో వ్యాపారకార్యకలాపాలు సాగించుకొని ఆర్టీసీకి ఆదాయం సమకూరేలా మూడు షాపులను సైతం నిర్మించారు. ఒక షాపును కొద్ది రోజులపాటు ఆర్టీసీ కంట్రోలరు పాయింట్‌గా వినియోగించుకొని, మిగిలిన రెండు షాపులకు వేలం నిర్వహించి ఆదాయాన్ని సమకూర్చుకునేవారు. ఇటు వైపుగా రాకపోకలు సాగించే బస్సులు తప్పనిసరిగా బస్టాండ్ లోపలికి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లేవి. అదికాస్త మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఇప్పుడు చీరాల జాతీయ రహదారిపైనే బస్సులను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతో బస్సులు దిగిన ప్రయాణికులు జాతీయరహదారిని దాటే క్రమంలో ప్రమాదాల బారిపడుతున్నారు. కొద్ది కాలం నుంచి బస్టాండ్ నిర్వహణను ఆర్టీసీ అధికారులు పూర్తి గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మారిందన్న విమర్శలున్నాయి. బెంచీలు దెబ్బతిని, రాత్రిళ్లు లైట్లు వెలగక చీకట్లు కమ్ముకొని అటువైపుగా వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్లు పూర్తిగా పనిచేయక మహిళా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌లోని షాపుల వేలంలోనూ ఆర్టీసీ అధికారుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ప్రజలు జిల్లా కేంద్రం ఒంగోలుకు, చీరాల, గుంటూరు, అద్దంకి ప్రాంతాలకు వెళ్లాలంటే నాగులుప్పలపాడు వచ్చి వెళ్లాల్సిందే. నిత్యం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు సైతం రాకపోకలు సాగిస్తుంటారు. బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులు ఎండ అయినా, వానైనా రోడ్డుపై నిరీక్షించాల్సిన పరిస్థితి. ఇక్కడి బస్టాండ్ భవనంలో దుర్గంధం వెదజల్లుతుండటంతో రోడ్డుపైనే నిలబడుతున్నారు. అయితే రోజురోజుకు చీరాల, ఒంగోలు, గుంటూరు ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారు ఎక్కువయ్యారు. బస్సులు డిపోలోకి రాకుండా రోడ్డు పైనే ఆగి వెళుతున్నాయి. బస్సు కోసం వేచి ఉండేందుకు కాసేపు కూర్చుందామంటే బస్టాండ్ అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

రోటరీ క్లబ్ సేవలు ఆదర్శనీయం

• డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్‌చౌదరి



మహాప్రస్థానాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ శరత్‌చౌదరి

చీమకుర్తి, సెప్టెంబరు 16: రోటరీక్లబ్ ఆఫ్ చీమకుర్తి అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ శరత్‌చౌదరి తెలిపారు. చీమకుర్తి పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. మహాప్రస్థానం, కూరగాయలమార్కెట్, బస్‌షెల్టర్‌ను పరిశీలించి తదుపరి చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాబోయే మూడేళ్లలో చీమకుర్తిలో ప్రజల సౌకర్యార్థం అతితక్కువ రేట్లతో మెడికల్ పరీక్షల కేంద్రం ఏర్పాటు, జనరిక్ మందులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవటం, సేవలను విస్తృతస్థాయిలో నిర్వహించాలని క్లబ్ తీర్మానించింది. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ మహ్మద్ రఫి, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు చెరుకూరి రఘుకిరణ్, అధ్యక్షులు కడవా రామకృష్ణ, సెక్రటరీ కందుకూరి వెంకటసుధాకర్‌బాబు, మన్నం నాగరాజు, గొల్లపూడి వెంకట్రావు, యడ్లపల్లి రామబ్రహ్మం, పరాంకుశం శ్రీనివాసమూర్తి, అంబటి వీరారెడ్డి, అడుసుమల్లి శ్రీనివాసరావు, పోకూరి తిరువెంగళం, గొల్లపూడి చౌదరి పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి సత్యకుమార్ జన్మదినం



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 16 : భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ జన్మదిన వేడుకలు ఒంగోలులో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక రిమ్స్‌లో శివాజీయాదవ్, శ్రీహరి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి పాల్గొన్నారు. రామ్‌నగర్‌లో జిల్లా మహిళా మోర్చా ప్రధానకార్యదర్శి విజయారావు ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో డాక్టర్ కొమ్మి నరసింహరావు, బొద్దులూరి ఆంజనేయులు, రాయపాటి అజయ్, మాకినేని అమరసింహ, తీగల సత్యవతి, పీవీ.కృష్ణారెడ్డి, కాట్రగడ్డ శ్రీనివాసరావు, దండు శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

మైనంపాడులో సాగునీరు విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న నాయకులు

సంతనూతలపాడు, సెప్టెంబరు 16: మైనంపాడు పరిధిలోని చెరువు నుంచి మాగాణి సాగుకు నీటిని ఉపసర్పంచ్ గుండవరపు సుబ్బారావు, నాయకులు ఆళ్ల అవినాష్ సోమవారం విడుదల చేశారు. 200 ఎకరాల పంట సాగులోకి రానుందని వారు తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రైతుల మేలుకోరే ప్రభుత్వమని వారు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం వెంకట్రావు, ఆకుల బ్రహ్మయ్య, మాదాల సుబ్బారావు, పెరుగు అంజయ్య, పెరుగు రాము, యలమందయ్య బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా అశోక్‌బాబు

టంగుటూరు, సెప్టెంబరు 16 : మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా టంగుటూరుకు చెందిన తుల్లిబిల్లి అశోక్‌బాబు ఎంపికయ్యారు. విజయవాడలో సోమవారం జరిగిన సమావేశంలో ఈ నియామకం జరిగింది.

అండర్-14 జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా అసోసియేషన్

మేదరమెట్ల, సెప్టెంబరు 16: ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర అండర్-14 జిల్లా స్థాయి సెలెక్షన్స్ కొరిశపాడు మండలం రావినూతలలోని రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ స్టేడియంలో ఆది, సోమవారాల్లో నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన 33 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వారికి రెండు రోజులు నిర్వహించిన క్రికెట్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 16 మందిని స్టాండ్‌బైగా ఐదుగురికి అండర్14 జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక అయిన క్రీడాకారులు అక్టోబరు 1వతేదీ నుంచి జరిగే అంతర్ జిల్లా క్రికెట్ పోటీలలో పాల్గొంటారని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారసాల నాగేశ్వరరావు(బాబు) తెలియజేశారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీలలో సెలెక్టర్లుగా మాజీ రంజీ ప్లేయర్ తాటికొండ వంశీకృష్ణ, మాజీ రాష్ట్ర క్రీడాకారుడు శ్రీకృష్ణ విజయకుమార్‌లు వ్యవహరించారు. కోచ్‌లుగా సుధాకర్, చంద్రశేఖర్‌లు హాజరయ్యారు. సెలెక్టర్ వంశీకృష్ణ, గ్రౌండ్ మ్యాన్ అజయ్‌కు ఈ సందర్భంగా క్రీడాకారులు చిరు సన్మానం చేశారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.మోహన్‌దాస్, సభ్యులు కొల్లా మధు, సాయికృష్ణ, ఆర్ఎస్‌సీఏ సభ్యులు శేషు తదితరులు పాల్గొన్నారు.

కనపర్తి ఎత్తిపోతల పథకాన్ని అభివృద్ధి చేస్తా

• ఎమ్మెల్యే విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు సెప్టెంబరు 16: కనపర్తి ఎత్తిపోతల పథకాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అమ్మనబ్రోలు వద్దనున్న కనపర్తి ఎత్తిపోతల పథకం వద్ద ఆయకట్టు రైతుల సాగు అవసరాల కోసం సోమవారం ఎమ్మెల్యే మోటార్లు ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా ఏవో వెంకటరావు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన వరి పంటను అమ్ముకొనేందుకు వీలుగా ప్రభుత్వం రెండవ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్దతు ధరను అందిస్తుందని చెప్పారు. మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలోనే నాలుగు సార్లు ఆదర్శ అవార్డులను అందుకొన్న కనపర్తి ఎత్తిపోతల పథకం మోటార్లు, ప్యానళ్లు దెబ్బతిన్నాయని, ఆనాడు గుండ్లకమ్మ డ్యాం నిర్మించిన సమయంలో సాగునీటి వాటా అందించేలా (డీపీఆర్)లో చేర్చలేదని చెప్పారు. దీంతో గుండ్లకమ్మ డ్యాం గేట్లు మూసివేసిన సమయంలో నదిలో నీరు లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అంతేగాకుండా పథకం కాలువ కట్టలు దెబ్బతిని పంట ఉత్పత్తులు ట్రాక్టర్లలో తరలించే సమయంలో రైతులు ఇబ్బందిపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకం డీపీఆర్‌లో చేర్చాలని, కాలువ కట్టలపై గ్రావెల్ పరిచి, ఆధునాతన మోటార్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా అంశాలపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ కనపర్తి ఎత్తిపోతల పథకంపై తనకెంతో మక్కువ ఉందన్నారు. దీనిని డీపీఆర్‌లో చేర్చడం కొంత కష్టంతో కూడుకొన్న పని అయినా రైతుల శ్రేయస్సు కోసం నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సాగునీరు వాటా అందేలా చేస్తానన్నారు. కాలువ కట్టలపై గ్రావెల్ రోడ్డు నిర్మించుకొనేందుకు వెంటనే నిధులు సమకూర్చనున్నట్లు తెలిపారు. అత్యాధునిక మోటార్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన ఎత్తిపోతల పథకం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బీఎన్‌ను, వీరయ్య చౌదరిలను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, దివి పున్నారావు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీలో దళితులకు స్థానం లేదు

ఎస్సీల మనోభావాలను అర్థం చేసుకోలేని వ్యక్తి జగన్ • ఆరోగ్యశ్రీ పథకాన్ని కమీషన్లతో దోపిడీ

ఆ పార్టీని వీడుతున్నట్లు ప్రకటించిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ అశోక్‌బాబు, జట్పీటీసీ సభ్యురాలు రత్నభారతి



మాట్లాడుతున్న అశోక్‌బాబు, రత్నభారతి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 16 : వైసీపీలో దళితులకు, పేదలకు స్థానం లేదని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్‌బాబు ఆరోపించారు. దళితుల మనోభావాలను అర్థం చేసుకోలేని వ్యక్తి పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అని విమర్శించారు. ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని తన కార్యాలయంలో సోమవారం తన సతీమణి, నాగులుప్పలపాడు జడ్పీటీసీ డాక్టర్ రత్నభారతితో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీలో సంతోషంగా దళితులు లేరన్నారు. తనకు పదవి ఇచ్చారే తప్ప తన వెనుక షాడోలను ఏర్పాటు చేసి వారే హాస్పటల్స్‌కు వెళ్లేవారన్నారు. అప్పటి మంత్రి విడదల రజని, ఐఏఎస్ అధికారులు కిషోర్‌బాబు, ధనుంజయరెడ్డి, శివారెడ్డి, అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిలు తనను అడ్డుకున్నారని విమర్శించారు. వైద్యశాలల నుంచి వచ్చిన కమీషన్లను వారే దోచుకున్నారని ఆరోపించారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను చెప్పేందుకు వైవీ.సుబ్బారెడ్డి వద్దకు వెళ్లినా, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి చెప్పినా వారికే ఇబ్బందని, ఇలా ఎవరికీ సమస్యలు చెప్పుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. తన సతీమణి నాగులుప్పలపాడు జడ్పీటీసీగా ఉన్నా వివక్షత చూపుతూ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారన్నారు. అందువల్లనే తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, అలాంటి పార్టీలో ఉండటం కంటే వీడటం మంచిదని నిర్ణయం తీసుకున్నట్లు అశోక్‌బాబు, రత్నభారతి వివరించారు.

ఘనంగా గణేషుడి విగ్రహాల నిమజ్జనం

• ఓబన్నపాలెంలో ఎమ్మెల్యే బీఎన్ పూజలు



ఎద్దుల బండిపై ఉప్పుగుండూరు దక్షిణంబజారు లంబోదరుడు



.నిమజ్జనానికి తరలుతున్న ఒమ్మెవరం గణనాథుడు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 16 : వినాయక చవితి సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు నవరాత్రి ఉత్సవాలను ముగించుకొని సోమవారం నిమజ్జనాలకు తరలి వెళ్లాయి. యువతీ, యువకులు కేరింతలు, డప్పు వాయిద్యాలు, కోలాట భజనలతో గులాములు చల్లుకుంటు నిజ్జన కార్యక్రమాలు ముగించారు. ఓబన్నపాలెంలో మాజీ సర్పంచ్ వక్కంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గణేషుడి నిమజ్జనం సందర్భంగా ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ పాల్గొని వినాయక మండపం, కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను నాయకులు సన్మానించారు. కనపర్తి సముద్రతీరంలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో దివి పున్నారావు, వక్కంటి శ్రీనివాసరావు, మండవ ప్రసాద్, పోలినేని సింగారావు పాల్గొన్నారు. ఇక ఒమ్మెవరంలో గ్రామంలో మొత్తం ఒకే వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ నవరాత్రి ఉత్సవాలను చేసి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి లడ్డూను వేలం వేయగా అల్లమనేని సాయికృష్ణ రూ.47,116లకు దక్కించుకున్నారు. అనంతరం పెదగంజాం సముద్రతీరంలో నిమజ్జనం చేశారు. ఉప్పుగుండూరు దక్షిణం బజారులో ఏర్పాటు చేసిన లంబోదరుని ప్రత్యేక రథంపై ఉంచి వినుకొండ నుంచి తీసుకొచ్చిన ఎద్దులతో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలతో కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. గ్రామంలోని నడింముఠా, దిన్నెమీద యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి వేడుకగా తరలించారు.

రెవెన్యూ బదిలీలతో ఆశాఖ ప్రతిష్ట పెరిగేనా?

• పాతుకుపోయిన వీఆర్వోలు



మర్రిపూడి తహసీల్దార్ కార్యాలయం

మర్రిపూడి, సెప్టెంబరు 16 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూశాఖ ప్రతిష్ట మసకబారింది. ఐదేళ్లపాలనలో 10 మందికిపైగా తహసీల్దార్లు బదిలీ కావడం ఆశాఖ పనితీరును తేటతెల్లం చేసింది. అంతే కాకుండా పన్నూరు భూ వ్యవహారంలో అప్పటి తహసీల్దార్ కృష్ణారావ్, డిప్యూటీ తహసీల్దార్ జగదీష్, ఇన్‌చార్జ్ ఆర్ఐ శేషాచలం, వీఆర్వో శివారెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే. మర్రిపూడి మండలం నుంచి బెంగళూరు విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతుండటంతో ఆయాగ్రామాలకు చెందిన వీఆర్వోలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపించాయి. ఈ ఆరోపణల నేపథ్యంలోనే ఆనలుగురి అధికారులపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. నలుగురి అధికారులపై వేటు పడటం రెన్యూశాఖ ప్రతిష్టను మంట కలిపింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పెద్దఎత్తున బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ ప్రక్షాళన జరగాలని మండల ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం రైతులు మీసేవా కేంద్రాల్లో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ కుంటిసాకులతో తిరస్కరిస్తుండటంపై అన్నదాతల్లో ఆగ్రహం పెల్లుబిక్కింది. అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ దృష్టికి పలువురు వీఆర్వోలు చేస్తున్న అవినీతిపై రైతులు పెద్దఎత్తున ఫిర్యాదు చేశారు. అప్పటి మంత్రి ఆదేశాల మేరకు మర్రిపూడి వీఆర్వోను కొద్దికాలం విధులకు దూరంగా పెట్టారు. మండల కేంద్రంలో పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసిన విశ్రాంత ఉద్యోగులను గత కొన్నేళ్లుగా కాళ్లకు చెప్పులు అరిగేలా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్న ఘనత ఆ వీఆర్వోకు దక్కుతుంది. మరో మాజీ రెవెన్యూ అధికారి పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకోగా ఓ వీఆర్వో రెండు లక్షలు లంచం అడిగినట్లు సమాచారం. ఇప్పటికైనా రెవెన్యూ అధికారుల బదిలీలతో ఆశాఖ ప్రతిష్ట పెరుగుతుందేమోనని, అదే విధంగా అవినీతి అధికారులకు స్థాన చలనం కలుగుందేమోనని మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పాకలలో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

సింగరాయకొండ, సెప్టెంబరు 16 : మండలంలోని పాకల పల్లెపాలెంలో సోమవారం మోపిదేవి జాలలక్ష్మికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఆమె సింగరాయకొండలో నివాసం ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. లోపల ఉన్న వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. సర్పంచ్ సైకం చంద్రశేఖర్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ, కన్నా శ్యామ్‌ప్రసాద్ దగ్ధమైన ఇంటిని పరిశీలించారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

అవీ.. ఇవీ..

సాగునీటి సరఫరాపై స్పష్టమైన ప్రకటన చేయాలి

• టీడీపీ నాయకుల డిమాండ్

చీమకుర్తి, సెప్టెంబరు 16: నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయిలో నిండినందున రబీకి సాగునీరు విడుదలపై అధికారులు స్పష్టమైన ప్రకటన చేసి రైతుల్లో ఉన్న ఆందోళనకు తెరదించాలని చీమకుర్తి మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టిపాటి రాఘవరావు, కార్యదర్శి వేల్పుల శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రామతీర్థం జలాశయం నిండిన నేపథ్యంలో రబీకి వరిసాగుకు నీరిస్తారా లేదా ఆరుతడి పంటలకు మాత్రమే నీరు ఇస్తారా అన్న విషయాన్ని ప్రకటిస్తే రైతుల్లో నెలకొన్న సందేహాలు తొలగిపోతాయన్నారు. వరిసాగుకు నీరు ఇవ్వాలని తాము కోరుతున్నట్లు వారు పేర్కొన్నారు.

‘అది విడిది కాదు.. పంచాయతీ స్థలమే..’

సంతనూతలపాడు, సెప్టెంబరు 16: మంగమూరు గ్రామంలో విడిది స్థలమంటూ ప్రత్యేకంగా ఏదీ లేదని, వివాదాస్పదంగా మారిన స్థలం గ్రామ పంచాయతీకి చెందినదని అది గ్రామ నడిబొడ్డున ఉందని, ఊరిచివరి కాదని క్రిస్టియన్‌పాలెంకు చెందిన పి.బుజ్జి, టి.పుల్లయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే ఊరి నడిమధ్యన ఉన్న స్థలంలో చెట్ల కింద మద్యం సేవిస్తూ, అసాంఘిక కార్యక్రమాలు చేస్తుండటంతో అటుగా వెళ్లే మహిళలకు ఇబ్బందికరంగా ఉండటంతో కొద్ది రోజుల క్రితం చెట్లను తొలగించారని, ఈ విషయంలో దళితులను ఎవరూ కించపరుస్తూ మాట్లాడలేదన్నారు. కావాలని కేసులు బనాయించారని ఆరోపించారు. ఇదంతా కేవలం పార్టీపరంగా చేస్తున్న కుట్రని, పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో ఎ.మత్తయ్య, పరిశుద్ధం అసలు సంఘటన జరిగిన ప్రాంతంలో లేరని, ఎవరినీ కులంపేరుతో దూషించలేదని వారు తెలిపారు. పంచాయతీ స్థలం వద్ద వివాదం జరుగుతున్న సమయంలో టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కంకణాల గోపీ సైతం అక్కడే ఉన్నారని వారు వివరించారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

టంగుటూరు, సెప్టెంబరు 16 : నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకూ పోరాడిన యోధుడు సీతారాం ఏచూరి అని సీపీఎం టంగుటూరు మండల కన్వీనర్ వి.మోజెస్ అన్నారు. మండలంలోని కొణిజేడులో సోమవారం నిర్వహించిన ఏచూరి సంస్మరణ కార్యక్రమంలో మోజస్ పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీకి, యువతకు సీతారం ఆదర్శం అన్నారు. దేశ రాజకీయాల్లో సైతం ఆయనది కీలకపాత్ర అని కొనియాడారు. పార్టీ స్థానిక నాయకుడు షేక్ మీరాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.కోటయ్య, టి.రామకోటయ్య, మక్కెన శ్రీనివాసరావు, తన్నీరు రామారావు, కొమ్ము ప్రభుదాసు, గుంట దాసు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేలు రకం విత్తనాలను అందించాలి

మద్దిపాడు, సెప్టెంబరు 16: ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో రైతులకు మేలురకం విత్తనాలను 90శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందించాలని సీపీఐ నాయకులు తొట్టెంపూడి వెంకట శేషయ్య కోరారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ రైతులకు మినుము, పెసర, పిల్లి పిసర, కంది విత్తనాలను తక్షణం అందించాలన్నారు. గత ప్రభుత్వం రైతులకు పంట నష్టపరిహారం అందించలేదని ఆరోపించారు. సుబాబుల్, జామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, టన్ను రూ.8 వేల చొప్పున కొనుగోలు చేయాలన్నారు. రైతులకు పంటల బీమా పథకం అమలు చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా ఖరీఫ్ సీజన్లో రైతులకు సబ్సిడీ ధరల్లో పురుగుమందులు, ఎరువులు అందించాలని ఆయన కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై సర్వే : ఎంఈవో

మద్దిపాడు, సెప్టెంబరు 16: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు అక్టోబరు 9వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని ఎంఈవో ఆంజనేయులు సోమవారం తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన లేక బిడ్డల భవిష్యత్‌పై నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారిని ఒప్పించి భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు సన్నద్ధమవుతున్నారన్నారు. వైకల్యం శాతం అధికంగా ఉన్నవారికి సదరన్ ధృవపత్రాలతో పింఛన్, బస్సు, రైల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి, తక్కువ వైకల్యం ఉన్న పిల్లల తల్లిదండ్రులు రవాణా ఖర్చు కింద రూ.3 వేలు, ఉపకార వేతనం రూ.2 వేలు, అలాగే 9,10 తరగతుల్లో విద్యార్థులకు ఉపకార వేతనాలు ఏడాదికి రూ.9 వేల నుంచి రూ.11వేల వరకు అందజేస్తామని ఎంఈవో పేర్కొన్నారు.

అంకమ్మరావుకు పురస్కారం



నూనె అంకమ్మరావు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 16: ఒంగోలుకు చెందిన కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావును శ్రీపడవల లక్ష్మణస్వామి స్మారక స్ఫూర్తి పురస్కారం- 2024కు ఎంపిక చేసినట్లు సహజ సాహితి సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు వి.రాధాకృష్ణ, పురస్కార ప్రదాత పీవీఆర్.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీన చీరాల రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో జరిగే సభలో ఈ పురస్కారాన్ని అందజేస్తామన్నారు. పురస్కారానికి ఎంపికైన అంకమ్మరావుకు నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు ఆదినారాయణ, కుర్రా ప్రసాద్‌బాబు, మిడసల మల్లిఖార్జునరావు, సంత వేలూరి కోటేశ్వరరావు, నరసం కోశాధికారి అరుణ అభినందనలు తెలిపారు.

క్రీడలతో స్నేహభావం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 16: క్రీడలతో ఉపాధ్యాయల మధ్య స్నేహభావం పెరుగుందని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ స్కూలులో రెండో రోజైన సోమవారం క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో జరిగిన పలు పోటీలకు 600మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. డిసెంబరు 14నుంచి మూడు రోజుల పాటుకాకినాడలో జరిగే స్వర్ణోత్సవాల్లో బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, ప్రతినిధులు ఎస్.రవి, జి.ఉమామహేశ్వరి, చిన్నస్వామి, పి.బాలవెంకటేశ్వర్లు, ఎస్‌వీ.కొండారెడ్డి, పి.ప్రభాకర్, కె.లక్ష్మీనారాయణ, ఆర్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

• డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 16: స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు మంగళ, బుధవారాల్లో జరుగుతాయని డీఈవో డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కాంప్లెక్స్‌పరిధిలోని 50శాతం మంది ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తెలుగు, లెక్కలు, బయాలజీ, నియోజకవర్గ స్థాయిలో పీఈటీ/పీడీలకు జరుగుతుందన్నారు. బుధవారం మిగిలిన 50శాతం ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, హిందీ, ఇంగ్లీషు, పీఎస్, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ సమావేశాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4.20 గంటల వరకు జరుగుతాయన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోల సమన్వయంతో రిసోర్స్ పర్సన్స్‌ను ఎంపికచేసుకొని అజెండా ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవో ఆదేశించారు.

బ్రెయిన్ ట్యూమర్ చిన్నారికి ఆర్థికసాయం



చెక్కును అందజేస్తున్న సర్దార్‌బాషా, ట్రస్టు సభ్యులు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 16: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఓ చిన్నారి వైద్యానికి సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆర్థికసాయం అందించింది. హైదరాబాద్‌లో బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న మిధున్‌కు తండ్రి చనిపోయాడు. తల్లి ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. ఈ పరిస్థితుల్లో కుటుంబం జరగటమే కష్టంగా మారింది. దీనికి తోడు కుమారుడు బ్రెయిన్ ట్యూమర్ రావడంతో దిక్కుతోచని ఆ తల్లి ఒంగోలులోని సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ గురించి తెలుసుకుని ట్రస్ట్ ఫౌండర్, ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణను సంప్రదించింది. తక్షణమే స్పందించిన మురళీకృష్ణ దాతల సహకారంతో మిధున్ వైద్యానికి రూ.1.50లక్షలను ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్‌బాషా ద్వారా హైదరాబాద్ పంపి సోమవారం చిన్నారి తల్లికి అందజేశారు. కార్యక్రమంలో రమాదేవి, జనసేవ శ్రీనివాసరావు, విష్ణు, మస్తాన్ పాల్గొన్నారు.

గ్రామాలను కమ్మేస్తున్న 'మత్తు'

గంజాయికి బానిసలవుతున్న యువత ● దుర్భరమవుతున్న జీవితాలు ● నివారించడంలో యంత్రాంగం నిర్లక్ష్యం

సంతనూతలపాడు, సెప్టెంబరు 16: యువతే లక్ష్యంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయాలు గ్రామీణ ప్రాంతాల్లో జోరుగా సాగుతున్నాయి. చిన్న వయస్సులోనే గంజాయి రవాణా, వాడకం, అమ్మకం, మద్యానికి అలవాటు పడుతున్నారు. మత్తులో ఆర్థిక అవసరాలకు నేరాలు చేస్తున్నారు. ఇది తప్పు అని ఎవరైన అంటే విచక్షణ కోల్పోయి గొడవలకు దిగుతున్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే దేశానికి వెన్నుముకగా ఉండాల్సిన భావిపౌరులు అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదముంది. కొందరు స్వార్థపరులు అక్రమార్జన కోసం పట్టణాలతో పాటు, గ్రామీణ యువకులను పెడదారిపట్టించి వారి జీవితం నాశనం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాలకే పరిమితమైన గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఇపుడు గ్రామాల్లో యువతను సైతం టార్గెట్ చేస్తూ స్వచ్ఛమైన గ్రామాలను మత్తుతో కలుషితం చేస్తున్నారు.

మండలకేంద్రమైన సంతనూతలపాడుతో పాటు, పలుగ్రామాల్లో యువతకు కొంతమంది అక్రమార్కులు ఒంగోలు పరిసర ప్రాంతాలు, చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెం ప్రాంతం నుంచి గంజాయి అందుతున్నట్లు సమాచారం. యువతతో పాటు విద్యార్థులు సైతం గంజాయికి అలవాటు పడుతున్నారు. గ్రామాల్లో గంజాయి మత్తులో చిన్న విషయాలకే పెద్ద ఎత్తున గొడవలు పడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. సంతనూతలపాడులో కొందరు యువకులు రాత్రి సమయంలో గంజాయి సేవించి ఆ మత్తులో రోడ్లపై వెళ్లే వాహనాలను ఆపుతూ గొడవలు పడుతున్నట్లు తెలుస్తోంది. అయితే బాధితులు ఎందుకొచ్చిన గొడవలే అని వదిలేస్తున్నారు. రెండునెలల క్రితం ఏదో పనిమీద చీమకుర్తి నుంచి ద్విచక్రవాహనంపై భార్యాభర్తలు ఒంగోలు వెళ్తుండగా సంతనూతలపాడు దాటిన తర్వాత కొందరు యువకులు గంజాయి మత్తులో వారిని ఆపి నానాదుర్భాషలు ఆడారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే మళ్లీ ఏ సమస్య సృష్టిస్తారనే భయంతో వెళ్లిపోయినట్లు స్థానికులు కొందరు తెలిపారు. అయితే యువతకు గంజాయి విక్రయిస్తున్న అక్రమార్కులను సంబంధిత శాఖ అధికారులు అదుపు చేయలేకపోతున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. అలాంటి వారిపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.


గంజాయి



ఈ లక్షణాలు కనిపిస్తే..

- ఇంట్లో తరచూ డబ్బులు పోతుండటం, పొంతన లేని సమాధానం చెప్తుండటం
- చికాకు పడటం, ఫోన్‌లో మునిగిపోవడం, ఒంటరిగా ఉండటం,
- పగలు కంటే రాత్రి ఎక్కువగా చురుకుగా ఉండటం, నిద్రలేమి, కళ్లు ఎర్రగా మారి రెప్పలకింద గుంతలు ఏర్పడటం, పెదాలు పొడిగా మారడం, శరీర శుభ్రత పాటించకపోవడం, రోజురోజుకు బలహీనంగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు అప్రమత్తం కావాల్సిందే.

మొదటి గురువు వారి తల్లిదండ్రులే..



ఉరుకుల పరుగుల జీవితంలో పిల్లలతో సమయం గడిపేందుకు తల్లిదండ్రులు సమయం ఉండటం లేదు. తల్లిదండ్రులే పిల్లలకు మొదటి గురువు. వారు పిల్లలను పట్టించుకోకుంటే వారిజీవితం నాశనమయ్యే ప్రమాదముంది. వారికోసం కొంత సమయం కేటాయించారు. స్నేహితులు, రోజువారి దినచర్యను గమనించాలి. తల్లిదండ్రులు పిల్లలకు ఖర్చులకు డబ్బులు ఇస్తున్నపుడు వారు దేనికి వినియోగిస్తున్నారో పరిశీలించారు. పాఠశాలకు, కాలేజీలకు వెళ్తున్నారా లేదా అనేది పర్యవేక్షించాలి. మా వరకు పిల్లలు ఎవరైన పైవిధంగా తారసపడితే వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపిస్తున్నాం. మండలంలో ఎక్కడైన గంజాయి విక్రయాలు జరిగే కఠినచర్యలు తీసుకుంటాం. ఎవరికైన గంజాయి విక్రయించేవారు తెలిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.

-ఎం.దేవకుమార్, ఎస్ఐ, సంతనూతలపాడు

మత్తుపదార్థాలతో శారీరక ఆరోగ్యం క్షీణిస్తుంది



యువత మత్తుపదార్థాలకు అలవాటుపడితే శారీరక ఆరోగ్యం క్షీణిస్తుంది. నేరుగా మెదడు, నాడీవ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. మానసిక సమస్యలు, కిడ్నీలు దెబ్బతినడం, అడిక్షన్, కంటి సమస్యలు, క్రమంగా అయవాలపై దారుణమైన ప్రభావం చూపి చివరికి మరణానికి దారి తీస్తుంది. మత్తుకు బానిసైన యువకులకు వారిని ఆరోగ్యవంతులుగా మార్చేందుకు ప్రభుత్వం తరపున అవసరమైన చికిత్సలు అందిస్తాం.

- డాక్టర్ నాగరాజు, పీహెచ్‌సీ, సంతనూతలపాడు

ఆటోడ్రైవర్ నిజాయితీ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 16: ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌ను పోలీసులకు అప్పగించి ఆటో డ్రైవర్ మేకలప్రసాద్ తన నిజాయితీని చాటుకున్నాడు. ఈ సంఘటన సోమవారం ఒంగోలులోని రైల్వేస్టేషన్ వద్ద జరిగింది. వివరాలోకి వెళితే.. ఒంగోలు నగరం కేశవస్వామిపేటకు చెందిన మిందల లలితసాయి, విక్రమ్‌లు స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆటో ఎక్కి కేశవస్వామిపేటలో దిగారు. వారితో తెచ్చుకున్న బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయారు. అది గమనించిన ఆటో డ్రైవర్ ప్రసాద్ వెంటనే టూటౌన్ పోలీసులకు అందజేశారు. దానిలో బంగారపు ఆభరణాలు ఉన్నాయి. ఈ మేరకు టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు ఆటోలో ప్రయాణిచిన వారిని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఆటోడ్రైవర్‌తో బ్యాగ్‌ను అందజేయించారు. దీంతో బాధితులు ఆటోడ్రైవర్ నిజాయితీని ప్రశంసించారు. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ మేడా శ్రీనివాసరావు, రైటర్ వెంకట్రావు పాల్గొన్నారు.


ఆభరణాల బ్యాగ్‌ను డ్రైవర్‌తో యజమానులకు అందజేయిస్తున్న సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

సాగర్ ఆయకట్టులో ముమ్మరంగా వరి నాట్లు







సాగర్ ఆయకట్టు కింద రైతులు వరి నాట్లు వేయడం ప్రారంభించారు. నీరు వచ్చి కొద్ది కాలమే అయినా నారు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతు కూలీలకు డిమాండ్ పెరిగిపోయింది. అన్ని రకాల వ్యవసాయ పనులు ఒకేసారి రావడంతో కూలి రేట్లు కూడా పెరిగిపోయాయి. కురిచేడు మండలంలో సాగర్ ఆయకట్టు కింద అధికారికంగా 7 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అనధికారికంగా మరో 3 వేల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. మొత్తం మీద 10 వేల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం ఐనవోలు వద్ద వరినారును కొనుగోలు చేసి తెస్తున్నారు. ప్రస్తుతం దీర్ఘకాలిక వరి వంగడం బీపీటీ రకం నాటుతున్నారు. గతేడాది తీవ్ర కరువు వల్ల మాగాణి సాగు లేకపోవడం, ఈ ఏడాది సాగర్ నీరు ముందస్తుగా రావడంతో పంటలు వెంటనే సాగు చేయడానికి రైతులు ఉద్యుక్తులయ్యారు. ఈ ఏడాది రెండు పంటలు సాగుచేయాలనేది రైతుల లక్ష్యంగా కనపడుతున్నది.

-కురిచేడు

చదలవాడ రోడ్డుకు మోక్షమెప్పుడో ?

● ఇబ్బందిపడుతున్న గ్రామస్థులు



కోసుకుపోయి ఉన్న రోడ్డు, బస్సు రాకపోకలు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 16: మండలంలోని చీరాల జాతీయ రహదారి-216కి అనుసంధానంగా ఉన్న చదలవాడ గ్రామంలోకి వెళ్లే అంతర్గత రోడ్డు దెబ్బతింది. జాతీయ రహదారి విస్తరణకు ముందు అటువైపుగానే బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించేవి. తరువాత జాయతీ రహదారి నిర్మాణం పూర్తికావడంతో వాహనాలు ఈ మార్గంలోనే వెళుతున్నాయి. అయితే పల్లెవెలుగు బస్సులు మాత్రమే పాత అంతర్గత రోడ్డులో నడుస్తున్నాయి. రోడ్లు,భవనాలశాఖ పరిధిలో ఉన్న చదలవాడ అంతర్గత రోడ్డు దెబ్బతింది. హైవే విస్తరణ సమయంలో చదలవాడ గ్రామానికి తూర్పువైపునున్న చెరువులో నుంచి రహదారి నిర్మించుకొని చెరువు కట్టను పటిష్టంగా రివిట్‌మెంట్ చేయడంతో పాటు అంతర్గత రహదారిని అభివృద్ధి చేయాలని సదరు కాంట్రాక్టరు, గ్రామ పంచాయతీ మధ్య ఒప్పందం జరిగింది. గ్రామంలో ఏటా జరిగే శ్రీరఘునాయకస్వామి వారి తిరునాళ్ల సందర్భంగా జరిగే రథోత్సవం దెబ్బతిన్న అంతర్గత రోడ్డులో జరిగేది. గతంలో ఒప్పందం మేరకు రథం తిరిగే వరకైనా రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు పలు మార్లు ఉన్నతాధికారులను కలిసి విన్నవించగా ఇటీవల దక్షిణం వైపు కొంతమేర సిమెంటు రోడ్డు నిర్మించారు. ఉత్తరం వైపునా కొంత సీసీరోడ్డు వేసి మిగిలిన భాగం రోడ్డును అలాగే వదిలేశారు. దాంతో వాహనాల ధాటికి దుమ్ము లేచి రోడ్డుకిరువైపులా ఉన్న నివాస గృహాలలోకి చేరుతూ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రోడ్డు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈక్రమంలో టీడీపీ కూటమి అధికారం చేపట్టిన వెంటనే ఉప్పుగుండూరు, మద్దిరాలపాడు, త్రోవగుంట గ్రామాల పరిధిలో హైవేకు అనుసంధానంగా ఉన్న అంతర్గత రోడ్లను అభివృద్ధి చేశారు. అదేవిధంగా చదలవాడ గ్రామంలోకి వెళ్లే అంతర్గత రోడ్డును అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సేవాభావంతో అందరూ మెలగాలి

● పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

పొన్నలూరు(కొండపి), సెప్టెంబరు 16: చిడిపోతు వంశీయులమంతా సేవాభావంతో మెలిగి చిరకాలం ప్రజల్లో వెలుగుదామని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని రావులకొల్లు గ్రామంలో ఆది, సోమవారాల్లో చిడిపోతు వంశీయుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముగింపు కార్యక్రమంలో యశ్వంత్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా పది, ఇంటర్‌లలో ప్రతిభ కనపరిచిన 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున నగదు అందజేశారు. ఇంజనీరింగ్ విద్యార్థికి రూ.50 వేలు ప్రోత్సాహక బహుమతిగా ఇచ్చారు. గ్రామంలో హెల్ప్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 50 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించి విజయవాడ వైద్యశాలకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో చిడిపోతు వెంకటేశ్వర్లు, చిడిపోతు మస్తానయ్య చిడిపోతు వీరబాబు, వెంకటేశ్వర్లు, సురేష్, నాసరయ్య, మాధవరావు, శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ముసికి సాగర్ నీటి కోసం ఉద్యమించాలి

● రైతు సంఘాల నాయకులు పిలుపు


మాట్లాడుతున్న వెంకట్రావు

కొండపి, సెప్టెంబరు 16: ముసికి సాగర్ నీరు సాధించేందుకు రైతులు ఉద్యమించాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కొండపి మండల పరిషత్ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు (సీపీఎం) మాట్లాడుతూ దేశమంతా వరదలు ముంచెత్తుతుంటే కొండపి ప్రాంతంలో తాగడానికి నీళ్లు లేని దుస్థితి నెలకొన్నదన్నారు. సాగర్ నీటిని ప్రభుత్వం ముసికి మళ్లించి ఈ ప్రాంత రైతుల సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి (సీపీఐ) కె.వీరారెడ్డి మాట్లాడుతూ ముసికి సాగర్ నీటిని గతంలో వదిలిన సందర్భం ఉన్నదన్నారు. అందుకోసం రైతులు ఉద్యమం చేసి ఇప్పుడు సాగరు నీటిని తెచ్చుకోలేకపోతే పంటలు పండించుకోలేరన్నారు. ముసికి సాగర్ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న కొండపిలో రైతు సదస్సు నిర్వహించాలని రైతు, వ్యవసాయ కార్మిక, రైతుకూలీ సంఘాలు నిర్ణయించాయి. సమావేశంలో నాయకులు ఆర్.లక్ష్మి, కేజీ మస్తాన్, రైతుకూలీ సంఘం నాయకులు పరిటాల కోటేశ్వరరావు, వై.నాగరాజు, రైతులు కొల్లూరి బాలయ్య రావిపాటి వెంకటరావు, నాయకులు ముప్పరాజు చెంచయ్య, వేజెండ్ల సింగయ్య, ముప్పరాజు చినబ్రహ్మయ్య, పుట్టా రామారావు, మద్దినేని సురేష్, కుమ్మునేని నాగేశ్వరరావు, కోటపాటి రమణయ్య, ఎం.వెంకటేశ్వర్లు, గుళ్లాపల్లి వెంకట్రావు, జి.వందనం పాల్గొన్నారు.

50 మద్యం సీసాల స్వాధీనం

● ఒకరి అరెస్టు

గిద్దలూరు, సెప్టెంబరు 16: రాచర్ల మండలం జేపీచెరువు గ్రామానికి చెందిన బొజ్జా బాస్కర్ అనే బెల్టుషాపు నిర్వాహకుడి నుంచి 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు.

వరద బాధితులకు అండగా టీడీపీ శ్రేణులు


ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు నగదును అందిస్తున్న మంగమూరు నేతలు


విరాళాలను అందిస్తున్న చేకూరపాడు నాయకులు


బీఎన్‌కు నగదును అందజేస్తున్న దొడ్డవరప్పాడు-తెల్లబాడు

సంతనూతలపాడు, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముందుకు వస్తున్నారు. విరాళాలను అందజేస్తూ తమ మంచి మనసును చాటుతున్నారు. సంతనూతలపాడు మండలం మంగమూరుకు చెందిన టీడీపీ నాయకులు అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి నారాయణరావు ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన రూ.1,11,100 నగదును సోమవారం ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్బూరి చిన్న, నల్లూరి కిషోర్, కె.సింగ్‌రాజు, పి.బుజ్జి పాల్గొన్నారు. అలాగే గుమ్మళంపాడుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు సేకరించిన రూ.60వేల నగదును ఎమ్మెల్యే బీఎన్‌కు బొడ్డపాటి చంద్రశేఖర్, రమణారావు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నువ్వుల రాఘవరావు, నెప్పలి కనకయ్య, బి.వెంకటరామయ్య, బి.శ్రీనివాసరావు, శేషరావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: వరద బాధితుల కోసం చేకూరపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రూ.70వేలు, కనపర్తికి చెందిన నాయకులు రూ.25వేలు సేకరించి సోమవారం ఒంగోలులో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి గుమ్మడి సాయిబాబా, చేకూరపాడు సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు, వడ్డెళ్ల ప్రసాదరావు, చాట్ల నారాయణ, మేకల ఏసురత్నం, సురేష్, శివారెడ్డి, ముత్యాలరెడ్డి, బ్రహ్మయ్య, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

ఒంగోలు (కార్పొరేషన్): విజయవాడ వరద బాధితులకు మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు-తెల్లబాడు గ్రామ టీడీపీ నాయకులు రూ.1,55,500 విరాళాన్ని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు సోమవారం ఒంగోలులోని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాతలను అభినందించారు.

అమాయకుల ప్రాణాలు తీస్తున్నారు!

అడవి పందులు, జింకల కోసం విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్న వేటగాళ్లు

అక్రమంగా కరెంటు వాడకం

యథేచ్ఛగా వన్యప్రాణుల సంహారం

పొలాలకు వెళ్లి తీగ తగిలి రైతు మృతి

శవాన్ని మాయం చేసే ప్రయత్నం


మరణించిన మన్నెం వెంకటేశ్వర్లు (ఫైల్)


విద్యుత్ కంచె కోసం తయారు చేసిన కర్రలు


అడవిపంది కళేబరం(ఫైల్)

కొండపి, సెప్టెంబరు 16 : వన్యప్రాణుల కోసం కొందరు వేటగాళ్లు కరెంటు కంచెలు ఏర్పాటు చేసి అమాయకుల ప్రాణాలను తీస్తున్నారు. అక్రమంగా విద్యుత్ వాడుతూ అడవి పందులు, జింకలు, ఇతర జంతువులను సంహరిస్తున్నారు. ఈక్రమంలో మండలంలోని మూగచింతల గ్రామంలో వేటగాళ్లు వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె అమాయకుడైన ఓ రైతు ప్రాణాలు తీసింది. విషయం బయటకు రాకుండా ఆ రైతు శవాన్ని బావిలో పడేశారు. ఆదివారం వెలుగు చూసిన ఈ ఘటన మండలంలో సంచలనం సృష్టించింది. మాంసానికి డిమాండ్ పెరగడంతో కొంతమంది అడవి పందులు, ఇతర జంతువులను సంహరించి వాటి మాంసం విక్రయాల ద్వారా ఆదాయం పొందుతున్నారు. అయితే వాటిని వేటాడేందుకు వలలు, ఎరలు వేయడం కొంత శ్రమతో కూడుకోవడంతో వన్యప్రాణులు సంచరించే మార్గాల్లో విద్యుత్ లైన్ల నుంచి కరెంటు వాడుకుంటూ కంచెలు ఏర్పాటు చేసి పందులు, జింకలను పట్టుకుంటున్నారు. వన్యప్రాణుల వేట, అక్రమ విద్యుత్ వాడకం చట్టరీత్యా నేరమైనా పట్టించుకోవడం లేదు.

మూగచింతలలో రైతు బలి

మూగచింతల గ్రామానికి చెందిన వేటగాళ్లు గ్రామానికి అతిసమీపంలో జనం తిరిగే ప్రదేశంలో విద్యుత్ కంచెను ఏర్పాటు చేశారు. అది గమనించని రైతు మన్నెం వెంకటేశ్వర్లు (40) శనివారం రాత్రి పొలానికి వెళ్లి విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మరణించాడు. విషయం బయటపడకుండా ఉండేందుకు వేటగాళ్లు వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సుదూరంగా ఉన్న పొలాల వద్దకు తీసుకెళ్లి బావిలో పడేశారు. తర్వాత ఏమీ ఎరగనట్లు గ్రామంలోకి వచ్చారు. ఎంతకూ వెంకటేశ్వర్లు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కొండపి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అనంతరం సమస్య పెద్దదవుతుందని గ్రహించి వేటగాళ్లు విషయాన్ని గ్రామ పెద్దలకు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వేటగాళ్లు రైతు శవాన్ని మాయం చేసేందుకు యత్నించడాన్ని గ్రామస్థులు ఆక్షేపిస్తున్నారు. పోలీసులు నిందితులను గుర్తించి వారిపై అక్రమ విద్యుత్ వాడకం, వన్యప్రాణుల వేట నిషేధ చట్టం, రైతు మరణానికి కారణం కావడంతో పాటు శవాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించడంపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం

నైతికతే నిజమైన స్వేచ్ఛ

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 16: నైతికతే నిజమైన స్వేచ్ఛ అని జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం నాయకురాళ్లు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే దేశవ్యాప్త ప్రచార ఉద్యమంలో భాగంగా సోమవారం పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మితిమీరిన స్వేచ్ఛ పేరుతో చోటుచేసుకుంటున్న అనర్థాలతో మహిళపై చెడు ప్రభావం చూపుతుందన్నారు. నిజమైన స్వేచ్ఛ అనేది నైతికతతోనే సాధ్యమన్నారు. యథార్థాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే సదుద్దేశంతో ఈ జాతీయ స్థాయి ఉద్యమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో భాగంగా సదస్సులు, పాఠశాల, కళాశాలల స్థాయిలో వ్యాసరచన పోటీలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జైహెచ్ నాయకురాళ్లు షాహేద, తుమయ్య అమీనా, ఆసిఫా, ఆయేషా, బీబీ జాన్, బషిరున్నీసా, హీనా, తాఫియా తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన నాగరాజు

మార్కాపురం, సెప్టెంబరు 16: మార్కాపురం డీఎస్పీగా యు.నాగరాజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న ఆయన్ను డీజీపీ తిరుమలరావు ఆదివారం మార్కాపురం డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సోమవారం సాయంత్రం ఆయన విధుల్లో చేరారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మార్కాపురం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. డివిజన్ పరిధిలోని పలువురు సీఐలు, ఎస్సైలు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



జి.హసాన్

త్రిపురాంతకం, సెప్టెంబరు 16: త్రిపురాంతకం సీఐగా జి.హసాన్ సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.సుబ్బారావు రేంజ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. రేంజ్ వీఆర్ నుంచి బదిలీపై వచ్చిన జి.హసాన్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా త్రిపురాంతకం ఎస్సై, పోలీసు సిబ్బందితో స మావేశం నిర్వహించి, స్థానిక పరిస్థితులపై చర్చించారు.

కొమరోలు ఎస్ఐగా వెంకటేశ్వర నాయక్



వెంకటేశ్వరనాయక్

కొమరోలు, సెప్టెంబరు 16: కొమరోలు ఎస్ఐగా ఎం.వెంకటేశ్వరనాయక్ నియమితులయ్యారు. వీఆర్‌లో ఉన్న ఆయనను కొమరోలుకు బదిలీచేశారు. ఆయన గతంలో ఆర్థవీడు ఎస్ఐగా పనిచేశారు. ఇక్కడ పనిచేస్తున్న మధుసూదన్‌రావు వెలిగండ్లకు బదిలీఅయ్యారు.

పుల్లలచెరువు ఎస్ఐగా పి.రాజేష్

పుల్లలచెరువు, సెప్టెంబరు 16: పుల్లలచెరువు ఎస్ఐగా పి.రాజేష్ రాజేష్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం జిల్లా ఎస్పీ దమోదర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలులో వీఆర్ నుంచి ఆయన పుల్లలచెరువు ఎస్ఐగా నియమితులయ్యారు.

పమిడి వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న బెజవాడ వెంకట్రావు

కొనకనమిట్ల, సెప్టెంబరు 16: పమిడి వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివని కాకతీయ సేవసమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెజవాడ వెంకట్రావు అన్నారు. సోమవారం మండలంలోని చినమనగుండం గ్రామంలో జరిగిన పమిడి సంతాప సభలో ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. వెలుగొండలో అన్నసత్రం ఏర్పాటు చేసి పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడంలో ఆయన ఎనలేనిపాత్ర వహించారన్నారు. టీడీపీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేశారని చెప్పారు. సుమారు పది సంవత్సరాలుగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలుగొండ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఏర్పాటుచేసిన కాకతీయ అన్నదాన సత్రం అధ్యక్షులుగా సేవ చేశారన్నారు.

మాజీ జడ్పీటీసీ కాటూరి పెదబాబు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తూ యూనియన్ నాయకుడిగా ఉంటూ తోటి ఉద్యోగులకు ఏఅవసరం వచ్చినా నేను ఉన్నానంటూ ధైర్యాన్ని ఇచ్చేవారన్నారు. చినమనగుండం గ్రామంలో టీడీపీ నాయకునిగా విశేషసేవలు అందించారని చె ప్పారు. కార్యక్రమంలో కాకతీయ సేవా సమాఖ్య కార్యదర్శి వెలగా కోటేశ్వరరావు, కో శాధికారి మండవ శేషగిరిరావు, పమిడి వెంకట్రావు, కనిగిరి ఆర్టీసీ డీఎం శ్రీమన్నా రాయణ, శ్రీశైలం కాకతీయ కమ్మసత్రం ఉపాధ్యక్షుడు వెంగయ్య, మర్రిపూడి మాజీ ఎంపీపీ యర్రమోతు శ్రీనివాసులు, ఏ.బాదుల్లా, ఆనికాళ్ళ వీరారెడ్డి కల్లం సుబ్బారె డ్డి, పిల్లి రమణారెడ్డి, ముప్పవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటి కోసం ఉద్యమించాలి

కొండపి, సెప్టెంబరు 16: మునికి సాగర్ నీరు సాధించేందుకు రైతులు ఉద్యమించాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు (సీపీఎం) మట్లాడుతూ దేశమంతా వరదలు ముంచెత్తుతుంటే కొండపి ప్రాంతంలో తాగడానికి నీళ్లు లేని దుస్థితి నెలకొన్నదన్నారు. సాగర్ నీటిని ప్రభుత్వం మునికి మళ్లించి ఈప్రాంత రైతుల సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి (సీపీఐ) కె.వీరారెడ్డి మాట్లాడుతూ మునికి సాగర్ నీటిని గతంలో వదిలిన సందర్భం ఉన్నదన్నారు. అందుకోసం రైతులు ఉద్యమం చేసి ఇప్పుడు సాగరు నీటిని తెచ్చుకోలేకపోతే పంటలు పండించుకోలేరన్నారు. మునికి సాగర్ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న కొండపిలో రైతు సదస్సు నిర్వహించాలని రైతు, వ్యవసాయ కార్మిక, రైతుకూలీ సంఘాలు నిర్ణయించాయి. సమావేశంలో సీపీఐ, సీపీఎం మండల నాయకులు ఆర్.లక్ష్మి, కేజీ మస్తాన్, రైతుకూలీ సంఘం నాయకులు పరిటాల కోటేశ్వరరావు, వై.నాగరాజు, రైతులు కొల్లూరి బాలయ్య, రావిపాటి వెంకటరావు, నాయకులు ముప్పరాజు చెంచయ్య, వేజెండ్ల సింగయ్య, ముప్పరాజు చిన్నబ్రహ్మయ్య, పుట్టా రామారావు, మద్దినేని సురేష్, కమ్మనేని నాగేశ్వరరావు, కోటపాటి రమణయ్య, ఎం.వెంకటేశ్వర్లు, గుళ్లాపల్లి వెంకట్రావు, జి.వందనం పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

గిద్దలూరు, సెప్టెంబరు 16: జమాయత్ ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో స్థానిక స్టార్ టింబర్ డిపో ఆవరణలో మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇస్లాం చివరి ప్రవక్త మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఈపండగను జరుపుకుంటారని పలువురు పేర్కొన్నారు. జమాయత్ ఇస్లామి హింద్ ప్రతినిధి షేక్ ఖదీర్ బాషా మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి ఆయన అందించిన శాంతి సందేశాలు, పవిత్ర ఖురాన్ అవతరణ, సందేశం గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ నారాయణ, మాజీ ఉపసర్పంచ్ సయ్యద్ అబ్దుల్‌రఖీబ్, రిటైర్డ్ హౌసింగ్ డీఈ గోరంట్లయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం సత్యనారాయణ, మత గురువు ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు స్వీట్లు పంపిణీ



పేద ముస్లిం కుటుంబాలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం, సెప్టెంబరు 16: కంభం పట్టణంలోని అరాఫత్ నగర్‌లో నివసిస్తున్న పేద ముస్లిం కుటుంబాలకు ఎస్సై నరసింహారావు స్వీట్ బాక్స్‌లు పంపిణీచేశారు. ఈసందర్భంగా మిలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలిపారు. నిరుపేదలను గుర్తించి స్వీట్లు పంపిణీ చేసినందుకు ఎస్సైకి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

మండుతున్న ఎండలు.. ఎండుతున్న మిరప మొక్కలు

- బోర్లలో రాని నీరు
- వర్షం కోసం రైతుల ఎదురుచూపు
- ఇప్పటికే రూ.లక్షల పెట్టుబడి



నీటి తడులు లేక ఎండుతున్న మిరప మొక్కలు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 16: ఇటీవల కురిసిన వానకు రైతుల్లో ఆశలు రేకెత్తించాయి. పైగా నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చిన్నగుడిపాడు చెరువు మినహా మిగిలిన చెరువులన్నీ నిండిపోయాయి. పదును సరిపోవడంతో విస్తారంగా మిరప నాట్లు వేశారు. తీరా నీటి తడులిద్దామనుకుంటే బోరు బావుల్లో నీరు రావడం లేదు. వచ్చినా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు.

లక్షల రూపాయలు వెచ్చించి రైతులు మిరప నాట్లు వేశారు. వాతావరణం ఒక్కసారిగా మారి పోయింది. నాట్లు వేసినంత కాలం చల్లగా ఉంది. పూర్తయ్యే సరికి ఎండలు దంచి కొడుతున్నాయి. వడగాలులు వీస్తున్నాయి. చెరువులకు దగ్గరగా ఉన్న కొద్ది మందికి బోర్లలో పుష్కలంగా నీరు వస్తోంది. ఎక్కువ శాతం మంది రైతులకు బోరుబావుల్లో నీరు లభించక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. మండుతున్న ఎండలకు మొక్కలు ఎండమొఖం పట్టాయి. దీంతో వాన కోసం ఎదురు చూస్తున్నారు. కేవలం పొలంలో మిరప మొక్కలు నాటినందుకు ఎంత లేదన్నా ఎకరాకు రూ.28 వేల నుంచి రూ.35 వేల వరకు ఖర్చయింది.

చెరువులు నిండినా ఫలితం శూన్యం

మండలంలో ప్రధానంగా పెద్ద బొమ్మలాపురం, కడపరాజుపల్లె, గంటవానిపల్లె, చిన్నగుడిపాడు, బలిజేపల్లి ఎగువ చెర్లోపల్లి, కటకానిపల్లె చెరువులు పెద్దవి. చిన్నగుడిపాడు చెరువు మినహా అన్ని చెరువులకు నీరు చేరింది. అయితే, ఆయకట్టు భూములకు నీరు చేరే మార్గమే లేదు. చెరువులకు తూములు, పంట కాలువలు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకున్న పాపాన పోలేదు. చాలాచోట్ల పంట కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో ఆయకట్టు రైతులకు ఫలితం లేకుండా పోయింది.

విద్యుత్ కోతలతో సతమతం

మండలంలో కొన్ని బోరుబావులకు నీరొస్తున్నా తరచూ విద్యుత్ అంతరాయంతో నీటి తడులు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించడం లేదు. ఇలాగైతే మిరపను ఎలా కాపాడుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.



నీటి తడుల కోసం తీగలేరు వాగులో ఏర్పాటుచేసిన మోటార్లు

ఊరటనిస్తున్న తీగలేరు

ఇటీవల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి తీగలేరు ఉధృతంగా ప్రవహించింది. ఆ క్రమంలో కాలువలో అక్కడక్కడ నిలువ వున్న నీరు కొందరు రైతులకు ఊరట నిస్తోంది. కాలువలో మోటార్లు ఏర్పాటుచేసుకుని నీటిని తరలిస్తూ మిరప మొక్కలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఇవి ఉపశమనం మాత్రమే. వర్షాలు కురిస్తేనే పం టలు పండించగల్గుతామని రైతులు చెబుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు

- సీఐ సుబ్బారావు



మార్కెట్ ఏరియాలో దుకాణదారులకు సూచనలిస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, సెప్టెంబరు 16: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని సీఐ పి.సుబ్బారావు అన్నారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్న పలు ప్రాంతాల్లో సోమవారం సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలో రోజురోజుకు వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిపోయాయన్నారు. రహదారులు కుంచించుకుపోయిన నేపథ్యంలో వాహనదారులు, దుకాణయజమానులు సహకరిస్తేనే ప్రధాన వీధుల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు వీలు కలుగుతుందన్నారు.

నిబంధనలు ఉల్లంఘించి రహదారుల్లో ప్రయాణానికి ఎవరు ఆటంకం కల్గించినా చట్టపరంగా చర్యలు తీవ్రంగా ఉంటాయని దుకాణదారులను సీఐ సుబ్బారావు హెచ్చరించారు. ఆయన వెంట పట్టణ ఎస్సై సైదుబాబు, ట్రైనీ ఎస్సై రాజమోహనరావు, సిబ్బంది ఉన్నారు.

మీర్జపేటలో మౌలిక వసతులు కరువు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపైకి చేరిన మురుగునీరు



అధ్వానంగా అంతర్గత రోడ్డు

తర్లుపాడు, సెప్టెంబరు 16: మండలంలోని మీర్జపేట సమస్యలకు నిలయంగా మారింది. గ్రామంలో కనీసం మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గ్రామంలో సైడు కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించి దుర్గంధం వెదజల్లుతుంది. పరిస్థితి ఇలా ఉంటే సీజనల్ వ్యాదులు వ్యాపిస్తాయామోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ నిధులు ఆవిరవుతున్నాయి కానీ గ్రామంలోని సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. గ్రామంలో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖలాలు లేవు. ఇటీవల గ్రామంలో కనీసం మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని, పంచాయతీకి వచ్చే నిధులు, ఖర్చులు తెలపాలంటూ టీడీపీ నాయకులు సచివాలయంలో అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో కనీస వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ బదిలీలతో ఆశాఖ ప్రతిష్ట పెరిగేనా!

- పాతుకుపోయిన వీఆర్వోలకు స్థాన చలనం కలిగేనా

మర్రిపూడి, సెప్టెంబరు 16 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ శాఖ ప్రతిష్ట మసకబారింది. ఐదేళ్లపాలనలో 10 మందికిపైగా తహసీల్దార్లు బదిలీ కావడం ఆశాఖ పనితీరును తేటతెల్ల చేసింది. అంతేకాకుండా పన్నూరు భూ వ్యవహారంలో అప్పటి తహసీల్దార్ కృష్ణారావ్, డిప్యూటీ తహసీల్దార్ జగదీష్, ఇన్‌చార్జ్ ఆర్ఐ శేషాచలం, వీఆర్వో శివారెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే. మర్రిపూడి మండలం నుంచి బెంగళూరు విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతుండటంతో ఆయాగ్రామాలకు చెందిన వీఆర్వోలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపించాయి. ఈ ఆరోపణల నేపథ్యంలోనే ఆనలుగురి అధికారులపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. నలుగురి అధికారులపై వేటు పడటం రెన్యూశాఖ ప్రతిష్టను మంట కలిపింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పెద్దఎత్తున బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ ప్రక్షాళన జరగాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం రైతులు మీసేవా కేంద్రాల్లో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ కుంటిసాకులతో తిరస్కరిస్తుండటంపై అన్నదాతల్లో ఆగ్రహం పెల్లుబిక్కింది. అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ దృష్టికి పలువురు వీఆర్వోలు చేస్తున్న అవినీతిపై రైతులు పెద్దఎత్తున ఫిర్యాదు చేశారు. అప్పటి మంత్రి ఆదేశాల మేరకు మర్రిపూడి వీఆర్వోను కొద్దికాలం విధులకు దూరంగా పెట్టారు. మండల కేంద్రంలో పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసిన విశ్రాంత ఉద్యోగులను గత కొన్నేళ్లుగా కాళ్లకు చెప్పులు అరిగేలా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్న ఘనత ఆ వీఆర్వోకు దక్కుతుంది. మరో మాజీ రెవెన్యూ అధికారి పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకోగా ఓ వీఆర్వో రెండు లక్షలు లంచం అడిగినట్లు సమాచారం.

ఇప్పటికైనా రెవెన్యూ అధికారుల బదిలీలతో ఆశాఖ ప్రతిష్ట పెరుగుతుందేమోనని, అదే విధంగా అవినీతి అధికారులకు స్థాన చలనం కలుగుందేమోనని మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

అమాయకుల ప్రాణాలు తీస్తున్నారు!

- అడవి పందులు, జింకల కోసం విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్న వేటగాళ్లు
- అక్రమంగా కరెంటు వాడకం
- యథేచ్ఛగా వన్యప్రాణుల సంహారం
- పొలాలకు వెళ్లి తీగ తగిలి రైతు మృతి
- శవాన్ని మాయం చేసే ప్రయత్నం



విద్యుత్ షాక్‌తో మరణించిన వెంకటేశ్వర్లు (ఫైల్)



విద్యుత్ కంచె ఏర్పాటు చేసేందుకు తయారు చేసిన కర్రలు

కొండపి, సెప్టెంబరు 16: వన్యప్రాణుల కోసం కొందరు వేటగాళ్లు కరెంటు కంచెలు ఏర్పాటుచేసి అమాయకుల ప్రాణాలను తీస్తున్నారు. అక్రమంగా విద్యుత్ వాడుతూ అడవి పందులు, జింకలు, ఇతర జంతువులను సంహరిస్తున్నారు. ఈక్రమంలో మండలంలోని మూగచింతల గ్రామంలో వేటగాళ్లు వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె అమాయకుడైన ఓ రైతు ప్రాణాలు తీసింది. విషయం బయటకు రాకుండా ఆ రైతు శవాన్ని బావిలో పడేశారు. ఆదివారం వెలుగు చూసిన ఈ ఘటన మండలంలో సంచలనం సృష్టించింది. మాంసానికి డిమాండ్ పెరగడంతో కొంతమంది అడవి పందులు, ఇతర జంతువులను సంహరించి వాటి మాంసం విక్రయాల ద్వారా ఆదాయం పొందుతున్నారు. అయితే వాటిని వేటాడేందుకు వలలు, ఎరలు వేయడం కొంత శ్రమతో కూడుకోవడంతో వన్యప్రాణులు సంచరించే మార్గాల్లో విద్యుత్ లైన్ల నుంచి కరెంటు వాడుకుంటూ కంచెలు ఏర్పాటు చేసి పందులు, జింకలను పట్టుకుంటున్నారు. వన్యప్రాణుల వేట, అక్రమ విద్యుత్ వాడకం చట్టరీత్యా నేరమైనా పట్టించుకోవడం లేదు.

మూగచింతలలో రైతు బలి

మూగచింతల గ్రామానికి చెందిన వేటగాళ్లు గ్రామానికి అతిసమీపంలో జనం తిరిగే ప్రదేశంలో విద్యుత్ కంచెను ఏర్పాటు చేశారు. అది గమనించని రైతు మన్నెం వెంకటేశ్వర్లు (40) శనివారం రాత్రి పొలానికి వెళ్లి విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మరణించాడు. విషయం బయటపడకుండా ఉండేందుకు వేటగాళ్లు వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సుదూరంగా ఉన్న పొలాల వద్దకు తీసుకెళ్లి బావిలో పడేశారు. తర్వాత ఏమీ ఎరగనట్టు గ్రామంలోకి వచ్చారు. ఎంతకూ వెంకటేశ్వర్లు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కొండపి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అనంతరం సమస్య పెద్దదవుతుందని గ్రహించి వేటగాళ్లు విషయాన్ని గ్రామ పెద్దలకు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వేటగాళ్లు రైతు శవాన్ని మాయం చేసేందుకు యత్నించడాన్ని గ్రామస్థులు ఆక్షేపిస్తున్నారు. పోలీసులు నిందితులను గుర్తించి వారిపై అక్రమ విద్యుత్ వాడకం, వన్యప్రాణుల వేట నిషేధ చట్టం, రైతు మరణానికి కారణం కావడంతోపాటు శవాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించడంపై వివిధ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 16: రాష్ట్రంలో మెడికల్‌కాలేజీలను ప్రైవేటీకరణ చేసే విధానాలను ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యను హక్కుగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తన బాధ్యతను మర్చి ప్రైవేటుకు వైద్యవిద్య పట్టం కట్టడం దుర్మార్గమని విమర్శించారు. కేంద్రంతో సంప్రదించి ఐదు మెడికల్ కళాశాలలకు అనుమ తులు తీసుకోవాల్సిన ప్రభుత్వం పులివెందులకు వచ్చిన 50 సీట్లు కూడా వసతులు కల్పించలేమని ప్రభుత్వమే ఎన్‌ఎంసీకి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పూర్తి చేసి వచ్చే ఏడాది నుంచి తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై సర్వే

మద్దిపాడు, సెప్టెంబరు 16: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు అక్టోబరు 9వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని ఎంఈవో ఆంజనేయులు సోమవారం తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన లేక బిడ్డల భవిష్యత్‌పై నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారిని ఒప్పించి భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు సన్నద్ధమవుతున్నారన్నారు. వైకల్యం శాతం అధికంగా ఉన్న వారికి సదరన్ ధృవపత్రాలతో పింఛన్, బస్సు, రైల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి, తక్కువ వైకల్యం ఉన్న పిల్లల తల్లిదండ్రులు రవాణా ఖర్చు కింద రూ.3 వేలు, ఉపకార వేతనం రూ.2 వేలు, అలాగే 9,10 తరగతుల్లో విద్యార్థులకు ఉపకార వేతనాలు ఏడాదికి రూ.9 వేల నుంచి రూ.11 వేల వరకు అందజేస్తామని ఎంఈవో పేర్కొన్నారు.

రేపటి నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

కంభం, సెప్టెంబరు 16: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగంలో ఈనెల 18 నుంచి 20 వరకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బి.మాల్యాద్రి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా, బ్యాడ్మింటన్ పోటీలను మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. పోటీలకు హాజరయ్యేవారు తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇతర నిర్ధారణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలతోపాటు గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యార్థులు కూడా పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు.

యశ్వంత్‌పూర్ వరకు రైలు పొడిగింపు

గిద్దలూరు, సెప్టెంబరు 16: హౌరా నుంచి గిద్దలూరు మీదుగా సత్యసాయి ప్రశాంతి నిలయానికి తిరుగుతున్న వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును యశ్వంత్‌పూర్ వరకు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. హౌరా నుంచి గిద్దలూరు మీదుగా సత్యసాయి ప్రశాంతి నిలయానికి (22831) తిరిగే రైలు ఈనెల 25 నుంచి యశ్వంత్‌పూర్ వరకు పొడిగించారు. అలాగే సత్యసాయి ప్రశాంతి నిలయం నుంచి గిద్దలూరు మీదుగా హౌరా (22832) మధ్య తిరిగే వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 27 నుంచి యశ్వంత్‌పూర్ నుంచి బయలుదేరుతుందని పేర్కొన్నారు. హౌరా-ప్రశాంతినిలయం మధ్యన గతంలో ఉన్న రాకపోకల వేళల్లో ఎలాంటి మార్పులేదని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని స్థానిక రైల్వే కమర్షియల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విశ్వకర్మ జయంతి

గిద్దలూరు, సెప్టెంబరు 16: పట్టణంలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం పది గంటలకు గాయత్రి విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు బంగారు పెద్దశ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

వరద బాధితులకు కూరగాయలు అందజేత

పెద్దదోర్నాల, సెప్టెంబరు 16: ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులకు దోర్నాల క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో కిరాణా సరుకులు, కూరగాయలు సోమవారం అందజేశారు. విజయవాడలోని వాంబే కాలనీ, వైఎస్సార్ కాలనీలోని క్రీస్తు సంఘం సభ్యులకు బియ్యం, కిరాణా సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సువార్తికులు ఐ.జోషఫ్, మైకిల్, చాట్ల యిర్మియా, కోటయ్య, పెద్ద యోహాను పాల్గొన్నారు.

రహదారిపై చిల్లచెట్ల తొలగింపు

మార్కాపురం రూరల్ 16. మండలంలోని గొట్టిపడియ గ్రామ రహదారిపై ఉన్న పిచ్చి చెట్లను ఆగ్రామ టీడీపీ నాయకుడు ఒంటెద్దు చిన్న రంగారెడ్డి రూ.50 వేలు వెచ్చించి తొలగించారు. రహదారికి ఇరువైపులా పిచ్చికంప దట్టంగా పెరగడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ ఉపయోగం లేక పోవడంతో సొంతడబ్బులతో ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. ఈసందర్భంగా ఆయనను గ్రామస్థులు అభినందించారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 16: పేకాట శిబిరాలపై పోలీసులు దాడులుచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1650 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈఘటన సోమవారం మండలంలోని యడవల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై వి.మహేశ్ తెలిపిన వివరాల మేరకు.. పేకాట ఆడుతున్నట్టు సమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సీతారాం ఏచూరికి నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 16: ప్రజల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి సీతారాం ఏచూరి అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ సోమవారం నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా రఫీ మాట్లాడుతూ ఏచూరి ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు సుబ్బరాయుడు, సలాంఖాన్, హరి, ఇమాంసా, చెన్నకేశవులు, అల్లూరయ్య, పి.శీను, రషీద్, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పూజలు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 16: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం బీజేపీ నాయకులు పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో మంత్రి పేరుమీద ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడిమర్రి శ్రీనివాసరావు, శాసనాల సరోజిని, బొంతల కృష్ణ, చిన్నయ్య, మద్దెల లక్ష్మీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లికన్ పార్టీ బలోపేతానికి కృషి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 16: అధికారంలో భాగస్వామ్యం పొందడమే గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామలింగం అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాన్యుడి చేతిలో అధికార పగ్గాలు ఉండాలన్న సంకల్పంతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మనవుడు భీమారావు అంబేడ్కర్ గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ స్థాపించారని చెప్పారు. పార్టీ సభ్యత్వ కార్యక్రమం డిసెంబర్ 29 వరకు కొనసాగుతుందన్నారు. రానున్న ఎన్నికల నాటికి బలమైన పార్టీగా రూపొందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి దార్ల రత్నం, న్యాయవాది అబ్దుల సలాం, పల్నాటి రెహమాన్, జి.వెంకటేశ్వర్లు, శీను, కాశీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 16: వినాయక చవితి పురస్కరించుకుని పట్టణంలోని వివిధ మండపాల వద్ద ఏర్పాటుచేసిన గణనాథులు సోమవారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. పట్టణంలోని వాడవాడలా తొమ్మిదిరోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోలాహలంగా వినాయకులను నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని మెయిన్ బజార్, రథం వీధి, కోనేటి వీధి, అలుగు వీధి తదితర ప్రాంతాల నుంచి గణేశుని విగ్రహాలు సందడి వాతావరణం మధ్య తరలించి నిమజ్జనం చేశారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

పొదిలి, సెప్టెంబరు 16: కూటమి ప్రభుత్వం ఇసుక సరిపడినంత అందించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి భద్రత కల్పించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ కోరారు. ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కార్యకలాపాలను పుణరుద్ధరించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 18న తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు రమేష్ తెలిపారు.

50 మద్యం సీసాల స్వాధీనం.. ఒకరి అరెస్టు

గిద్దలూరు, సెప్టెంబరు 16: రాచర్ల మండలం జేపీచెరువు గ్రామానికి చెందిన బొజ్జా భాస్కర్ అనే బెల్టుషాపు నిర్వాహకుడి నుంచి 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

క్రీడలతో స్నేహభావం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 16: క్రీడలతో ఉపాధ్యాయల మధ్య స్నేహభావం పెరుగుందని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్‌స్కూలులో రెండో రోజైన సోమవారం క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో జరిగిన పలు పోటీలకు 600మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. డిసెంబరు 14 నుంచి మూడు రోజుల పాటుకాకినాడలో జరిగే స్వర్ణోత్సవాల్లో బహుమతులు అందజేస్తారని తెలిపారు.



ఆసుపత్రిలో ప్రముఖ వైద్యులు సుబ్బారావుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన ఉగ్ర

కనిగిరి, సెప్టెంబరు 16 : కనిగిరి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విస్తృతంగా పర్యటించారు. తొలుత పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు రిటైర్డ్ డాక్టర్ సుబ్బారావును ప్రత్యేకంగా బెంగళూరు నుంచి ఎమ్మెల్యే పిలిపించారు. ప్రభుత్వాసుపత్రిలో తల్లి, బిడ్డ సంరక్షణ, ప్రసూతి, ప్రసవం విభాగానికి చెందిన ప్రత్యేక గదులను ఎమ్మెల్యే తన సొంత నిధులతో అధునాతనంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ విషయంపై ఆయా డాక్టర్ సుబ్బారావు నుంచి ప్రత్యేక సూచనలు, విభాగాల ఏర్పాట్లపై సూచనలు, సలహాలను స్వీకరించి ఆ దిశగా పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. ఆసుపత్రిలో తన సొంత నిధులతో పాటు స్నేహితులు, టీడీపీ నాయకులు, శ్రేయోభిలాషులు ఇప్పటికి రూ.3లక్షలు విరాళాలు అందజేసినట్లు తెలిపారు. దాతల్లో షేక్ ముస్తాక్, జయరామిరెడ్డి, ఉగ్ర అభిమానులు, బోయిళ్ల తిరుపతిరెడ్డి, కే రామ్మోహన్, పబత్తి వెంకట నారాయణగుప్తా, గడ్డం గురుపద్మలత అనే దాతలు సహకారం అందించారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని తీగలగొందిలో ఈ నెల 18వ తేదీన ప్రారంభించబోయే అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న రైతుబజార్ పనులను పరిశీలించారు. అనంతరం మిలాద్‌ఉన్‌నబీ పండుగ సందర్భంగా ముస్లింలతో కలసి స్థానిక లైబ్రరీ వద్ద ఉన్న దర్గా వద్ద జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, దింటకుర్తి సుబ్రహ్మణ్యం, ఫిరోజ్, కాంట్రాక్టర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, మాజీ కోఆప్షన్ షరీఫ్, తమ్మినేని వెంకటరెడ్డి, చిలకపాటి లక్ష్మయ్య, నజీముద్దీన్, తమ్మినేని చినరామిరెడ్డి, తిరుమల శ్రీను పాల్గొన్నారు.

వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాం

సొంత నిధులతో జాబ్ మేళా ఏర్పాటు

బ్రోచర్ల ఆవిష్కరణలో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, పాపారావు తదితరులు

దర్శి, సెప్టెంబరు 16 : నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు సొంత నిధులతో ఈ నెల 18వ తేదీన దర్శి పట్టణంలోని పీడీఎస్ కల్యాణ మండపంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. దర్శిలోని ఆమె నివాసంలో సోమవారం సాయంత్రం జాబ్ మేళా బ్రోచర్లను మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సందర్భంగా అన్ని గ్రామాల్లో యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలులేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఆ సమయంలో వారికి ఇచ్చిన హామీ మేరకు సొంత నిధులతో జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మేళాలో టెక్ మహీంద్ర, అమర్‌రాజా వంటి ప్రతిష్ఠాత్మకమైన 32 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. మొత్తం వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 880 దరఖాస్తులు వచ్చాయన్నారు. మరో రెండు రోజుల సమయం ఉన్నందున అభ్యర్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెప్పారు. నియోజకవర్గంతోపాటు ఎర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాలకు చెందిన యువతీ యువకులు కూడా దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ జాబ్ మేళా ప్రతి ఆరునెలలకు ఒకసారి నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పుడు ఉద్యోగం రాని యువతకు హెచ్ఆర్‌ఏ సంస్థ ద్వారా శిక్షణ ఇప్పించి మళ్లీ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. దొనకొండలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయటం కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున ఇచ్చిన హామీ మేరకు స్వంత నిధులతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, తాళ్లూరు ఎంపీపీ శ్రీనివాసరావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తాళ్లూరు, దొనకొండ ముండ్లమూరు కురిచేడు మండలాల పార్టీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, నాగులపాటి శివకోటేశ్వరరావు, కూరపాటి శ్రీనివాసరావు, నెమలయ్య, దర్శి పట్టణ టీడీపీ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి సందు రామయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వరగాని పౌలు, మారెళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఐకివినతిపత్రం అందజేత

ఎన్నికల సందర్భంగా, ఆ తర్వాత టీడీపీ శ్రేణులపై దాడులు చేసిన వైసీపీ గుండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం దర్శి సీఐ వై రామారావుకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావులు వినతిపత్రం అందజేశారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

తాళ్లూరు, సెప్టెంబరు 16 : నిరుద్యోగ, యువతీయువకులకు ఉపాధి అవకాశం కల్పించేందుకు దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ స్థానిక పీటీఎస్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగులు హాజరుకావాలని కోరారు.



కాంతికి యోగా సర్టిఫికెట్ అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

రాష్ట్ర స్థాయి యోగాలో పామూరు విద్యార్థినికి 4వ ర్యాంక్

పామూరు, సెప్టెంబరు 16 : విశాఖపట్టణంలో జరిగిన 49వ రాష్ట్రస్థాయి అసోసియేషన్ యోగా పోటీలలో పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని 4వ ర్యాంక్ సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు షేక్ మస్తాని తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని కే శాంతి 4వ స్థానం సాధించి మెడల్, ప్రశంసాపత్రం అందుకుంది. పాఠశాలకు గుర్తింపుతెచ్చిన శాంతికి, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు మస్తానిలను హెచ్‌ఎం రామస్వామి, ఉపాధ్యాయులు అభినందించారు.

దేకనకొండ కేసులో 20 మంది అరెస్టు

కురిచేడు, సెప్టెంబరు 16 : మండలంలోని దేకనకొండ గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా తెలుగుదేశం, వైసీపీలకు చెందిన వారి మధ్య ఘర్షణ జరిగిన కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘర్షణల్లో టీడీపీకి చెందిన 10 మంది, వైసీపీకి చెందిన ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు ఏఆర్ పార్టీతో కలసి గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. ఇరుపార్టీల ఫిర్యాదు మేరకు కేసులు నమోదయ్యాయి. సోమవారం టీడీపీకి చెందిన 20 మందిని అరెస్టు చేసి కనిగిరి కోర్టులో హాజరు పరిచారు. వారికి జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ శివ తెలిపారు. శనివారం వైసీపీకి చెందిన 21 మందిని అరెస్టు చేసి కోర్టుకు పెట్టగా వారికి 14 రోజులు రిమాడ్ విధించారు. వైసీపీ వారిని దర్శి సబ్ జైలులో ఉంచారు.

పామూరు, సీఎస్‌పురం నూతన ఎస్‌ఐలు నియామకం

పామూరు, సెప్టెంబరు 16 : పామూరు, సీఎస్‌పురం పోలీస్‌స్టేషన్‌లకు నూతన ఎస్‌ఐలుగా టీ కిషోర్, ఆర్ సుమన్‌లను నియమిస్తూ జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా పామూరు ఇన్‌చార్జి ఎస్ఐ ఎం వెంకటరాజేష్‌ను వీఆర్‌కు పంపిస్తు ఒంగోలు వన్‌టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న కిషోర్‌బాబును పామూరుకు బదిలీ చేశారు. ఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ సుమన్‌ను సీఎస్‌పురం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా నియమించారు. ఇప్పటి వరకు ఎస్ఐగా సేవలు అందించిన బి ప్రేమ్‌కుమార్‌ను వీఆర్‌కు పంపించారు.

పీసీపల్లి ఎస్సైగా కోటయ్య



ఎస్సై కోటయ్య

పీసీపల్లి, సెప్టెంబరు 16 : పీసీపల్లి ఎస్సైగా జి.కోటయ్యను నియమిస్తూ జిల్లా ఎస్పీ ఎఆర్.దామోదర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈయన 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు పీసీపల్లి ఎస్సైగా పనిచేశారు. ఎన్నికల బదిలీలో భాగంగా పొదిలికి వెళ్లారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన రమేష్‌బాబు కొద్దిరోజుల క్రితం బదిలీపై మర్రిపూడి మండలానికి వెళ్లారు. తిరిగి పీసీపల్లి ఎస్సైగా కోటయ్యను నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు.

భక్తిశ్రద్ధలతో ఈద్ మిలాద్ ఉన్ ఎ నబీ వేడుకలు

పామూరు, సెప్టెంబరు 16 : ఇస్లాం వ్యవస్థాపకుడు ముస్లింల ఆరాధ్య ప్రవక్త మహ్మద్ ప్రవక్త మిలాద్ ఉన్-ఎ-నబీ జన్మదిన వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

వైసీపీలో దళితులకు స్థానం లేదు

- దళితుల మనోభావాలను అర్థం చేసుకోలేని వ్యక్తి జగన్
- ఆరోగ్యశ్రీ పథకాన్ని కమీషన్లతో దోపిడీ
- ఆ పార్టీని వీడుతున్నట్లు ప్రకటించిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ అశోక్‌బాబు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 16 : వైసీపీలో దళితులకు, పేదలకు స్థానం లేదని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్‌బాబు ఆరోపించారు. దళితుల మనోభావాలను అర్థం చేసుకోలేని వ్యక్తి పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అని విమర్శించారు. ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని తన కార్యాలయంలో సోమవారం తన సతీమణి, నాగులుప్పలపాడు జడ్పీటీసీ డాక్టర్ రత్నభారతితో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీలో సంతోషంగా దళితులు లేరన్నారు. తనకు పదవి ఇచ్చారే తప్ప తన వెనుక షాడోలను ఏర్పాటు చేసి వారే హాస్పటల్స్‌కు వెళ్ళేవారన్నారు. అప్పటి మంత్రి విడదల రజని, ఐఏఎస్ అధికారులు కిషోర్‌బాబు, ధనుంజయరెడ్డి, శివారెడ్డి, అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిలు తనను అడ్డుకున్నారని విమర్శించారు. వైద్యశాలల నుంచి వచ్చిన కమీషన్లను వారే దోచుకున్నారని ఆరోపించారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను చెప్పేందుకు వైవీ.సుబ్బారెడ్డి వద్దకు వెళ్ళినా, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి చెప్పినా వారికే ఇబ్బందని, ఇలా ఎవరికీ సమస్యలు చెప్పుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. తన సతీమణి నాగులుప్పలపాడు జడ్పీటీసీగా ఉన్నా వివక్షత చూపుతూ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారన్నారు.

భౌ.. భౌతో భయంభయం

ఆరునెలల్లో 50 మందిపై కుక్కల దాడి

కనిగిరిలో బెంబేలెత్తిపోతున్న ప్రజలు



గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కనిగిరి, సెప్టెంబరు 16 : కుక్కల స్వైరవిహారంతో ప్రజలు వణికిపోతున్నారు. నగరపంచాయతీ కార్యాలయ సమీపంలోనే స్వైరవిహారం చేస్తున్నాయి. ఆ ప్రాంతంలో ఇటీవల రోడ్డుపై వెళ్తున్న అయిదుగురిని తీవ్రంగా గాయపరిచాయి. మున్సిపల్ కార్యాలయం వద్దనే కుక్కలు పాదచారులపై, వాహనదారులను గాయపరుస్తుండటం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది. పట్టణంతో పాటు పలు గ్రామాల్లో కూడా కుక్కలు గుంపులుగా పెరిగి మనుషులు, మూగజీవాలపై దాడులు చేస్తున్నాయి. మూడు నెలలుగా నగరంలో కుక్కల స్వైరవిహారం ఎక్కువైంది. దాదాపు పట్టణంతోపాటు వివిధ గ్రామాల్లో కుక్కల దాడిలో 50 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. అంతేకాకుండా ఇంటి సమీపంలో కట్టి ఉంచిన మేకలపై కూడా దాడి చంపిన సంఘటనలు ఉన్నాయి. దేవాంగనగర్, తుమ్మకుంట గ్రామాల్లో కుక్కల దాడికి మేకలు, గొర్రెలు చనిపోయి వాటి పోషకులకు తీవ్ర నష్టం ఏర్పడింది. పట్టణ శివారుప్రాంతాల్లో పిచ్చికుక్కల గుంపులు తిరుగుతుండగా ప్రజలు బయటకు తిరగటానికి భయాందోళన చెందుతున్నారు.

కుక్కల దాడితో 50 మందికి గాయాలు

కనిగిరి ప్రాంతంలో పిచ్చికుక్కలు దాడులు తీవ్రమయ్యాయి. ఆరు నెలల కాలంలో 50 మందిని కుక్కలు గాయపరిచాయి. ఇటీవల పట్టణంలోని బొగ్గులగొంది కాలనీలో రోడ్డుపై ఆడుకుంటున్న ఐదేళ్ల పాపపైకి కుక్కలు ఎగబడి తీవ్రంగా గాయపరిచాయి. ఉదయాన్నే బేల్దారి పనుల నిమిత్తం కనిగిరి నగరికంటి బసవయ్య సెంటరు వద్ద ఉన్న బేల్దారి కూలీలైన అన్నమ్మ, వేములక్క, రామేశ్వరిలను కరిచాయి. అదేవిధంగా పిచ్చికుక్కలు ఎక్కువగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తూ గాయపరుస్తున్నా మున్సిపల్ పాలకులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా ఉదయాన్నే, సాయంత్రం వేళల్లో స్కూలుకు వెళ్లే చిన్నారులు పైకి కుక్కలు వెంటపడటంతో పిల్లలు వీధుల్లోకి రావటానికి తల్లితండ్రులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పుర ప్రజలను కుక్కల బెడద నుంచి తప్పించాలని కోరుతున్నారు.

కుక్కలను నియంత్రిస్తాం

మున్సిపల్ చైర్మన్ గఫార్

కుక్కల వలన గాయపడినట్లు తమ దృష్టికి వచ్చింది. ఈ విషయంపై ఇప్పటికే కుక్కల పట్టుకునే వారిని పిలిపించి పట్టించే ఏర్పాట్లు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. కుక్కలు గుంపులుగా ఉంటే మున్సిపల్ శానిటరీ విభాగం, సమీప సచివాలయంలో ఫిర్యాదు చేస్తే తక్షణ ఏర్పాటు చేపడతాం.

ప్రజలందరికీ మేలు చేకూరాలి



తాళ్లూరులో వినాయక నగరోత్సవం

దర్శి, సెప్టెంబరు 16 : గణేష్‌ని దయవలన ప్రజలందరికీ మేలు చేకూరాలని, పాడి పంటలతో సుఖశాంతులతో అందరూ ప్రశాంత జీవనం సాగించాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ఆకాంక్షించారు. స్థానిక సందువారిపాలెంలో గణేష్ విగ్రహం వద్ద సోమవారం రాత్రి పూజలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ, లలిత్‌సాగర్‌లను గుర్రాలపై ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయితీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు. రాత్రికి నిర్వహించిన వేలంలో లడ్డూను రూ.2.10 లక్షలకు సందు రాజేష్ దక్కించుకున్నాడు.

ముండ్లమూరు మండలంలో...



వేలం లడ్డూను దక్కించుకున్న వెంకటేశ్వర్లు

ముండ్లమూరు, సెప్టెంబరు 16 : మండలంలోని పసుపుగల్లు బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ వర్గీయులు ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని సోమవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ప్రజలు గులాంలు చల్లుకుంటూ బాణసంచా కాల్చుకుంటూ డప్పు వాయిద్యాలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, నూజెండ్లపల్లి గ్రామాల్లో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలించారు. ఎస్ఐ వై నాగరాజు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. పసుపుగల్లు బస్టాండ్ సెంటర్‌లో వినాయకుని వద్ద ఉంచిన 25 కేజీల లడ్డూను వేలంలో చొక్కా వెంకటేశ్వర్లు(చిన బంగారయ్య) రూ.1.19 లక్షలకు దక్కించుకున్నారు. నిర్వాహకులు బిజ్జం వెంకట సుబ్బారావు, గూడాల సాంబశివారెడ్డి, శివ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాళ్లూరులో...

తాళ్లూరు సెప్టెంబరు 16 : తాళ్లూరులో రాములవారి గుడి వద్ద ఏర్పాటు చేసిన విగ్రహంతో పాటు లక్కవరం, వెలుగువారిపాలెంలోని గణనాథులను నిమజ్జనానికి తరలించారు. స్వామిని గ్రామవీధుల్లో ఊరేగించి సమీపానగల దోర్నపువాగు, గుండ్లకమ్మ తదితర వాగుల్లో నిమజ్జనం చేశారు. ఎస్సై ఎస్.మల్లికార్జునరావు నేతృత్వంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

'మానవత' సభ్యత్వం తీసుకున్న సీఐ



సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న సీఐ భీమానాయక్

పామూరు, సెప్టెంబరు 16 : మానవత స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పామూరు సీఐ భీమానాయక్ సభ్యత్వం తీసుకున్నారు. మానవత సంస్థ చేపడుతున్న పలు సేవా కార్యక్రమాల గురించి సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు కే రామిరెడ్డి, అధ్యక్షులు ముసలయ్య, కార్యదర్శి వీ వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి టీ రమేష్, మాల్యాద్రి, ఎన్ శ్రీనివాసులు, రంగారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ నిధులతో కాలువ అభివృద్ధి పనులు

పామూరు, సెప్టెంబరు 16 : పట్టణంలోని సీఎస్‌పురం రోడ్‌లో గల శ్రీ హజరత్ మహబూబ్ సుభాని స్వామి దర్గా వద్ద ఉన్న మురుగు కాలువ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో చేపట్టారు. కాలువపై రాళ్లు లేకపోవడంతో వచ్చే భక్తులకు అసౌకర్యంగా ఉంది. కాలువపై సిమెంట్ తో తయారు చేయించే రాళ్లను పరచాలని టీడీపీ నాయకులు ఉగ్ర దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే గ్రామ పంచాయతీ నిధులతో కాలువ అభివృద్ధి పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. టీడీపీ నాయకులు సయ్యద్ అమీర్ బాబు, మస్తాన్, సయ్యద్ ఖాదర్‌బాష, రహిమాన్, మెంటి నరసింహారావులు పనులను పర్యవేక్షించారు.

నేడు, రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు: డీఈవో


ఒంగోలు(విద్య), సెప్టెంబరు 16: స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు మంగళ, బుధవారాల్లో జరుగుతాయని డీఈవో డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కాంప్లెక్స్‌పరిధిలోని 50శాతం మంది ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తెలుగు, లెక్కలు, బయాలజీ, నియోజకవర్గ స్థాయిలో పీఈటీ/పీడీలకు జరుగుతుందన్నారు. బుధవారం మిగిలిన 50శాతం ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, హిందీ, ఇంగ్లీషు, పీఎస్, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ సమావేశాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4.20 గంటల వరకు జరుగుతాయన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోల సమన్వయంతో రిసోర్స్ సర్సన్స్‌ను ఎంపికచేసుకొని అజెండా ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవో ఆదేశించారు.

50 మద్యం సీసాల స్వాధీనం.. ఒకరి అరెస్టు

గిద్దలూరు, సెప్టెంబరు 16: రాచర్ల మండలం జేపీచెరువు గ్రామానికి చెందిన బొజ్జా భాస్కర్ అనే బెల్టుషాపు నిర్వాహకుడి నుంచి 50 మద్యం సీసా లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

సాగర్ ఆయకట్టులో ముమ్మరంగా వరి నాట్లు











-కురిచేడు

సాగర్ ఆయకట్టు కింద రైతులు వరి నాట్లు వేయడం ప్రారంభించారు. నీరు వచ్చి కొద్ది కాలమే అయినా నారు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతు కూలీలకు డిమాండ్ పెరిగిపోయింది. అన్ని రకాల వ్యవసాయ పనులు ఒకేసారి రావడంతో కూలి రేట్లు కూడా పెరిగిపోయాయి. కురిచేడు మండలంలో సాగర్ ఆయకట్టు కింద అధికారికంగా 7 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అనధికారికంగా మరో 3 వేల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. మొత్తం మీద 10 వేల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం ఐనవోలు వద్ద వరినారును కొనుగోలు చేసి తెస్తున్నారు. ప్రస్తుతం దీర్ఘకాలిక వరి వంగడం బీపీటీ రకం నాటుతున్నారు. గతేడాది తీవ్ర కరువు వల్ల మాగాణి సాగు లేకపోవడం, ఈ ఏడాది సాగర్ నీరు ముందస్తుగా రావడంతో పంటలు వెంటనే సాగు చేయడానికి రైతులు ఉద్యుక్తులయ్యారు. ఈ ఏడాది రెండు పంటలు సాగుచేయాలనేది రైతుల లక్ష్యంగా కనపడుతున్నది.





విపత్తులోనూ.. విజయ ఢంకా

- చెక్కు చెదరని ప్రకృతి వ్యవసాయ పంటలు
- ఎరువులు వాడక పోవటంతో వెంటనే ఇంకిపోయిన నీరు
- వేర్లు పొడవుగా పెరగడంతో చావు తప్పించుకున్న మొక్కలు
- వెంటనే తేరుకున్న వరి, పత్తి, పసుపు పొలాలు
- శాస్త్రవేత్తల పరిశీలనలో విస్తుపోయే వాస్తవాలు



ప్రకృతి వ్యవసాయ పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 16 : ప్రకృతి వ్యవసాయ రంగం గుంటూరు జిల్లాలో కొత్త రికార్డును సృష్టించింది. ఈ నెల ఆరంభంలో సంభవించిన విపత్తును ప్రకృతి వ్యవసాయం పూర్తిగా జయించింది. ఈ విషయాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రకటించారు. వరదలు తర్వాత వ్యవసాయ క్షేత్రాలు సందర్శించిన శాస్త్రవేత్తలు ఆసక్తికరమైన సంగతులు తెలిపారు. సంప్రదాయ పద్ధతుల్లో సాగు చేసిన వరి, పత్తి, పసుపు పొలాలు వారం రోజుల నీటి మునక తర్వాత కూడా పచ్చగా కళకళ లాడుతూ కనిపించాయి.మొక్కలు ఒకటి, రెండు రోజులకే పూర్తిగా తిప్పుకొని యథాస్థితికి చేరాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతి ఆచరించిన పొలాల్లో ఒక్క మొక్క కూడా వరద తాకిడి వల్ల చనిపోలేదు.పక్కనే ఉన్న రసాయన ఎరువులు, పురుగు మందులు వాడిన పొలాల్లో రోజుల తరబడి నీళ్ళు నిలబడి ఉండగా, ఈ పొలాల్లో మాత్రం పడ్డ నీరు వెంటనే ఇంకిపోయింది. శాస్త్రీయంగా సాగిన సర్వేలో శాస్త్రవేత్తలు పరిశీలించిన అనేక అంశాలు ఆసక్తిని కలిగించేవిగా ఉన్నాయి.

పచ్చిరొట్టతో తప్పిన ప్రమాదం

ప్రధాన పంట కంటే ముందు వేసిన 30 రకాల పచ్చిరొట్ట వల్ల ప్రమాదం నుండి మొక్కలు తప్పించుకున్నాయి. కేవలం పచ్చిరొట్ట మాత్రమే వాడిన పొలాల్లో వరద నీరు భూమిలోకి ఇంకిపోవటానికి 25 నిమిషాల సమయం పట్టింది. రసాయన ఎరువులు వాడిన పొలాల్లో నీరు ఇంకేందుకు 1.30 గంటల సమయం పట్టినట్లు తేలింది. పచ్చిరొట్ట వాడిన ప్రకృతి వ్యవసాయ పొలాల్లో మొక్కల వేర్లు కూడా పొడవుగా పెరిగాయి.వేర్ల చుట్టూ దుబ్బు ఎక్కువగా కట్టటం, మట్టి ఎక్కువ చేరివుండటం వల్ల వారం రోజుల ముంపు తర్వాత కూడా మొక్కలు చనిపోలేదు. శాస్త్రవేత్తలు రసాయనిక పొలాల్లోని మొక్కలకు పెరిగిన వేర్లను కూడా కొలత వేయగా అవి పీలగా పెరిగినట్లు గుర్తించారు. దుబ్బు పెద్దగా లేకపోవడం,భూమి లోపల మొక్క చుట్టు మట్టి పెద్దగా లేకపోవడం వల్ల గాలికి, వరదకు పంట పడిపోయినట్లు గమనించారు. వారం రోజులు నీటిలో మునిగినా ప్రకృతి వ్యవసాయ పొలాల్లోని పంటలకు చీడ, పీడ లు సోకలేదు. భూమిలో మిత్ర పురుగుల నిష్పత్తి ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

కోడి గుడ్డు, నిమ్మరసం మహా ఔషధం

వరద నీరు పోయిన తర్వాత ప్రకృతి వ్యవసాయ పంటలకు రైతులు కోడి గుడ్డు, నిమ్మరసం కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేశారు. అదే మహా ఔషధం లా పనిచేసి మొక్క మరింత బలంగా మారింది. 250 మిల్లీ లీటర్ల కోడి గుడ్డు, నిమ్మరసం ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయటం వల్ల మొక్కకు మేలు జరిగినట్లు శాస్త్రవేత్తలు గమనించారు.ఈ ద్రావణం పిచికారీకి ఎకరాకు కేవలం రూ. 100 మాత్రమే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. రసాయన పొలాల్లో మాత్రం రైతులు వరద తర్వాత వేలాది రూపాయలు వెచ్చించి బలం మందులు వేశారు. అయినా అవి ఇంకా తిప్పుకోలేదు.

దెబ్బతిన్న పసుపు

వరద వల్ల పసుపు పంట బాగా దెబ్బ తిన్నట్లు తేలింది. చాలా చోట్ల మొక్కలు పూర్తిగా పసుపు బారి పోయి ఎండిపోయాయి. ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో మాత్రం పసుపు పంట నిక్షేపంగా ఉంది. ఒక్క మొక్క కూడా పసుపు బారలేదు. అలాగే వరి దుబ్బులు కూడా బలంగా ఉండటం వల్ల ఎక్కడా పసుపు బారిన దాఖలాలు లేవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

రెండు బృందాలతో సర్వే

వరద తర్వాత పంట పొలాలు పరిశీలించేందుకు రైతు సాధికార సంస్థ రెండు బృందాలను జిల్లాకు పంపింది. కిరణ్మయి, హిమ బిందు, బాషా, గురవయ్య, పథ్వీరాజ్ ఈ బృందాల్లో వున్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి నేతృత్వంలో ఈ బృందాలు లాం, వల్లభాపురం, ముట్లూరు, కొల్లిపర, అత్తోట, హనుమాన్‌పాలెం, పెదకొండూరు గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించి శాస్త్రీయ సర్వే నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ రైతులు, రసాయనిక రైతులను కలిసి పొలాల్లో ఉన్న పరిస్థితిని అత్యాధునిక టెక్నాలజీ తో అంచనా వేశారు. రెండు పొలాల్లో ఉన్న తేడాను రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను ఇందులో భాగస్వామ్యం చేశారు.

ప్రకృతి పంటలు విపత్తును జయించాయి..

జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ పంటలు విపత్తును జయించాయి. వారం రోజులు నీటిలో ఉన్నప్పటికీ ఒక్క మొక్క చనిపోలేదు. జిల్లా లో 10 వేల మంది కి పైగా రైతులు సాగు చేసిన పత్తి, వరి, పసుపు పంటలు అధిక వర్షపాతాన్ని తట్టుకొని మనుగడ సాధించాయి. ఇది ప్రకృతి రైతుల విజయం అని చెప్పవచ్చు.

- రాజకుమారి, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్

ఐదేళ్ల నిర్లక్ష్యం..

సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం



● కంప చెట్లు పెరిగి అధ్వానంగా ఉన్న గోవిందాపురం కాలువ

- అస్తవ్యస్తంగా సాగునీటి కాలువలు
- అసలు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- దిద్దుబాటు దారిలో కూటమి ప్రభుత్వం
- సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

రెండు నెలల్లో ఎన్నికల నిర్వహణకు సమాయత్తం


వైసీపీ ప్రభుత్వం సాగునీటి వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. ఐదేళ్ల పాలనలో కాలువల నిర్వహణను గాలికొదిలేసింది. కాల్వల నిర్వహణకు నిధులు నిలిపివేసి వాటిని అధ్వానంగా మార్చేసింది. జల వనరుల శాఖలో ఖాళీలనూ భర్తీ చేయలేదు. సిబ్బంది కొరత నీటి నిర్వహణలో సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సాగునీటి రంగం బలోపేతానికి చర్యలు చేపట్టింది. సాగునీటి వ్యవస్థ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. నీటి పారుదల వ్యవస్థలో పర్యవేక్షణలో కీలకమైన సాగు నీటి ఎన్నికల నిర్వహణకు పచ్చ జెండా ఊపింది. ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. రెండు నెలల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయిం చినప్పటికీ భారీ వర్షాలు.. వరదలతో ఈ ప్రక్రియకు కొంత మేర అవాంతరం ఏర్పడింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాగునీటి వినియోగదారుల సంఘాలు సాగునీటి వ్యవస్థలో కీలకమైనవి. నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 259 నీటి సంఘాలు, 30 డిస్ట్రిబూటరీ కమిటీలు ఉన్నాయి. వీటికి ఎన్నికల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. దీంతో సాగు నీటి కాలువల నిర్వహణలో రైతుల పాత్రను తొలగించినట్లయింది. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే సాగు నీటి సరఫరా.. కాలువ మరమ్మతుల్లో అవి కీలక పాత్ర పోషిస్తాయి. ఈ దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగానే నీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయి. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో రైతులు అవస్థలు పడ్డారు. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటి పదవీ కాలం ముగిసినా వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించ లేదు. దీంతో జలవనరుల నిర్వహణ గాడి తప్పింది. కాలువలు పూడికతో నిండి అధ్వానంగా తయారయ్యాయి.

నీటి తీరువా నిధులు దారి మళ్లింపు..

సాగర్ కాలువల మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. రైతులు ఏటా నీటి తీరువా చెల్లిస్తారు. నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలకు ఐదు శాతం కేటాయిస్తారు. 80 శాతం నిధులను మైనర్ ఇరిగేషన్, మేజర్ ఇరిగేషన్‌లకు కేటాయించాలి. సాగు నీటి సంఘాల ఎన్నికలు జరగకపోవడంతో సంబంధిత అధికారులకే నీటి సంఘాల బాధ్యతలను అప్పగించారు. ప్రాజెక్టు కమిటీ బాధ్యతలను ఎస్సీకి, డిస్ట్రిబ్యూటరీ కమిటీల బాధ్యతలను ఈఈలకు, నీటి సంఘాల బాధ్యతలను డీఈ, జెఈలకు అప్పగించారు. నీటి సంఘాలు లేకపోవడంతో కాలువల పనుల పర్యవేక్షణను అధికారులకు అప్పగించారు. నీటి తీరువాకు సంబంధించిన నిధులను కాడా సాగునీటి కమిటీల వారీగా కేటాయిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. వసూలైన నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ నిధుల్లో సగం మేజర్, సగం మైనర్ ఇరిగేషన్‌లకు కేటాయించాలి. 10 శాతం పరిపాలనకు వినియోగిస్తారు. 15 శాతం నిధులను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం నిధులను ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇలా కేటాయింపులు ఐదేళ్లుగా జరుగలేదు. నీటి తీరువా నిధులు కాడాకు చేరుతాయి. అక్కడి నుంచి నీటి సంఘాలకు దామాషా ప్రకారం కాడా నిధులు కేటాయించాలి. సదరు నిధులు కాడాకు చేరకపోవడంతో కాలువల మరమ్మతులు చేపట్టలేదు. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా ఏటా రూ 20 నుంచి 21 కోట్లు వస్తుందని అంచనా. రైతులు చెల్లించే నీటి తీరువాపై కాలువల మరమ్మతులు ఆధారపడి ఉంటాయి. ఈ నిధులను కాడాకు చేరకుండా వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించి కాలువల మర మ్మతులకు మొండిచేయి చూపింది. గత ఐదేళ్లుగా నీటి తీరువా నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోతుండటంతో కాలువలు మరమ్మతులు నోచుకోక అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి సంఘాల ప్రాధాన్యాన్ని గుర్తించింది. ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు ఆదేశించింది. తొమ్మిదేళ్ల తర్వాత సదరు సంఘాలకు ఎన్నికలు జరగనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నరసరావుపేటలోని ప్రాజెక్టు కమిటీ, డీసీ కార్యాలయాలు

సిబ్బంది కొరత..

సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రైతులకు ఓటు హక్కు కల్పిస్తారు. భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉంటే రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సా గునీరు సరఫరా చేసే ప్రాంతాల్లో భూములు ఉన్న రైతుల్ని ఓటర్లుగా గుర్తిస్తారు. సర్వే నెంబర్లు ఆధారంగా సాగునీటి సంఘాల వారీగా ఓటర్లను కేటాయిస్తారు. ఈ ప్రక్రియలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తుంది. రెవెన్యూ, జలవనరుల శాఖలు ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తారు. ప్ర భుత్వ ఉత్తర్వు మేరకు సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధిం చిన ప్రాథమిక వివరాలను ప్రభుత్వానికి అందించినట్టు సదరు అధికారులు తెలిపారు. అ యితే ఎన్నికల నిర్వ హణకు సిబ్బంది కొరత నెలకొంది. జలవనరుల శాఖలో భారీగానే ఖాళీలు ఉన్నాయి. వీటిని భర్తీ చేయకుంటే ఎన్నికల నిర్వ హణకు ఇబ్బందులు ఏర్పడతాయన్న వాదన సదరు శాఖలో వినిపిస్తోంది.



- బాపట్ల మున్సిపాలిటీలో ఏం జరుగుతోంది..?
- బాధితులకు డబ్బులు వెనక్కి ఇప్పించామని ఇటీవల ఎమ్మెల్యే ప్రకటన
- పనులు చక్కబెడతామని మధ్యవర్తుల అవినీతి దందా
- అవినీతిపై గతంలోనే పలు ఆరోపణలు
- చట్ట పరమైన చర్యలకు వెనకడుగు ఎందుకు..?

లంచం తీసుకున్నదెవరు.. ఇచ్చిందెవరు

బాపట్ల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, కూటమి ప్రభుత్వ పాలనలో అలాంటి వాటిని సహించేది లేదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఆగస్టు చివరి వారంలో విలేకరుల సమావేశం పెట్టి మరీ వెల్లడించారు. సీన్ కట్ చేస్తే ఇటీవల బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఎవరైతే మధ్యవర్తులు ఉండి లంచాలు తీసుకున్నారో వారిని పిలిపించి ఆ డబ్బులు వెనక్కి ఇప్పించడం కూడా జరిగింది. అది అధికారుల వల్ల జరిగిందని నేను అనుకోవడం లేదు. బంధువుల పేరుతో ఇదంతా చేశారు. అవినీతిలేని మంచి పాలన అందించడమే ప్రథమ లక్ష్యంగా ముందుకెళుతున్నాం. రాబోయే రోజుల్లో ఇటువంటివి జరగకుండా చూస్తానని మీకు హామీ ఇస్తున్నా" అని అన్నారు. ఇదంతా కూడా పరోక్షంగా బాపట్ల మున్సిపాలిటీకి సంబంధించిన వ్యవహారమే. దీంతో అవినీతి జరిగినట్లు సాక్షాత్తు ఎమ్మెల్యేనే ఆ ప్రకటన ద్వారా నిర్ధారణ చేసినట్లయింది. అవినీతి ఆరోపణలు రాగానే అందుకు సంబంధించి విచారణ చేపట్టడం, నిజమేనని తేల్చడం, డబ్బులు తిరిగి వెనక్కి ఇప్పించడం ఇవన్నీ కూడా ఎమ్మెల్యే నరేంద్రవర్మ ప్రతిష్ట పెంచేవే. అయితే ఇక్కడే ఓ ప్రశ్న తలెత్తుతోంది. దానుడి తప్పు దండంతో సరి అన్నట్లుగా లంచం తీసుకుని, తీరా బయటకు వచ్చాక వాటిని తిరిగి ఇచ్చేస్తే తప్పు ఒప్పవుతుందా? లేక చట్ట పరంగా వారిపై కేసు నమోదు చేసి ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి హెచ్చరికలు పంపాల్సిన బాధ్యత ఉందా లేదా...లేకపోతే దొరికితే దొంగ లేకపోతే దొర అన్న చందాన అవినీతి జలగలు పెత్తనం చెలాయిస్తుంటే వ్యవస్థలు చేష్టలుడిగి చూస్తుండిపోవాలా.. ఇవన్నీ కూడా అంతుచిక్కని ప్రశ్నలుగా ఉండిపోవడంతో అసలు బాపట్ల మున్సిపాలిటీలో ఏం జరుగుతోందన్న మీమాంస ప్రజలను కుదిపేస్తోంది..

మున్సిపాలిటీ చుట్టూ వివాదాలు

ఈ మధ్యవర్తుల అవినీతి బాగోతం రాకమునుపే అనేక వివాదాస్పద అంశాలు మున్సిపాలిటీని చుట్టుముట్టాయి. వైసీపీ ఐదేళ్ల పాటు చేసిన పాపాలకు మున్సిపాలిటీ అప్పుల కుప్పలా తయారయింది. ఆర్థిక సంఘం నిధులను సైతం దారి మళ్లించిన ఘనత వైసీపీది. ఇదే సమయంలో నీటి పన్ను, ఆస్తి పన్ను రూపంలో రావాల్సిన బకాయిలు కూడా మున్సిపాలిటీలో చాలానే ఉన్నాయి. వాటిపై దృష్టిసారించి ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చుకోవడంపై ఎలాంటి అడుగులు వేయాలో కసరత్తు చేయాల్సి ఉంది. కానీ దీనికి భిన్నంగా మున్సిపాలిటీ అప్పుల్లో ఉందనే సంకేతాన్ని పంపి ఓ విధంగా ఫండ్ రైజింగ్ కార్యక్రమం చేపట్టడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. దాదాపు నెలన్నర క్రితం పట్టణంలోని రియల్టర్లతో సమావేశమైన మున్సిపల్ అధికారులు సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)కింద విరాళం అందించాలని అభ్యర్థించడం గమనార్హం. అసలు సీఎస్ఆర్ పరిధిలోకి రావాలంటే నిర్దిష్టమైన మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం సూచించింది. జిల్లాలో దాని పరిధిలోకి వచ్చే పరిశ్రమలు ఐదులోపే ఉన్నట్లు సమాచారం. అలాంటిది ఏకంగా వారిని సీఎస్ఆర్‌కింద బాధ్యత తీసుకోమనడం విమర్శలకు తావిచ్చింది. ఇదే కాకుండా టీడీపీ ద్వితీయశ్రేణి నేతలు మున్సిపాలిటీని వేదికగా చేసుకుని పెత్తనం చెలాయించాలని చూస్తుండడంతో ప్రతిష్ట మరింతగా మసకబారుతోంది.

అక్రమ లే అవుట్ల విషయంలోనూ...

కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా తీసుకున్న విధాన నిర్ణయంలో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లే అవుట్ల జాబితాను మున్సిపాలిటీ ప్రజల ముందుంచింది. ఈ విషయంలో ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే విధంగా మధ్యతరగతి ప్రజలను ఇబ్బంది పెట్టడానికే ఇలాంటి చర్యలకు దిగిందనే దుష్ప్రచారాన్ని మొదలుపెట్టారు. ప్రభుత్వ విధానం ప్రకారం అక్రమ లే అవుట్ల జాబితాను బహిరంగ పరచిన మున్సిపాలిటీ ఈ విషయంపై వినియోగదారుల్లో ఉన్న అపోహలను తొలగించడంపై కనీస స్థాయిలో కూడా దృష్టి పెట్టలేకపోయింది. ప్రభుత్వ ఖజానాకు సున్నం వేసి అడ్డగోలుగా వ్యవహరించిన వారిపైనే చర్యలు తప్ప ప్లాట్లు కొనుక్కున్న మధ్యతరగతి వర్గాలను ఇబ్బంది పెట్టే ఉద్దేశమేది ప్రభుత్వానికి లేదనే ప్రకటనను మున్సిపాలిటీ అధికారులు ప్రజలకు వివరించలేకపోయారు. ఇవన్నీ కూడా బాపట్ల మున్సిపాలిటీలో జరుగుతున్నన్న అస్తవ్యస్త విధానాలకు నిదర్శనంగా కనబడుతోంది.

ప్రభుత్వం వైపు నుంచి విచారణ ఏది...

మధ్యవర్తులు పేరిట డబ్బులు వసూలు చేశారని ఎమ్మెల్యేనే ప్రకటించారు. ఈ అంశంలో అధికారుల వైపు నుంచి విచారణ చేపట్టి అసలు బాధితులు ఎవరు అనే కోణంతో పాటు మధ్యవర్తులు డబ్బులు వసూలు చేసింది ఎవరికి ఇవ్వడానికి వీటన్నింటిపై సమాధానం రాబట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది. ఆరోపణలు వచ్చాయి, రాజకీయంగా పరిష్కారం చూపినట్లు నేతలు ప్రకటించారు. అంతటి తో సరిపోయింది అన్నట్లుగా ఆ విషయాన్ని మరుగున పడేయడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. శాఖాపర మైన విచారణ చేపట్టి ఈ ఎపిసోడ్‌లో కీలకంగా వ్యవహ రించేదెవరు అనే అంశంతో పాటు ఈ దందా ఎప్పటి నుం చి సాగుతుంది, గతంలో ఎంత అవినీతికి పాల్పడ్డారు వీట న్నింటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత సదరు వ్యవస్థలపై ఉంది.

ప్రజల్లో తీవ్రమైన చర్చ....

గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ నిబంధనలను లెక్కచేయకుండా మున్సిపాలిటీ మీద స్వారీ చేశారు. నేతలు, కొంతమంది అధికారులు కలిసి అందినకాడికి దండుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పారదర్శకపాలన దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన అవినీతి వ్యవహారంలో బాధితులకు న్యాయం జరగడం ఎంత ముఖ్యమో, మధ్యవర్తుల పేరిట అడ్డగోలుగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

● మంతెనవారిపాలెంలో తెగిన కట్టను బలపరుస్తున్న ఎక్స్‌కవేటర్



ముమ్మరంగా డ్రెయిన్లకు మరమ్మతులు

రేపల్లె, సెప్టెంబరు 16 : అధిక వర్షాల కారణంగా డ్రెయిన్‌లు పొంగి కట్టలకు గండ్లు పడడంతో, తీరప్రాంతంలోని పొలాలన్నీ ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులకు లక్షలాది రూపాయల నష్టం కలిగింది. రేపల్లె నియోజకవర్గంలోని నగరం మండలం ఈదుపల్లి, మంతెనవారిపాలెం ఓల్డుకోర్సు డ్రెయిన్లకు గండ్లుపడటంతో, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టి సారించి తక్షణమే డ్రెయిన్‌లు కరకట్టలను పటిష్టపర్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు నియోజకవర్గంలోని ప్రధాన డ్రెయిన్ తెగిపోయిన ప్రాంతాలను పటిష్ట పరిచేందుకు చర్యలు చేపట్టారు. సోమవారం డ్రెయిన్‌ల కట్టలు పూడిక పనులు మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ దగ్గర ఉండి పనులను పర్యవేక్షించారు. రాబోయే రోజుల్లో డ్రెయిన్‌ల కట్టలు తెగిపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భారీ వర్షం కురిస్తే డ్రెయిన్‌లు వ్యర్థాలతో పూడుకుపోవటం వల్ల నీరు పారుదల కాక గండ్లు పడుతున్నాయని ఎప్పటికప్పుడు డ్రెయినేజీ అధికారులు తూటికాడ, వ్యర్థాలను తొలగిస్తే ఇలాంటి ప్రమాదాలు సంభవించవని అధికారులకు సూచించారు. తక్షణమే కోతలకు గురైన కట్టలను పూర్తిస్థాయిలో బలపర్చాలని సూచించారు.



● ఈదుపల్లిలో తెగిన కట్టను బలపరుస్తున్న సిబ్బంది

● చీరాల ఉప ఖజానా కార్యాలయం



చీరాల ఉప ఖజానా కార్యాలయంలో వర్గపోరు

- విచారణ చేపట్టిన ఆర్డీఓ, డీటీఓ తదితరులు
- కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్న విచారణ అధికారులు

చీరాల, సెప్టెంబరు 16 : చీరాల ఉపఖజానా కార్యాలయంలో వర్గపోరు నడుస్తోంది. దీంతో ఉపఖజానా కార్యాలయం నుంచి సేవలు పొందాల్సిన వారికి చేదుఅనుభవం ఎదురౌతోంది. పెన్షన్లు, ఎరియర్స్ పనుల బిల్లులు తదితరాలకు సంబంధించిన పనులు ఈ నెల 4వ తేది నుంచి అటకెక్కాయి. ఎస్టీఓ భాగ్యలక్ష్మి ఆఫీస్ ఆర్డరును మార్పు చేయటం అందుకు కారణంగా చెప్తున్నారు. కార్యాలయంలో పనిచేసే వారిలో ఎస్టీఓ భాగ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సుధీరా ఒక వైపు, మిగిలిన సీనియర్ అసిస్టెంట్లు సిబ్బంది మరో వైపుగా విడిపోయి ఆధిపత్య పోరుకు సిద్ధపడటం అందుకు కారణమని సమాచారం. దీనికి సంబంధించి సదరు ఉద్యోగుల అసోసియేషన్‌కు చెందిన ఓ వ్యక్తి తెరవెనుక చక్రం తిప్పటం అందుకు కారణమని విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో విషయం స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి వెళ్లింది. ఆయన సామరస్యంగా రాతపూర్వకంగా చేసిన సూచనలను వక్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, డీటీఓ పరమేశ్వరి విచారణ చేపట్టారు. విచారణ నివేదికను కలెక్టరుకు అందజేస్తామని ఆర్డీఓ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం సెలవు అయినప్పటికి పెండింగ్ పనులను పూర్తిచేసినట్లు ఎస్టీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎస్టీఓ కార్యాలయంలో వర్గపోరు కొనసాగుతున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. కార్యాలయంలో ఆఫీస్ ఆర్డర్ మార్పుకు సంబంధించి నెల కొన్న పరిణామాల క్రమంలో ఆ వర్గపోరుకు దారితీసినట్లు విచా రణలో వెల్లడయ్యింది. అందరి వాదనలను రికార్డు చేశాం. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఎస్టీఓ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కార్యాలయంలో ఆఫీస్ ఆర్డర్ మార్పు నేపథ్యంలో నెలకొన్న పరిణామాలపై ఆర్డీఓ, డీటీఓ విచారణ చేపట్టారు. పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయటం జరిగింది. అన్ని విషయాలు పరిగణలోకి తీసుకుని విచారణ చేపట్టారు.


బాలుర అండర్14 క్రికెట్ జట్టుతో అసోసియేషన్ సభ్యులు

అండర్ 14 జిల్లా జట్టు ఎంపిక

మేదరమెట్ల, సెప్టెంబరు 16: ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర అండర్-14 జిల్లా స్థాయి సెలెక్షన్స్ కొరిశపాడు మండలం రావినూతలలోని రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ స్టేడియంలో ఆది, సోమవారాల్లో నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన 33 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వారికి రెండు రోజులు నిర్వహించిన క్రికెట్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 16మందిని స్టాండ్‌బైగా ఐదుగురికి అండర్14 జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక అయిన క్రీడాకారులు అక్టోబరు 1వతేదీ నుంచి జరిగే అంతర్ జిల్లా క్రికెట్ పోటీలలో పాల్గొంటారని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారసాల నాగేశ్వరరావు(బాబు) తెలియజేశారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీలలో సెలెక్టర్లుగా మాజీ రంజీ ప్లేయర్ తాటికొండ వంశీకృష్ణ, మాజీ రాష్ట్ర క్రీడాకారుడు శ్రీకృష్ణ విజయ కుమార్‌లు వ్యవహరించారు. కోచ్‌లుగా సుధాకర్, చంద్రశేఖర్‌లు హాజరయ్యారు. సెలెక్టర్ వంశీకృష్ణ, గ్రౌండ్ మ్యాన్ అజయ్‌కు ఈ సందర్భంగా క్రీడాకారులు చిరు సన్మానం చేశారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.మోహన్‌దాస్, సభ్యులు కొల్లా మధు, సాయికృష్ణ, ఆర్ఎస్‌సీఏ సభ్యులు శేష తదితరులు పాల్గొన్నారు.

కనపర్తి ఎత్తిపోతల పథకాన్ని అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్


మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బీఎన్

నాగులుప్పలపాడు సెప్టెంబరు 16: కనపర్తి ఎత్తిపోతల పథకాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. అమ్మనబ్రోలు వద్దనున్న కనపర్తి ఎత్తిపోతల పథకం వద్ద ఆయకట్టు రైతుల సాగు అవసరాల కోసం సోమవారం ఎమ్మెల్యే మోటార్లు ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ఈదర వెంకటకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా ఏవో వెంకటరావు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన వరి పంటను అమ్ముకొనేందుకు వీలుగా ప్రభుత్వం రెండవ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్దతు ధరను అందిస్తుందని చెప్పారు. మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలోనే నాలుగు సార్లు ఆదర్శ అవార్డులను అందుకొన్న కనపర్తి ఎత్తిపోతల పథకం మోటార్లు, ప్యానళ్లు దెబ్బతిన్నాయని, ఆనాడు గుండ్లకమ్మ డ్యాం నిర్మించిన సమయంలో సాగునీటి వాటా అందించేలా (డీపీఆర్)లో చేర్చలేదని చెప్పారు. దీంతో గుండ్లకమ్మ డ్యాం గేట్లు మూసివేసిన సమయంలో నదిలో నీరు లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అంతేగాకుండా పథకం కాలువ కట్టలు దెబ్బతిని పంట ఉత్పత్తులు ట్రాక్టర్లలో తరలించే సమయంలో రైతులు ఇబ్బందిపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకం డీపీఆర్‌లో చేర్చాలని, కాలువ కట్టలపై గ్రావెల్ పరిచి, అధునాతన మోటార్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా అంశాలపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ కనపర్తి ఎత్తిపోతల పథకంపై తనకెంతో మక్కువ ఉందన్నారు. దీనిని డీపీఆర్‌లో చేర్చడం కొంత కష్టంతో కూడుకొన్న పని అయినా రైతుల శ్రేయస్సు కోసం నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సాగునీరు వాటా అందేలా చేస్తానన్నారు. కాలువ కట్టలపై గ్రావెలు రోడ్డు నిర్మించుకొనేందుకు వెంటనే నిధులు సమకూర్చనున్నట్లు తెలిపారు. అత్యాధునిక మోటార్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన ఎత్తిపోతల పథకం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బీఎన్‌ను, వీరయ్యచౌదరిలను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నాయకులు దివి పున్నారావు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌ఐల బదిలీలు

10 మందికి పోస్టింగ్, ముగ్గురు వీఆర్‌కు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 16: జిల్లాలో ఎట్టకేలకు ఎస్సైల బదిలీలు చేపట్టారు. పది మందికి పోస్టింగు ఇచ్చి, ముగ్గురిని వీఆర్‌కు పిలిచారు. బదిలీలు అన్నీ పశ్చిమప్రాంతంలోనివే కావడం విశేషం. ఇంకా కొంతమందికి రెండు మూడు రోజులలో స్థానచలనం ఉంటుందని సమాచారం. అదే విధంగా ర్యాంకర్ ఎస్సైలు కూడా పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్నారు.

సూక్ష్మసేద్యానికి జవసత్వాలు

ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ సర్కార్

మొదటి మూడేళ్లు నిలిపివేత, ఆ తర్వాత రెండేళ్లు మొక్కుబడిగా అమలు

రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.160 కోట్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వని వైనం

గత టీడీపీ హయాంలో పెద్ద ఎత్తున అమలు

బాబు జమానా ఐదేళ్లలో రూ.362 కోట్లు ఖర్చు

మళ్లీ దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం

ఒంగోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అరకొర సాగునీటి వనరులతో అవస్థలు పడే రైతాంగానికి ఎంతో మేలు చేసేది సూక్ష్మ సాగునీటి పథకం. అందులో సగం వాటా నిధులు కేంద్రం నుంచి వస్తాయి. మిగతావి రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. ఈ పథకం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేస్తారు. అలాంటి అద్భుత పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసింది. అసలు పథకం గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. రైతులు గగ్గోలు పెట్టినా స్పందించలేదు. అయితే గతంలో 2014-19లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం విస్తారంగా అమలుచేసింది. రాయలసీమ ప్రాంతంతో సమానంగా జిల్లాలోని రైతులకు 90శాతం సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలను అందించింది. ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వ కాలంలో ఈ పథకం కింద 46,134 మంది రైతులకు సుమారు రూ.362కోట్లతో పరికరాలు అందించి 51,301 హెక్టార్లలో సాగు కల్పించింది. వివిధ రకాల పండ్లతోటలు మిర్చి ఇతర ఆరుతడి పంటలను రైతులు సాగు చేశారు.

అరకొరగా అమలు.. రాయితీలోనూ కోత

కాగా 2019-24 మధ్య ఐదేళ్లకు మరో లక్షన్నర హెక్టార్లలో ఈ పథకం విస్తరణకు టీడీపీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అయితే జిల్లాలో రైతాంగానికి ఎంతో ఉపకరించే ఈ పథకాన్ని 2019లో అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. తొలి మూడేళ్లు ఆ ఊసే ఎత్తలేదు. అలా రాష్ట్రవ్యాప్తంగా సూక్ష్మ సేద్యం పథకాన్ని నిలిపివేయడంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో 2022-23లో మళ్లీ ప్రారంభించింది. ఆ ఏడాది సగం సాగుకాలం ముగిశాక అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. జిల్లాకు ఆ ఏడాది తొలుత 16వేల హెక్టార్లకు అనుమతి ఇచ్చారు. అలాగే 2023-24లో కూడా 9,540 హెక్టార్లకు మంజూరుచేశారు. అలా రెండేళ్లలో 17,740 హెక్టార్లకు మాత్రమే ఈ పథకాన్ని అమలు కాగా గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన 90శాతం రాయితీని మాత్రం అమలు చేయలేదు. ఇదిలాఉండగా వైసీపీ ప్రభుత్వం ఆ రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ పథకం అమలుకు సంబంధించి రైతుల వాటా రూ.41 కోట్లు, ప్రభుత్వ వాటా రూ.160 కోట్లు కాగా పరికరాలు అందించిన కంపెనీలకు కేవలం రైతుల వాటా నగదు మాత్రమే జమైంది. ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.160కోట్లలో ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పాపాన పోలేదు. అలా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1,165 కోట్ల మేర పెండింగ్ పెట్టింది.

> ఏపీ మైక్రో (సూక్ష్మ) సాగునీటి పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. జిల్లా రైతాంగానికి ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతంలో బోర్ల కింద పంటల సాగు చేసే రైతులకు ఎంతో ఉపకరించిన సూక్ష్మసేద్యం అందని ద్రాక్షాలనే మిగిలింది. ఆ ఐదేళ్లలో మూడేళ్లు పథకాన్ని నిలిపివేయగా మరో రెండేళ్లు మొక్కుబడిగా అమలుచేసినా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. పైగా రాయితీలోనూ కోత పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహత్తర పథకంపై దృష్టిపెట్టింది. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని అధ్యయనం చేస్తోంది. ఆయా కంపెనీలతో మాట్లాడి పరికరాలు అందించేందుకు అంతా సిద్ధం చేస్తోంది.


స్ప్రింకర్లతో సాగు చేస్తున్న రైతు

కంపెనీలకు భరోసాతో ముందుకు..

దీంతో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ పథకానికి జీవసత్వాలు కల్పించే చర్యలు చేపట్టినా వైసీపీ ప్రభుత్వం చెల్లించకుండా నిలిపేసిన పెండింగ్ బకాయిలు ప్రతిబంధకంగా మారాయి. ఈ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెండింగ్ బకాయిలపై కంపెనీలకు భరోసా ఇచ్చారు. తొలిగా ఇటీవల రూ.176 కోట్లు విడుదల చేశారు. మిగిలిన వాటిని విడతల వారీగా చెల్లించేలా హామీ ఇచ్చారు. ఈ ఏడాది మళ్లీ భారీగా సూక్ష్మ సేద్యం అమలుకు సహకరించాలని కంపెనీలకు సూచించారు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన మైక్రో ఇరిగేషన్ పథకం తిరిగి పునరుజ్జీవనం పొందనుంది. అందుకు సంబంధించిన ప్రక్రియను ప్రస్తుతం సంబంధిత అధికారులు చేపట్టారు.

రైతులకు సూక్ష్మసేద్య పరికరాలు

- కొత్తపట్నం, టంగుటూరు మండలాల్లో సూక్ష్మసేద్యం క్షేత్రాలను పరిశీలించిన డైరెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 16: రైతులు కొత్తగా సూక్ష్మ సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి అవసరమైనర పరికరాలను వెంటనే అందజేస్తామని ఉద్యానవన శాఖ డైరెక్టర్ డాక్టర్ కే.శ్రీనివాసులు అన్నారు. కొత్తపట్నం, టంగుటూరు మండలాల్లో సోమవారం ఉద్యాన, సూక్ష్మసేద్య క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ముందుగా కొత్తపట్నం మండలం ఈతముక్కలలో కూరగాయలు, ఇతర పంటలకు అమర్చిన సూక్ష్మ సేద్య పరికరాలను పరిశీలించారు. అక్కడి రైతులను అడిగి పలు అంశాలను తెలుసుకున్నారు. అనంతరం టంగుటూరు మండలం కందులూరులో సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా అమలు చేసిన ఉద్యాన పంటల విస్తరణ పథకంలో భాగంగా నాటిన నిమ్మతోట (మూడేళ్లు)ను సందర్శించారు. రైతు రామారావుకు అందించిన రాయితీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు కృష్ణారాజు, రంగారావు లు ఇచ్చిన సూచనలు, సలహాలపై పదిరోజుల్లో ఒక నివేదికను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూక్ష్మసేద్య పథకం సంచాలకులు పీవీ.రమణయ్య, జిల్లా ఉద్యానవన అధికారి గోపిచంద్, ఉద్యాన అధికారి ఎం.లక్ష్మి, కొత్తపట్నం హెచ్ఓ తేజ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సూక్ష్మసేద్యం క్షేత్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

వరద విరాళాల్లో గోల్‌మాల్

డీఈవో కార్యాలయం అవినీతిమయం

సీఎంకు ఫిర్యాదు చేసిన టీఎన్‌యూఎస్

సమగ్ర విచారణకు వినతి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 16: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం వసూలు చేసిన విరాళాల్లో కొంత మొత్తం గోల్‌మాల్ అయినట్లు ఆరోపణలు నెలకొన్నాయి. జిల్లాలో వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర మండల విద్యాధికారులు, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు, ఉప విద్యాధికారుల ద్వారా విరాళాలు వసూలు చేశారు. అయితే జిల్లా విద్యాశాఖ ద్వారా ఎవరెవరి నుంచి ఎంత మొత్తం వసూలు చేసింది? ఆ నిధులను ఏమి చేసింది గోప్యంగా ఉంచారు. దీంతో ఈ నిధుల విషయంలో డీఈఓ సుభద్ర అవినీతికి పాల్పడినట్లు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆరోపించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. వరద బాధితుల విరాళాలు గోల్‌మాల్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో సీఎంకు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌కు, పాఠశాల విద్యా గుంటూరు ఆర్జేడీకి వారు ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.



డీఈవో అవినీతి ఇలా...

డీఈవో కార్యాలయంలో కూడా అవినీతి వేళ్లానుకుపోయిందని, నిధుల స్వాహాపై సమగ్ర విచారణ చేయాలి.

-ప్రజాప్రతినిధుల సిఫార్సులను పక్కనపెట్టి కొందరు టీచర్ల వద్ద భారీ మొత్తాలను వసూలు చేసి డీఈవో కార్యాలయంలో, సమగ్రశిక్ష కార్యాలయంలో డిప్యుటేషన్లు వేశారు. ప్రజాప్రతినిధులు అడిగితే నిబంధనలు అంగీకరించవని చెప్తున్న డీఈవో ఏ నిబంధనల ప్రకారం వీరికి డిప్యుటేషన్లు వేశారో విచారణ జరిపి నిగ్గుతేల్చాలి.

- ఉపాధ్యాయ దిన వేడుకల్లో కొందరు అనర్హుల నుంచి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇచ్చారు. దీనిపై విచారణ చేయాలి.

- ఉద్యోగోన్నతులు తీసుకున్న ఉపాధ్యాయులు కొందరు వివిధ కారణాలతో తిరిగి పాత పోస్టుకు పోయేందుకు రివర్షన్లకు దరఖాస్తు చేస్తే వారి వద్ద నుంచి రూ.70వేల నుంచి రూ.80వేల వరకు వసూలు చేశారు.

-డీఈవో కార్యాలయం ఐటీ సెల్‌లో మూడు పోస్టులలో నియమించేందుకు మూడో కంటికి తెలియకుండా ముగ్గురు టీచర్ల పేర్లు పాఠశాల విద్యా కార్యాలయానికి ఆన్‌లైన్‌లో ఫైల్ పంపారు. ఈ వ్యవహారంలో భారీమొత్తం చేతులు మారినట్లు వారు ఆరోపించారు.

- పాఠశాల ప్రారంభ అనుమతులు, ప్రభుత్వ గుర్తింపునకు భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్నింటిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామశెట్టి వెంకటేశ్వర్లులు కోరారు.

రోడ్డెక్కుతున్న ప్రభుత్వ వైద్యులు

నేడు చలో విజయవాడకు వెళ్లనున్న డాక్టర్లు

విజయవాడ ధర్నా అనంతరం తదుపరి కార్యాచరణ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 16: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గించడాన్ని నిరసిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తాము చేపట్టిన ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. గత వారంరోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. కాగా ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో వైద్యులు మంగళవారం చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టారు. పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులకు పీజీ ఉన్నత విద్యను అందించేందుకు ఇన్ సర్వీసు కింద 30శాతం కోటా ఉండేది. అయితే ఆ కోటాను 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో నెంబరు 85 జారీ చేసింది. ఈ జీవోకు వ్యతిరేకంగా గత వారంరోజుల నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనతోపాటు మూడు రోజుల పాటు ఓపీలను బహిష్కరించారు. అయితే ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడంతో మంగళవారం ఛలో విజయవాడకు రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడంతో జిల్లా నలుమూలల నుంచి వైద్యాధికారులు ఆ కార్యక్రమానికి హాజరుకానున్నారు. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేయనున్నారు. అప్పటికి కూడా ప్రభుత్వం నుంచి సానుకూలంగా స్పందించి జీవోను రద్దుచేయకపోతే తదుపరి కార్యాచరణ ప్రణాళికను అక్కడే ప్రకటించనున్నారు. ఆ ప్రకారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 16: పేకాట శిబిరాలపై పోలీసులు దాడులుచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1650 నగదును స్వాధీనం చేసుకు న్నారు. ఈఘటన సోమవారం మండలంలోని యడవల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై వి.మహేశ్ తెలిపిన వివరాల మేరకు.. పేకాట ఆడుతున్నట్టు సమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పేకాటరాయు ళ్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సాగునీటి రంగంపై దృష్టిసారించాలి

మంత్రిని కలిసి కోరిన రైతుసంఘాల ప్రతినిధులు


వివిధ అంశాలపై స్వామికి వినతిపత్రం

ఒంగోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వపరంగా ప్రత్యేకదృష్టి సారించాలని వివిధ రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రస్తుతం సాగునీటి అవసరాలు, ప్రాజెక్టుల పూర్తిపై సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు నేతృత్వంలో వివిధ సంఘాల ప్రతినిధులు మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిని సోమవారం తూర్పునాయుడుపాలెంలో కలిశారు. వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం వరినాట్ల సీజన్ కాగా సాగర్ కుడి కాలువ ద్వారా జిల్లాకు రావాల్సిన వాటా మేర నీరు వచ్చేలా చేయాలని కోరారు. తక్షణం ఆయకట్టుకు పూర్తిస్థాయిలో వరి సాగుకు వీలుగా నీటి సరఫరా అవసరంగా పేర్కొన్నారు. ఈ అంశాలను చర్చించేందుకు తక్షణం జిల్లాస్థాయి సమావేశాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. అలాగే గుండ్లకమ్మ అన్ని గేట్లకు మరమ్మతులు చేసి రబీకి నీరివ్వాలని కోరారు. వెలిగొండ పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. కొండపి నియోజకవర్గంతో పాటు పొదిలి మండలాన్ని అటు వెలిగొండ నీరు, ఇటు సాగర్ నీరుకు అనుసంధానం చేయడం ద్వారా భవిష్యత్‌లో ఈ ప్రాంతంలోని మెట్ట భూములకు సాగు నీరు శాశ్వతంగా అందేలా చూడాలన్నారు. మంత్రి స్వామి స్పందిస్తూ ప్రభుత్వపరంగా రైతాంగానికి మేలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి స్వామిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి పొలవరపు వెంకట్రామయ్య, రైతు సంఘాల ప్రతినిధులు పమిడి వెంకట్రావు, కే వీరారెడ్డి, వి.సుబ్బారావు, కే.ఆంజనేయులు, మండవ శ్రీనివాసరావు, షేక్ మాబు, సీహెచ్ సుధాకరరావు ఉన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

సాగర్ ఆయకట్టులో ముమ్మరంగా వరి నాట్లు











-కురిచేడు

సాగర్ ఆయకట్టు కింద రైతులు వరి నాట్లు వేయడం ప్రారంభించారు. నీరు వచ్చి కొద్ది కాలమే అయినా నారు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతు కూలీలకు డిమాండ్ పెరిగిపోయింది. అన్ని రకాల వ్యవసాయ పనులు ఒకేసారి రావడంతో కూలి రేట్లు కూడా పెరిగిపోయాయి. కురిచేడు మండలంలో సాగర్ ఆయకట్టు కింద అధికారికంగా 7 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అనధికారికంగా మరో 3 వేల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. మొత్తం మీద 10 వేల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం ఐనవోలు వద్ద వరినారును కొనుగోలు చేసి తెస్తున్నారు. ప్రస్తుతం దీర్ఘకాలిక వరి వంగడం బీపీటీ రకం నాటుతున్నారు. గతేడాది తీవ్ర కరువు వల్ల మాగాణి సాగు లేకపోవడం, ఈ ఏడాది సాగర్ నీరు ముందస్తుగా రావడంతో పంటలు వెంటనే సాగు చేయడానికి రైతులు ఉద్యుక్తులయ్యారు. ఈ ఏడాది రెండు పంటలు సాగుచేయాలనేది రైతుల లక్ష్యంగా కనపడుతున్నది.



కల్యాణం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అంగరంగ వైభవంగా త్రివిక్రమస్వామి కల్యాణం

చెరుకూరు(పర్చూరు), సెప్టెంబరు 16: పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. తొలుత స్వామివార్లకు పవిత్రోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో చేపట్టారు. అనంతరం వేద పండితుల సారథ్యంలో స్వామివారి కల్యాణ వేడుకలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీరర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.మాజీ జడ్పీటీసీ దాసరి ఉషారాణి దంపతులు పాల్గొని పూజలు చేశారు.



చెక్‌ను అందిస్తున్న బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం

- ఎమ్మెల్యే కొండయ్యకు చెక్కును అందించిన దాతలు

చీరాల, సెప్టెంబరు 16 : స్థానిక బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం అన్న క్యాంటీన్‌కు విరాళంగా రూ. లక్ష చెక్కును ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చేందుకు సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్ నిర్వహణకు దాతలు తమవంతు సహకారం అందించటం హర్షణీయమన్నారు. తోటివారికి సాయపడాలనే తలంపుతో ముందుకొచ్చిన బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తులాబంధు వెంకట సురేష్, వర్థికల నాగేశ్వరరావు, బి. స్వామి, ఊటుకూరి సత్యనారాయణ, జి. కృష్ణమోహన్, రామకృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాయపాలెం ఎత్తిపోతల సిద్ధం

పూర్తయిన మరమ్మతులు

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

త్వరలో మంత్రి గొట్టిపాటితో ప్రారంభం

అద్దంకి, సెప్టెంబరు16: రాష్ట్రంలోనే పురాతన ఎత్తిపోతల పథకాలలో ఒకటిగా ఉన్న తిమ్మాయపాలెం ఎత్తిపోతల పునఃప్రారంభానికి సిద్ధమైంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సుమారు 6 కోట్ల రూపాయలతో పునర్ నిర్మాణం జరగగా సరైన నిర్వహణ లేక రెండు సంవత్సరాలుగా మూలన పడింది. గత ఏడాది ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగులగొట్టి కాపర్ వైరు అపహరించుకు పోయారు. గత ఏడాది గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం కూడా లేక పోవటంతో పూర్తిగా మూలన పడింది. ప్రస్తుతం



తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకం

గుండ్లకమ్మ నదికి నీటి ప్రవాహం రావటంతో పాటు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను రైతులు తీసుకు పోవటంతో వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈఈ నల్లూరి మస్తాన్ రావు వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. కొంతమంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కమిటీగా ఏర్పడి సుమారు 1.5 లక్షల రూపాయలు వెచ్చించి ప్యానెల్ బోర్డు ఏర్పాటు చేసుకున్నారు. అన్ని మరమ్మతులు పూర్తి కావటం, అందుబాటులో గుండ్లకమ్మ నదిలో నీరు ఉండటంతో త్వరలో మంత్రి రవికుమార్ ద్వారా ఎత్తిపోతల పథకాన్ని పునః ప్రారంభింప చేసేందుకు సిద్ధం చేశారు. రెండు సంవత్సరాల తరువాత ఆయకట్టులోని సుమారు వెయ్యి ఎకరాలకు సాగు నీరు అందుబాటులోకి రానుండటంతో తిమ్మాయపాలెం, రామాయపాలెం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బైబై గణేశా..

భారీగా నిమజ్జనాలు

కొత్తపేట(చీరాల), సెప్టెంబరు 16 : వినాయక నిమజ్జనాల ఊరేగింపులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక ఓంకార క్షేత్రం ప్రాంతంలో వినాయక చవితి సందర్భంగా



ముప్పవరంలో వినాయక నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న యువత

ఏర్పాటు చేసిన పందిరిలో భారీ గణనాథుడిని కొలువుదీర్చారు. సోమవారం నిమజ్జనం చేసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై, ప్రతిమను ట్రాక్టర్లో ఎక్కించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. తప్పెట్లు, బాణసంచా మోతలతో నగరోత్సవం కొనసాగింది. ఆద్యంతం భక్తులు జై బోలో గణేష్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం వాడరేవు సముద్ర తీరంలో గణనాథుడిని నిమజ్జనం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పంగులూరులో..

పంగులూరు :మండలంలో సోమవారం గణనాథునికి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు, నిమజ్జన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.పంగులూరులోని బొబ్బగుంట మండపంలో కొలువుదీరిన గణనాథునికి మహిళలు, స్థానిక యువత పూజలు చేసి గంగ లో నిమజ్జనం చేసేందుకు ప్రత్యేక వాహనాలలో ఊరేగింపుగా తరలివెళ్లారు. అలాగే ముప్పవరం గ్రామంలో గణనాథుని నిమజ్జన ఊరేగింపు కోలాహలంగా సాగింది.

ఇంకొల్లులో

ఇంకొల్లు : తొమ్మిదిరోజులపాటు పూజలందుకున్న గణనాథులను సోమవారం నిమజ్జనానికి తరలించారు.ఇంకొల్లు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలిన విగ్రహాలతో కోలాహల వాతావరణం నెలకొంది. స్థానిక రామమందిరం,ప్రసన్నాంజనేయ స్వామి గుడివద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలను గ్రామంలో అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఇంకొల్లులో విగ్రహ నిమజ్జనోత్సవంలో భాగంగా ఎన్టీఆర్‌పై అభిమానంతో ఆయన చిత్రపటాలతో పసుపు దుస్తులు ధరించి యువత సందడి చేసింది.



నిమజ్జనానికి వాడరేవు తీరానికి తరలిస్తున్న వినాయక ప్రతిమ



ఇంకొల్లులో వినూత్నంగా నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువత



గొర్లమిట్టలో వినాయక విగ్రహం నిమజ్జనం ఊరేగింపు బండిని లాగుతున్న పొట్టేళ్లు

ప్రత్యేక ఆకర్షణగా పొట్టేళ్ల ప్రభ

అద్దంకి, సెప్టెంబరు16: వినాయక నిమజ్జన ఊరేగింపులు సోమవారం ఉత్సాహంగా సాగాయి. అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డు, రామాటాకీస్ బజార్, గొర్లమిట్ట తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సోమవారం పట్టణంలో ఊరేగింపు నిర్వహించి గుండ్లకమ్మ నదిలో నిమజ్జనం చేశారు. గొర్లమిట్టలో ప్రభ ఏర్పాటు చేసి బండి పై వినాయక విగ్రహం ఉంచి మూడు జతల పొట్టేళ్లతో లాగించారు. పొట్టేళ్ల బండి ప్రభ, వినాయక విగ్రహం ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గొర్లమిట్టలో వినాయక విగ్రహం నిమజ్జనం ఊరేగింపును టీడీపీ బాపట్ల జిల్లా న్యాయవాదుల విభాగం అధ్యక్షుడు బత్తుల రామకోటయ్య ప్రారంభించారు. స్థానిక టీడీపీ నేతలు ఎనుమల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ట్రాక్టర్‌పై ప్రత్యేక ఆకర్షణగా ఎన్టీఆర్ బొమ్మ

మార్టూరు, సెప్టెంబరు 16:మండలంలోని గ్రామాలలో వినాయకుని నిమజ్జనాలను భక్తులు భక్తిపారవశ్యంతో నిర్వహిస్తున్నారు.సోమవారం మార్టూరు తూర్పుబజారులో వినాయకుని గుడి వద్ద మండపంలో ఏర్పాటుచేసిన గణనాథున్ని నిమజ్జనానికి తరలించారు. అందుకోసం భక్తులు ప్రత్యేకంగా రక రకాల పూలతో అలంకరించిన ట్రాక్టరుపై వినాయకుని బొమ్మను ఏర్పాటుచేశారు. అంతేగాకుండా ఈ ట్రాక్టరుపై ముందుభాగాన ఎన్‌టీఆర్ బొమ్మతోపాటు, ఇరువైపులా ఏర్పాటు చేసిన ఏనుగుల బొమ్మలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా స్వామి వారి లడ్డూను 50 వేల రూపాయలకు నార్నె రామాంజనేయులు పాడుకున్నాడు. ఇంకా మార్టూరు నేతాజీనగర్‌లో ఎస్‌సి లు ఏర్పాటుచేసిన వినాయకుడిని డప్పులు వాయిద్యాలతో,బాణసంచా కాలుస్తూ,దేవతామూర్తుల అవతారంలో భక్తులు ఊరేగింపుగా స్వామి వారిని నిమజ్జనానికి తరలించారు.అదేవిధంగా సంపత్ నగర్‌లో బీసీలు ఏర్పాటుచేసిన వినాయకుడ్ని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో శివాలయం నుంచి గణనాథుడిని డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుచేసి నిమజ్జనానికి తరలించారు.



మార్టూరులో తూర్పుబజారున నిమజ్జనానికి ట్రాక్టరుపై బయలుదేరిన వినాయకుని ముందు ప్రత్యేక ఆకర్షణగా ఎన్‌టీఆర్ బొమ్మ

సమస్యలకు నిలయం దివ్యాంగుల కాలనీ

పట్టించుకోవాలని వేడుకోలు

మార్టూరు, సెప్టెంబరు16: జాతీయరహదారి సమీపంలో ఉన్న మా కాలనీలో సమస్యలను అధికారులు పట్టించుకోవాలని మార్టూరులోని దివ్యాంగుల కాలనీ వాసులు కోరుతున్నారు.దాదాపుగా 2008లో 50 మంది దివ్యాంగులకు ఇంటి స్థలాలను ఇచ్చారు. తర్వాత మరి కొంత మందికి ఇచ్చారు.వారిలో కొంతమంది పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు. మరి కొంతమందికి ప్రభుత్వ పరంగా సహకారం అందకపోవడంతో ఇంటి నిర్మాణాలను చేపట్టలేకపోయారు. అయితే కాలనీలో ఇంతవరకు కనీస అవసరాలు కూడా ఏర్పాటుచేయలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోలేదని వాపోయారు. కాలనీలో మూడువీధులలో ఇప్పటివరకు విద్యుత్, తాగునీరు, సైడుకాల్వలు, డ్రైనేజీ సౌకర్యం కూడా ఏర్పాటుచేయలేదని,దానికి తోడు రోడ్లుకూడా సక్రమంగా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ఉప్పలపాటి అచ్చుతరామరాజు,షేక్ సైదాబి, జి.సాయిబాబు, జంగా బాబు, కోటేశ్వరరావు, సత్యానందం, గోనుగుంట్ల వెంకటసుబ్బారావు తదితరులు కోరుతున్నారు.



రహదారి లేక చిల్లచెట్లతో నిండి ఉన్న కాలనీ గురించి వివరిస్తున్న దివ్యాంగులు, స్థానికులు

రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

అద్దంకి, సెప్టెంబరు16: రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా సోమవారం అద్దంకి పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బందికి స్వీట్లు, రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు కాలేషాబాబు విరాట్, కొండ్రగుంట శ్రీనివాసరావు, దేవరపల్లి సురేష్, కొత్తమాసు నాగరాజు, గుర్నాదం వెంకటేశ్వర్లు, నాగులు పాల్గొన్నారు.

నేడు ర్యాలీ

స్వచ్ఛతే సేవ పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం అద్దంకి పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎం బెల్లం రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రారంభమై బంగ్లా రోడ్డు వరకు జరిగే ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు

సాగర్ కాలువ వద్ద పొంచిఉన్న ప్రమాదం

పంగులూరు, సెప్టెంబరు 16 :మండలంలోని అలవలపాడు అడ్డరోడ్డు మలుపులో ఉన్న సాగర్ నీటి కాలువతో ప్రమాదం పొంచిఉంది. 16వ నెంబరు జాతీయ రహదారికి పడమటి వైపున ఉన్న పమిడిపాడు మేజర్ నుంచి అలవలపాడు పంట పొలాలకు, సాగు నీటి చెరువుకు నీటి సరఫరా చేసేందుకు ఎన్ఎస్‌పీ కాలువ నిర్మితమై ఉంది. జాతీయరహదారికి పడమటి వైపున ఉన్న ప్రధాన కాలువ నుంచి రోడ్డు ఇవతలవైపుకు నీటి సరఫరా కోసం రోడ్డు అడుగున తూములు ఏర్పాటు చేసి కాలువపై గోడ నిర్మించారు. జాతీయరహదారికి తూర్పున అలవలపాడు వైపు అడ్డరోడ్డుకు తిరిగే మలుపులో కాలువపై నిర్మితమైన రక్షణ గోడ రోడ్డుకు సమాంతరంగా ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. రేణంగివరం నుంచి అలవలపాడు వైపు వెళ్లే ఈ రోడ్డు మలుపులో కాలువపై రోడ్డుకు సమాంతరంగా ఉన్న రక్షణ గోడ ఎత్తు పెంచి ప్రమాదాలు నివారించేలా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.



అలవలపాడు అడ్డరోడ్డు మలుపులో ప్రమాదకరంగా ఉన్న సాగర్ కాలువ

పవర్‌లిఫ్టింగ్‌లో చాంపియన్‌గా కుమారి నంద

సంతమాగులూరు, సెప్టెంబరు 16:స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌గా ఏల్చూరు గ్రామానికి చెందిన మహిళా న్యాయవాది కుమారి నంద ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 14, 15 తేదీలలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో జరిగిన 11వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అన్ ఎక్యూపుడ్ పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్-2024 పోటీలలో ఏల్చూరు గ్రామానికి చెందిన మహిళా న్యాయవాది పర్చూరు కుమారి నంద 2 పతకాలు సాధించారు. కుమారి నంద సీనియర్స్ మహిళల విభాగంలో బాపట్ల జిల్లా తరఫున 76 కేజీల విభాగంలో పోటీపడి బెంచ్ ప్రెస్‌లో గోల్డ్ మెడల్ సాధించి స్టేట్ చాంపియన్‌గా నిలిచారు. అంతే కాకుండా అన్ ఎక్యూపుడ్ పవర్ లిఫ్టింగ్ విభాగంలో 265 కేజీల బరువును ఎత్తి మరొక రజిత పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇప్పటికే బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కి వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ వృత్తి రీత్యా న్యాయవాదిగా సేవలందిస్తూనే కుమారి నంద పవర్ లిఫ్టింగ్ క్రీడపై మక్కువతో పోటీలలో పాల్గొంటూ పతకాలు సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు, ఏల్చూరు గ్రామస్థులు, బాపట్ల జిల్లా క్రీడాభిమానులు అభినందనలు తెలియజేశారు.



అవార్డు అందుకుంటున్న కుమారి నంద

సాయి వాసవికి ఆంధ్ర మెడికల్ కాలేజీలో సీటు



చినగంజాం, సెప్టెంబరు 16 : మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన మాదాసు సాయివాసవి విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. మేలో జరిగిన నీట్-2024లో 720 మార్కులకు గాను 662 మార్కులు సాధించి, ఆల్ ఇండియాలో 17541వ ర్యాంకు సాధించింది. జూన్ మొదటి వారం ఫలితాలు రాగా ఆదివారం రాత్రి ప్రభుత్వ ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు కేటాయించినట్లు సమాచారం వచ్చిందని సాయివాసవి సోమవారం తెలిపారు. సాయివాసవి తండ్రి నరసింహారావు అద్దంకి ఆర్టీసీ డిపోలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తల్లి వైదేహి గృహిణి. మెడికల్ సీటు సాధించిన సాయివాసవీకి గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

బాడీ బిల్డింగ్‌లో చీరాల యువకుల సత్తా

చీరాలటౌన్, సెప్టెంబర్ 16 : బాడీ బిల్డింగ్‌లో విజేతలుగా చీరాల యువకులు నిలిచారు. గత ఆదివారం ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 55 కేజీల విభాగంలో చీరాల మండలం పాత చీరాలకు చెందిన సూరిన భాస్కర రెడ్డి రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 50 కేజీల విభాగంలో అదే గ్రామానికి చెందిన మేరుగు కిషోర్ 4వ స్థానాన్ని దక్కించుకున్నారు. దీంతో రాష్ట్రస్థాయిలో చీరాల ఘనతను చాటిన వీరిని పలువురు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు, నాలుగు స్థానాలు సాధించిన యువకులు

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ మెకానిక్ దుర్మరణం



చీరాలటౌన్, సెప్టెంబర్ 16 : రోడ్డుప్రమాదంలో ఆర్టీసీ గ్యారేజి రెగ్యులర్ మెకానిక్ దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జాండ్రపేట సమీపంలోని గుమస్తాల కాలనీకిచెందిన అచ్యుతుని ఫణికుమార్(43) చీరాల ఆర్టీసీ డిపోలో రెగ్యులర్ మెకానిక్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఏడేళ్ల బాబు ఉన్నారు. సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి పాల ప్యాకెట్ తీసుకుని వస్తుండగా వేటపాలెం నుంచి చీరాల వైపు బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో ఫణి రోడ్డుపక్కన డివైడర్‌ను గుద్దుకుని అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే వారు అదే వేగంతో ఆగి ఉన్న ఆటోను సైతం ఢీకొట్టగా ఆటో దాదాపు 10మీటర్లు ముందుకు వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు చీరాల సీపీఐ సీనియర్ నాయకులు బాబురావు రెండవ కుమారుడు.



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య (ఇన్‌సెట్లో) ఫణికుమార్ (ఫైల్)

వృద్ధులకు పండ్లు, మిఠాయిల పంపిణీ

పర్చూరు, సెప్టెంబరు 16: జనసేన పార్టీ పర్చూరు నియోజకవర్గ నాయకులు మన్నెం శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా పర్చూరులోని వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక బొమ్మల సెంటర్ కూడలిలో భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. సామాజిక సేవే లక్ష్యంగా తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమం చేపట్టినట్లు ఆపార్టీ నాయకులు కారంపూడి సందీప్ తేజ, తోట మణి, రంగిశెట్టి ఆంజనేయులు, దాసరి సాంబయ్య, బాలు, అచ్చికోలు సతీష్ తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందుకు కేక్ కట్‌చేసి శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



పర్చూరులో అన్నదానం నిర్వహిస్తున్న జనసైనికులు

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

చినగంజాం, సెప్టెంబరు 16 : మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని మిలాద్-ఉన్-నబీ పండుగను భక్తి శ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త చూపిన శాంతి, ధర్మం, న్యాయం, అహింసా మార్గాల్లో ప్రజలు నడవాలని ముస్లిం పెద్దలు సూచించారు. ఈ సందర్భంగా చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని జాలమ్మ కాలనీలోని పేద పిల్లలకు చినగంజాం రెండవ వార్డు మెంబరు, మండల మార్కెస్ మసీదు అధ్యక్షులు షేక్.నబీషా, ఆయన కుమార్తె అయిషాలు దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు.

పర్చూరులో..

పర్చూరు : మిలాదున్ నబి పండుగను మండలంలోని ముస్లిం సోదరులు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మహ్మద్ ప్రవక్త మార్గాన్ని అనుసరించి జీవనం సాగించాలని ఇమామ్ కోరారు.

ముస్లింలకు మంత్రి శుభాకాంక్షలు

అద్దంకి, సెప్టెంబరు16: సమాజాన్ని శాంతి వైపు నడిపించిన దివ్యచరితుడు మహమ్మద్ ప్రవక్త అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్-ఉన్-నబిని ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్న ముస్లింలకు రవికుమార్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.




'సోమశిల'లో 50 టీఎంసీల నీరు

అనంతసాగరం, సెప్టెంబరు 16: సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం 14,404 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, జలాశయంలో 50.002 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ కండలేరుకు 10 వేలు, డెల్టాకు 50 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

గ్రీవెన్స్...!

ఇప్పటి వరకు అందిన అర్జీలు : 3,432	పరిష్కరించినవి : 2,328	పరిష్కార దశలో ఉన్నవి : 932	తిరస్కరణ : 172

జిల్లాలో భూ సమస్యలు విపరీతమయ్యాయి. ఎంతలా అంటే ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (గ్రీవెన్స్) వచ్చే అర్జీల్లో సగానికిపైగా భూ సమస్యలే ఉంటున్నాయి. 2019కు ముందు వరకూ గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీల్లో 20 శాతం భూ సమస్యలు ఉండేవి. కానీ ఇప్పుడు 50 శాతానికి పెరిగింది. అంటే గడిచిన ఐదేళ్లలో జరిగిన తప్పులు, అక్రమాల మూలంగా సమస్యలు రెట్టింపయ్యాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జూన్ 15వ తేదీ నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తోంది. నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రతీ వారం సరాసరి 300 వరకూ అర్జీలు వస్తున్నాయి. ఈ మూడు నెలల్లో 3,432 అర్జీలు అందగా, 1551 అర్జీలు రెవెన్యూ శాఖకు చెందినవే. ఇవన్నీ భూ సమస్యలకు చెందినవి కావడంతో ఉన్నతాధికారులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. గత ప్రభుత్వ పాలనకు ఇది నిదర్శనంగా కనిపిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భారీగా అర్జీలు
- సగానికిపైగా భూసమస్యలపైనే!
- భ్రష్టుపట్టించిన గత ప్రభుత్వం
- ఇప్పటికీ గాడిలో పడని రెవెన్యూ శాఖ
- అరకొర పరిష్కారంతో తప్పించుకునే ప్రయత్నం



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్ (ఫైల్)

నెల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు భూములను ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. ప్రభుత్వం, ప్రైవేటు అన్న తేడా లేకుండా ఇష్టారీతిన రికార్డులు మార్పు చేసి వివాదాలు సృష్టించారు. నాడు రెవెన్యూ అధికారులు కూడా వైసీపీ నేతలు చెప్పినట్లు చేయడంతో సమస్యలు ఎక్కువయ్యాయి. వైసీపీ అధికారంలో ఉన్నన్ని రోజులూ ఎన్ని అర్జీలు ఇచ్చినా పట్టించుకున్న నాథుడు లేడు. ఇప్పుడు అటువంటి భూ బాధితులంతా ఉన్నతాధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. వారికి జరిగిన అన్యాయాన్ని చెప్పుకుంటూ బోరుమంటున్నారు. ఇక సమస్యలు పరిష్కరించే ఉద్దేశంతో తీసుకొచ్చిన భూముల రీసర్వే ప్రక్రియ కూడా కొత్త సమస్యలు తెచ్చి పెట్టింది. సరైన విధివిధానాలు లేకపోవడం, వీటిపై జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులకు కూడా సరైన అవగాహన లేకపోవడంతో కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. అధికారుల వద్దనున్న రికార్డుల ప్రకారం రీసర్వే చేశారు తప్ప రైతుల వద్దనున్న రికార్డులను పట్టించుకోలేదు. ఒక ప్రభుత్వ భూమిని ఎప్పుడో ప్రభుత్వం పట్టాలు చేసి ఉండి, ఆ తర్వాత ఆ భూమిపై క్రయవిక్రయాలు జరిగి ఉన్నప్పటికీ అటువంటి భూములను తాజా రీసర్వేలో ప్రభుత్వ భూమిగా నమోదు చేసి నిషేధిత జాబితాలోకి చేర్చారు. ఇక నోషనల్ ఖాతాలను కూడా సవరించకుండా వాటిని కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

ఇప్పటిదాకా ప్రధాన శాఖలకు అందిన అర్జీలు

శాఖ పేరు	అర్జీలు	పరిష్కారం	పెండింగ్
రెవెన్యూ	1551	834	621
మున్సిపల్	365	332	27
పంచాయతీ	203	152	49
సర్వే శాఖ	146	90	36
పోలీసు శాఖ	242	179	45
ఇరిగేషన్	79	49	28
సివిల్ సప్లయిస్	49	39	10
విద్యుత్	65	51	11
విద్యాశాఖ	49	39	10

ఇటువంటి ఫైళ్లు కలెక్టరేట్‌లో వందల సంఖ్యలో పెండింగ్ ఉండటం గమనార్హం.

● పరిష్కారం కాని సమస్యలు

పెద్ద ఎత్తున భూ సమస్యల అర్జీలు అందుతున్నా ఆ స్థాయిలో పరిష్కారం మాత్రం జరగడం లేదు. మండల స్థాయిలో పరిష్కరించకపోతేనే చాలా వరకూ సమస్యలు జిల్లా అధికారుల వద్దకు వస్తాయి. అటువంటి వాటిని మళ్లీ మండల అధికారుల వద్దకే పంపుతుండటంతో సమస్య మళ్లీ మొదటికి వస్తోంది. బాధితుడు పదే పదే కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. ఉదాహరణకు నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు వద్ద జరిగిన ఓ భారీ స్కామ్‌నే ఇందుకు నిదర్శనం. గతంలో అసైన్‌మెంట్ కింద పేదలకు ఇచ్చిన భూములను కొందరు తప్పుడు మార్గంలో రెవెన్యూ రికార్డులు మార్పు చేసి ఆక్రమించుకున్నారని బాధితుల ఫిర్యాదు. గత ప్రభుత్వంలో పట్టించుకోక పోగా ఈ ప్రభుత్వం రాగానే ఇక్కడ తప్పు జరిగినట్లు సాక్షాత్తూ ఆర్డీవోనే నిర్ధారించారు. దీంతో సదరు మ్యుటేషన్లను రద్దు చేసి కొత్తగా ఆర్‌వోఆర్ చట్టం ప్రకారం నోటీసులు ఇచ్చి మ్యుటేషన్లు చేయాలని కలెక్టర్ ఆర్డర్ ఇచ్చారు. అయినా మండల రెవెన్యూ అధికారులు మాత్రం అక్కడ అసలు తప్పే జరగలేదని గ్రీవెన్స్ అర్జీకు సమాధానం ఇస్తూ సమస్య పరిష్కరించినట్లు క్లోజ్ చేయడం గమనార్హం. అలానే నోషనల్ ఖాతాలకు సంబంధించి సులభంగా పరిష్కరించాల్సిన సమస్యలు కూడా ల్యాండ్ మేటర్ సెక్షన్‌లో భారీగా ఫైళ్లు పెండింగ్ ఉన్నాయి. ఇప్పటికీ జిల్లాలో రెవెన్యూ శాఖ గాడిలో పడలేదు. ఈ శాఖపై పర్యవేక్షణ కూడా కొరవడింది. కొన్నాళ్లపాటు జాయింట్ కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉండడం, ఆ తర్వాత కొత్త జేసీ వచ్చినప్పటికీ ఆయన విజయవాడ వరదల నివారణ విధుల్లో ఉండడంతో క్షేత్రస్థాయిలో పరిస్థితి గతంలోలానే కొనసాగుతోంది.

ఇసుక అమ్మకాలు 19 నుంచి?

ఆన్‌లైన్, సచివాలయాలు, తహసీల్దారు కార్యాలయాల్లో బుకింగ్

ప్రస్తుతానికి మూడు చోట్ల నిల్వలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) సెప్టెంబరు 16 : జిల్లాలో ఈ నెల 19 నుంచి ఇసుక అమ్మకాలు ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే మూడు ప్రాంతాల్లో డ్రెడ్జింగ్ విధానంలో పడవల ద్వారా పెన్నానది నుంచి ఇసుకను బయటకు తీసి స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. డ్రెడ్జింగ్ చేయడానికి, నది నుంచి స్టాక్ పాయింట్‌కు ఇసుకను తరలించేందుకు అయ్యే ఖర్చులు కలుపుకొని టన్ను ఇసుక రూ.380గా ప్రభుత్వం నిర్ణయించింది. ఇక స్టాక్ పాయింట్ నుంచి దూరాన్ని బట్టి రవాణా చార్జీలు అదనంగా ఉండనున్నాయి. ఆన్‌లైన్‌తోపాటు సచివాలయాలు, తాహసీల్దారు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా ఇసుక కోసం బుకింగ్ చేసుకోవచ్చు. ఇప్పటికే పోతిరెడ్డిపాళెం వద్దనున్న షుగర్ ఫ్యాక్టరీ, సంగం, పొదలకూరు వద్దనున్న సూరాయపాళెం ప్రాంతాల్లో ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి ఆన్‌లైన్ బుకింగ్ చేసుకొన్న వారు రశీదు చూపించి తీసుకువెళ్లవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ఇసుక సరఫరా చేసే వాహనాల రవాణా చార్జీలు ఒకే విధంగా ఉండేలా ఖరారు చేస్తూ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

● త్వరలో మరింత తగ్గుదల

పర్యావరణ అనుమతులు రాకపోవడంతో ప్రజలకు ఇసుక సరఫరా కాస్త భారంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆ అనుమతులు వచ్చాక ఇసుక ధరలు మరింత తగ్గుతాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో దాదాపు 10 రీచ్‌లు ఉండగా, వీటన్నిటికీ పర్యావరణ అనుమతులు రానున్నాయి. నేరుగా రీచ్‌ల నుంచి ఇసుక సరఫరా ప్రారంభం కానున్నది. అదే జరిగితే ధరలు మరింత తగ్గి కేవలం కూలీలు, రవాణా చార్జీలతోనే ఇసుక సరఫరా జరుగుతుంది.

కిలోమీటరుకు సగటు చార్జీ జీఎస్టీతో కలుపుకొని.. (రూ.లలో)

దూరం (కి.మీ)	ట్రాక్టర్ (4.5 టన్నులు)	లారీ (10 టన్నులు)	లారీ (18-35 టన్నులు)
0-10	13.5	10.7	9.4
11.8	12.8	10.2	8.9
21-30	12.8	10.2	8.9
31-40	12.8	10.2	8.9
40-80	6.3	6.3	6.3
80పైన	-	3.5	3.5



కోవూరు షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో ఇసుక నిల్వ

అక్రమ లేఅవుట్లలో 120 ఎకరాల ప్రభుత్వ భూమి

- కాలువలు, గుంటలు 70 ఎకరాల స్వాధీనం
- మరో 50 ఎకరాల స్వాధీనానికి చర్యలు
- తప్పుడు సమాచారం ఇచ్చిన ఉద్యోగులపై చర్యలు
- కావలి కమిషనర్, తహసీల్దారు వెల్లడి

కావలి, సెప్టెంబరు 16 : కావలి పట్టణ పరిధిలోని అక్రమ లేఅవుట్లలో 120 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ శ్రావణ్ వెల్లడించారు. అక్రమలేఅవుట్లలో 120 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉందని పత్రికల్లో కథనాలు రాగా, అవి ఎక్కడున్నాయో చూపించాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పలు సందర్భాలలో ప్రశ్నించారు. సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తు చేసినా చూపించలేదని వెల్లడించారు. అయితే, అనూహ్యంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, తహసీల్దారు అక్రమ లే అవుట్ల వివరాలు వెల్లడించడంపై పెద్ద చర్చ నీయాంశమైంది. ఇంకా సర్వే కొనసాగుతోందని వారు చెప్పడంతో ప్రభుత్వ భూమి ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయి. కమిషనర్ మాట్లాడుతూ 70 ఎకరాల వరకు కాలువ, గుంతలనే గుర్తించి, వాటిని మళ్లీ యథాస్థితికి తెచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. మరో 50 ఎకరాలను కూడా స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు. అయితే సమాచార హక్కు చట్టం కింద అసంపూర్తి సమాచారం ఇచ్చిన ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అక్రమ లేఅవుట్లలో ఎక్కడా భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరని, ఎవరైనా నిర్మిస్తుంటే వెంటనే ఆపాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు నగరంలో ముస్లింల ర్యాలీ



చిన్నబజార్‌లోని షహింషా మసీద్‌లో ఆసార్ చూస్తున్న ముస్లిం మహిళ

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి

జిల్లావ్యాప్తంగా సోమవారం మిలాద్ ఉన్ నబి చివరి మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు, దివ్య ఖురాన్ ప్రవచనాలతోపాటు పేదలకు అన్నదానం వంటి కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం మహ్మద్ ప్రవక్తకు కృతజ్ఞతగా ముస్లిం జెండాలతో జూలూస్ (కృతజ్ఞతా ర్యాలీ) ఊరేగింపులు నిర్వహించారు. నెల్లూరు నగరంలో ఇస్లామి జెండాలు చేతబట్టి మహమ్మద్ ప్రవక్తను కీర్తిస్తూ కార్లు, బైక్‌ల ర్యాలీ జరిగింది. కోటమిట్ట నుంచి బయలుదేరిన ర్యాలీ పెద్దబజారు, ఆచారి వీధి, నెహ్రూ బొమ్మ, గాంధీబొమ్మ, ఏసీ బొమ్మ, సంతపేట, చిన్నబజార్, పెద్దబజార్ మీదుగా తిరిగి డైకస్‌రోడ్డు, కోటమిట్ట వరకు సాగింది.

- నెల్లూరు (సాంస్కృతికం)

పవిత్రోత్సవ సంబరం



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

రాపూరు, సెప్టెంబరు 16 : పెంచలకోన క్షేత్రంలో పవిత్రోత్సవాల సందర్భంగా రెండోరోజు సోమవారం శ్రీవార్లకు ఉదయం విశేష హోమాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, నివేదన, శాత్తుముర్రై తదితర కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణలతో అత్యంత వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్య నిర్వహణాధికారి కేవీ సాగర్‌బాబు తెలిపారు.

ఈ-పంట నమోదు 23 వరకు పొడిగింపు

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 16 : ఈ-పంట నమోదు ప్రక్రియను ఈ నెల 23వతేదీ వరకు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నాటికే గడువు ముగిసినా రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. 25 నుంచి 27వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో గ్రామసభలు, 28వ తేదీన దీనికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించి తుది జాబితా 30వ తేదీన రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

వంటనూనెలు సలసల

వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచినట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించడమే తరువాయి ధరలు అమాంతం పెరిగిపోయాయి. పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనె లీటరుకు రూ.20 నుంచి 30 వరకు ఎగబాకింది. వంట నూనె ధరల పెంపుతో అన్ని వర్గాల ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికుతోంది. కొత్త సరుకులపై కాకుండా నిల్వ వున్న సరుకును కూడా అధిక ధరలకు విక్రయించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు నోస్టాక్ బోర్డును పెట్టి డిమాండ్ సృష్టిస్తున్నారు.

దిగుమతి సుంకం పెంచిన కేంద్రం

ఆ వెంటనే ధరల పెరుగుదల

లీటరుపై రూ.20 నుంచి 30 దాకా వడ్డన

జిల్లావాసులపై నెలకు రూ.240 కోట్ల వరకు భారం

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 16 : వంటకు ఎక్కువగా వినియోగించే పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెపై గతంలో ఎన్నడూలేని విధంగా కేంద్రం భారీగా దిగుమతి సుంకం విధించింది. ఇప్పటివరకు పామాయిల్‌కు ఈ సుంకం లేదు. అయితే, ఇప్పుడు 27.5 శాతం డ్యూటీ విధించారు. అలాగే సన్‌ఫ్లవర్‌పై 13 శాతం ఉన్న డ్యూటీని 35.5 శాతానికి పెంచేశారు. సన్‌ఫ్లవర్ నూనె 15 లీటర్ల డబ్బా ఖరీదు రూ.1,605 వరకు ఉండగా రూ.2,055వేలకు చేరింది. లీటరు ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.137లకు ఎగబాకింది. అంటే లీటరుపై రూ.29 వరకు పెరిగింది. 15 లీటర్ల పామాయిల్ నూనె డబ్బా ధర మొన్నటి వరకు రూ.1,410 ఉండగా, ఇప్పుడది రూ.1,710 దాటింది. లీటరు ధర రూ.94 నుంచి రూ.114లకు చేరగా లీటరుకు రూ.20 వరకు పెరిగింది. వంటనూనెలు లేకుండా ఆహారపదార్థాల తయారీని ఊహించలేము. ఇప్పుడా వంటనూనె ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతుల వంటింటి బడ్జెట్ ఒక్కసారిగా గాడి తప్పే పరిస్థితి ఏర్పడింది. పూజలకు వినియోగించే వివిధ రకాల నూనెల ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయి. మొన్నటి వరకు లీటరు ధర రూ.100 - 110 వరకు వుండగా, అవి ఇప్పుడు రూ.125-130లకు చేరాయి.



● రోజుకు 4 లక్షల కిలోలు..

జిల్లాలో రోజుకు 180 టన్నుల పామాయిల్, 60 టన్నుల సన్‌ఫ్లవర్ ఆయిల్, లీటరు ప్యాకెట్లు 10 టన్నుల మేర విక్రయాలు జరుగుతుంటాయి. ఈ ప్రకారం రోజుకు దాదాపు 4 లక్షల కేజీల పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. దిగుమతి సుంకం పెంపు కారణంగా రోజుకు దాదాపు రూ.8.5 కోట్ల నుంచి 9.5 కోట్ల మేర, నెలకు రూ.240 కోట్ల నుంచి 270 కోట్ల మేర ప్రజలపై అదనపు భారం పడింది. దీనిపై పేద, మధ్య తరగతి కుటుంబాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిత్యావసర సరుకుల్లో భాగమైన వంటనూనెలపై పెనుభారాన్ని తగ్గించి, ధరలను పేదలకు అందుబాటులో తెచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు కేంద్రం దిగుమతి సుంకం పెంచనుందన్న సమాచారంతో మిల్లుల యజమానులు, వ్యాపారులు వంట నూనెలను బ్లాక్ మార్కెట్‌కు తరలించేశారు. రెండ్రోజుల క్రితం డబ్బులు చెల్లించుకుని శనివారం డెలివరీ ఇవ్వాల్సిన ట్యాంకర్లకు సంబంధించి మొత్తాన్ని వ్యాపారులకు వ్యాపార సంస్థలు వెనక్కి ఇచ్చేశాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా డబ్బు చెల్లిస్తే సరఫరా చేస్తామని షరతు విధించాయి. దీంతో హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు పెరిగిన ధరల ప్రకారమే విక్రయాలు ప్రారంభించారు. పామాయిల్, సన్‌ఫ్లవర్ అయిల్ మలేసియా నుంచి మన దేశానికి ఎక్కువగా దిగుమతి అవుతుంది.

లెక్కల మాస్టారుకు 'సైన్స్' బాధ్యతలు

నిబంధనలకు విరుద్ధంగా నియామకం

గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు

విద్యారంగం ఉన్నతికి, విద్యార్థుల భవితకు కీలక నిర్ణయాలు తీసుకుని అమలు చేయాల్సిన విద్యాశాఖ అధికారులు రాజకీయ ఒత్తిళ్లు, లాబీయింగ్‌లకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పోస్టింగ్‌లు కేటాయించడం, డిప్యుటేషన్‌లు చేపట్టడం వంటి అంశాలు ఇటీవల విద్యాశాఖలో సర్వసాధారణమై పోయాయి. తాజాగా సైన్స్ కేంద్రం ఇన్‌ఛార్జిగా, జిల్లా సైన్స్ అధికారి (ఇన్‌ఛార్జి)గా ఓ లెక్కల మాస్టారును నియమించడం విమర్శలకు తావిస్తోంది.

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 16 : ఎంతో కీలకమైన జిల్లా సైన్స్ అధికారి పోస్టింగ్‌కు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడిని నిబంధనలకు విరుద్ధంగా నియమించడంపై ఉపాధ్యాయుల్లో చర్చనీయాంశమైంది. ప్రధానోపాధ్యాయుడు, అంతకన్నా పెద్ద హోదా కలిగిన వారు మాత్రమే నిర్వర్తించే ఈ బాధ్యతలను కొన్నేళ్లుగా అనర్హులకు కట్టబెడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి తమకు సంబంధించిన వ్యక్తిని సైన్స్ అధికారిగా నియమించేలా పావులు కదపడంతో నాటి డీఈఓ తప్పనిసరి పరిస్థితుల్లో ఆయనకు జిల్లా సైన్స్ అధికారి బాధ్యతలు అప్పగించారు. ఈ పోస్టులో నియమితులైన వారు తమ పాఠశాల విధులు నిర్వర్తిస్తూనే అదనంగా సైన్స్ అధికారి విధులు కూడా నిర్వర్తించాల్సి ఉండగా పాఠశాలకు పూర్తిగా డుమ్మాకొట్టి సైన్స్ అధికారిగానే చెలామణి అవుతూ ఐదేళ్లు గడిపేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో పనిచేసిన అధికారి తన పదవిని స్వచ్ఛందంగా వదిలేసి ఉపాధ్యాయ విధుల్లో చేరిపోయారు. దీంతో ఈ పోస్టును పొందేందుకు ఎవరికి వారు తమ శక్తి మేరకు పలుకుబడులు ఉపయోగించారు. అయితే, నెల్లూరులో నివాసం ఉంటూ రాపూరు మండలంలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ గణితం మాస్టారు లాబీయింగ్‌లో సఫలీకృతులయ్యారు. ఓ ప్రజాప్రతినిధి ద్వారా జిల్లా సైన్స్ కేంద్రం ఇన్‌చార్జిగా ఉత్తర్వులు సాధించుకున్నారు. ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా డీఈఓ అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు జిల్లా సైన్స్ అధికారిగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించడంపై సైన్స్ ఉపాధ్యాయులు భగ్గుమంటున్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను కూడా తమకు అనుకూలంగా వినియోగించుకోవచ్చన్న దురాశతోనే పైరవీలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై జిల్లా పాలనాధికారులు దృష్టి సారించి నియమ, నిబంధనలకు అనుగుణంగా జిల్లా సైన్స్ అధికారి నియామకం చేపట్టాలని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నారు.



కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

విద్యార్థి అదృశ్యంపై ఆందోళన



మాట్లాడుతున్న విద్యార్థి తల్లిదండ్రులు

కావలి, సెప్టెంబరు 16: స్థానిక అరుంధతీయవాడకు చెందిన గౌడుపేరు మహేష్ అనే విద్యార్థి ఈ నెల 11వ తేదీ నుంచి కనిపించటం లేదని వారి తల్లిదండ్రులు చిన్నయ్య, శిరీషలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సోమవారం వారు కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో మాట్లాడారు. పట్టణంలోని కాకతీయ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తమ కుమారుడు స్కూల్‌కు ఎందుకు వెళ్లలేదని మందలించటంతో అప్పటి నుంచి కనిపించకుండా పోయారన్నారు. తమ బిడ్డ ఆచూకీ ఎక్కడైనా ఉంటే తమకు తెలపాలని వారు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ మేరకు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ఆత్మకూరు : స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాల బయట రోడ్డు పక్కన ఉన్న బస్‌షెల్టర్‌లో ఓ గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి మున్సిపాలిటీ, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు అనాథ వృద్ధుడిగా స్థానికులు భావిస్తున్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్లు

ఉలవపాడు : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సోమవారం వేకువజామున స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ అం కమ్మ తెలిపిన వివరాల మేరకు.. మన్నేరువాగులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లారు. 6 ట్రాక్టర్లలో రెండు ట్రాక్టర్లకు ఇసుకతో నింపి ఉండగా మరో నాలు గు ట్రాక్టర్లు ఖాళీగా ఉన్నాయి. ఇసుక నింపిన ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఖాళీ ట్రాక్టర్ల యజమానులకు తొలి తప్పుగా కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరికలతో పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూరు : ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. నెల్లూరుపాళెంసెంటర్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా వాసిలి వైపు నుంచి వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లకు ఎటువంటి బిల్లులు లేకపోవడంతో అక్రమ రవాణాగా భావించి సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

కందుకూరు : జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ ప్రవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు స్థానిక యూపీహెచ్‌సీ వైద్యాధికారి బ్యూలా గ్రేస్ ఓ ప్రకటనలో తెలిపారు. కందుకూరు అర్బన్‌లో 15,618 మంది విద్యార్థులు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఉదయగిరి రూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం విద్యార్థులకు నులి పురు గులు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 6-19 ఏళ్ల వయసు కలిగిన విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1-5 ఏళ్లలోపు చిన్నారులకు మధ్యాహ్న భోజనం అనంతరం అల్బెండజోల్-400 ఎంజీ మాత్రలు మింగించడం జరుగు తుందన్నారు. మండలంలో 9,216 మందికి మాత్రలు మింగించడమే లక్ష్యమన్నారు.

బావిలో పూడిక తీయించండి



వాడుకలో లేని చేదుడు బావి

లింగసముద్రం : తిమ్మారెడ్డిపాలెం చెరువు సమీపంలోని చేదుడుబావిలో పూడికను తీయించి వాడుకలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. 10ఏళ్ల నుంచి ఈ బావి వాడుకలో లేదన్నారు. అంతకుముందు గ్రామ ప్రజలు ఈ బావిలోని నీటిని తాగేవారని చెప్పారు. ప్రస్తుతం ఆర్‌ఓ ప్లాంటు నీరు తాగి కీళ్ల నొప్పులు, ఒంటి నొప్పులతో బాధలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోర్లకు మరమ్మతులు చేయాలి



మరమ్మతులకు గురై మూలనపడ్డ చేతిబోరు

వింజమూరు : పట్టణంలో, మండలంలో పనిచేయని చేతి బోర్లకు మరమ్మతులు చేసి నీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. కుళాయిల ద్వారా వచ్చే నీరు సరిపోవడంలేదని, ఆ నీరు ఎప్పుడు వస్తుందో తెలియడంలేదన్నారు. కరెంటు లేకపోతే నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతి పంపులైతే కరెంటుతో సంబంధం లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు నీరు పట్టుకోవచ్చని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేతి పంపులను వాడుకలోకి తీసుకుస్తే కొంతైనా నీటి సమస్య నుంచి బయటపడవచ్చని అంటున్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి

● శాంతి, సన్మార్గం.. ప్రవక్త మార్గం : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



ఉదయగిరి రూరల్ : కేక్ కట్ చేస్తున్న మతపెద్దలు



కావలిటౌన్: ముస్లింలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, సెప్టెంబరు 16: మానవాళి సన్మార్గం వైపు నడిచినపుడే ప్రపంచ శాంతి సాధ్యం అవుతుందని, దివ్య ఖురాన్ బోధనలతో మానవళిని ప్రభావితం చేసిన మహోన్నతులు మహమ్మద్ ప్రవక్త అని ఎమ్మెల్యే డి.కృష్ణారెడ్డి తెలిపారు. మిలాదున్నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణ ముస్లింలు పెద్దఎత్తున వేడుకలు నిర్వహించారు. జెండా చెట్టు వద్ద నుంచి వారు పెద్దఎత్తున జెండాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ప్రవక్త మార్గం ఆచరణీయమని ఆయన బోధనలు స్ఫూర్తిదాయకమన్నారు. ట్రంకురోడ్డులో జరిగిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అలేఖ్య, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ మధుబాబు నాయుడు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సఫ్దార్ కిర్మాణి, అన్సర్, ఖమర్‌బాబు, హజరత్ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 16: మహమ్మద్ ప్రవక్త జయంతి సంద ర్భంగా సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా పట్టణంలోని చిన్న, పెద్ద మసీదులతోపాటు అస్థాన-ఏ, ఖాదరి యా దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి భారీ కేక్‌లు కట్ చేశారు. అనంతరం పట్ట ణంలో శాంతి ర్యాలీ చేపట్టారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.



చేజర్ల: జామియా మసీదు వద్ద అన్నదానం చేస్తున్న ముస్లింలు

●**చేజర్ల:** మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలను సోమవారం మండలంలోని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. చేజర్ల జామీయా మసీదు మతవల్లి కమిటీ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌సాహేబ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

●**ఏఎస్ పేట:** మండలంలోని ఏఎస్ పేటతో పాటు రాజవోలు, హసనాపురం, గుంపర్లపాడు తదితర గ్రామాలలో సోమవారం మిలాదున్ నబీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్ పేట దర్గా సెంటర్ నుండి నగర ఖానా సెంటర్, బస్టాండ్ సెంటర్ మీదుగా నిషాన్ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తిప్ప మీద బురుజు వద్ద జెండాను ఆవిష్కరించారు. ప్రార్థనలు చేశారు.

●**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** నందిపాడు, నర్రవాడ, ఏరుకొల్లు, వెంకటంపేట గ్రామాలతోపాటు దుత్తలూరులో మిలాద్-ఉన్-నబీ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ముస్లింలు మసీదులు, దర్గాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు ఖురాన్ సందేశమిచ్చి మిఠాయిలు పంచిపెట్టారు.

●**జలదంకి:** మండలంలో ముస్లింలు సోమవారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జలదంకి, గట్టుపల్లి, బి.కెఅగ్రహారం, చినక్రాక, అన్నవరం, జమ్మలపాలెం, క్రిష్టాపాడు, సోమవరప్పాడు, చోడవరంలో గ్రామాల్లో కూడా ఈ వేడుకలను జరుపుకున్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కావలి, సెప్టెంబరు 16: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) 46 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో ఎస్‌డబ్ల్యూఎఫ్ పతాకాన్ని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పెంచలయ్య ఆవిష్కరిం చారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కమిటీ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యత్వం పెంచుకోవాలన్నారు. యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలన్నారు. అన ంతరం రీజినల్ సెంటర్ నెల్లూరులో జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కావలి డి పోకు చెందిన 10మంది యూనియన్ సభ్యులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్ర మంలో యూనియన్ నాయకులు వెంకయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, కాలేషా, రోశయ్య, ఎంఏ బేగ్, ఎస్‌కేఎం బాష, రాజు, ప్రసాద్ ,శ్రీను, మనోహర్ ఉన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకుడు పెంచలయ్య

ప్రభుత్వ స్టాఫ్ నర్సులుగా గుర్తించాలి

కావలి, సెప్టెంబరు16: తమను ప్రభుత్వ స్టాఫ్ నర్సులుగా గుర్తించాలని కావలి ఏరియా వైద్యశాలలోని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు.

ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌గా 'సెబ్ '

కలిగిరి, సెప్టెంబరు 16: స్థానిక సర్కిల్ పరిధిలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోస్టేషన్ (సెబ్)ను ప్రభుత్వ ఉత్తర్వులు జీఓ నెంబర్ 188 ప్రకారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేసిన నేపథ్యంలో సోమవారం 'సెబ్' పేరున ఉన్న బోర్డు తొల గించి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని కలిగిరి, కొండాపురం, వింజమూరు, వరికుంటపాడు మండలాల్లో అక్రమ మద్యం, నాటుసారా వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలపై సెల్:94409 02523 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.



నూతన బోర్డు వద్ద ఎక్సైజ్ సిబ్బంది

పైపులైన్లకు కనెక్షన్ ఇవ్వరా ?

● నిరుపయోగంగా మంచినీటి ట్యాంకు

లింగసముద్రం, సెప్టెంబరు 16: తిమ్మారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని శింగరపాలెంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఏడాది క్రితం అధికారులు రూ. 31.60లక్షలతో 40వేల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న మంచినీటి ట్యాంకు నిర్మించారు. తాగునీటిని సర ఫరా చేసే పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇవ్వక పోవడంతో నీటి సరఫరా కావడం లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.10లక్షలతో ట్యాంకు నిర్మాణం, పైపులైన్లు, ఇంటింటికి మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. రెండు నెలల కిందట అధికారులు ఈ ట్యాంకు నుంచి పైపులైన్లకు నీటి విడుదల చేసి పరీక్షించారు. ఈ పైపులైన్‌కు ఇప్పటి వరకు నీటిని సరఫరా చేయడం లేదని శింగరపాలెం ప్రజలు వాపోతున్నారు. మరోపక్క వెంగళాపురం మంచినీటి ట్యాంకు నుంచి శింగరపాలెం గ్రామానికి తాగు నీరు సరఫరా చేస్తుండడంతో తమ గ్రామంలోని కొన్ని బజార్లకు నీరు కావడం లేదని వెంగళాపురం గ్రామస్థులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా వారు స్పందించి రెండు గ్రామాల తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



శింగరపాలెం ఎస్సీ కాలనీలో నిర్మించిన మంచినీటి ట్యాంకు

దేవతామూర్తులకు పంచలోహ కిరీటాలు

బిట్రగుంట, సెప్టెంబరు 16: విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామి పాలెంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వర స్వామి, విఘ్నేశ్వర, సుబ్రహ్మణేశ్వర స్వాములకు సోమవారం రైల్వే రిటైర్డ్ డ్రైవర్ బీఎస్ భానుసింగ్ పంచలోహ కిరీటాలను బహూకరించారు. వీటిని ఆలయ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు తమ్మవజ్జల విజయ్ పవన్‌కుమార్ శర్మ శుద్ధి కార్యక్రమం, ప్రత్యేక పూజలు చేశారు.



ఆలయ వ్యవస్థాపకుడికి కిరీటాలు అందజేస్తున్న బీఎస్ భానుసింగ్

'చలో విజయవాడ' విజయవంతం చేయండి

సీతారామపురం, సెప్టెంబరు 16 : ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న డాక్టర్లకి ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 85కి వ్యతిరేకంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సి డాక్టర్ స్వప్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో ఎటువంటి పురోగతి లేని కారణంగా ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఏపిపిహెచ్‌సి డిఏ యూనియన్ పిలుపు మేరకు మంగళవారం జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని యూనియన్ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అంతేకాకుండా పీహెచ్‌సిలో సేవలు నిలవనున్నాయని ఆమె తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

కందుకూరు, సెప్టెంబరు 16: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఎదురు భవనంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, వీరితో పాటు పారిశ్రామికవేత్త బెల్లం జయంత్‌బాబు, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవి ప్రకాష్ పాల్గొంటారని పేర్కొ న్నారు.

వీధికో బెల్టు షాపు

● విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 16: మండలంలో మద్యం ఏరులై పారుతోంది. పోలినేనిచెరువు గ్రామం మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో వీధికో బెల్ట్ షాపు ఏర్పాటుచేసి నివాసగృహాలు, బడ్డీకొట్లు, కిరాణా షాపుల్లో మద్యం విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని వలేటివారిపాలెంలో 2, పోకూరులో ఒక ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. బెల్ట్‌షాపులు సుమారు 150కి పైగా ఉన్నాయి. వీటిలో 24 గంటలూ మద్యం అధిక ధరకు లభ్యమవుతోంది. కాగా, బెల్టుషాపుల మధ్య పోటీ పెరగడంతో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇళ్లలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగానే బెల్టు షాపుల్లో చికెన్, మటన్, గుడ్లు, చేపలు ఆమ్లేట్ కూల్‌డ్రింక్స్ తదితర ఆహారపదార్థాలు వండి అందజేస్తున్నారు. కాగా, అంకభూపాలపురంలో ఏకంగా బెల్టుషాపు ఏర్పాటుకు బహిరంగంగా వేలం పెట్టి షాపు నిర్వహిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్టుషాపులను అరికట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులకు సన్మానం



అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులు

వింజమూరు, సెప్టెంబరు 16: పట్టణంలోని ఎస్వీ కల్యాణ మండపంలో సోమవారం ఉదయగిరి నియోజకవర్గం ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గం అధ్యక్షుడు కేవీ రత్నం అధ్యక్షతన ప్రైవేటు పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవార్డులు అందచేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నెల్లూరుజిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, వింజమూరు ఎంఈవో శ్రీధర్, కలిగిరి ఎంఈవో రమేష్, సురేష్, జిల్లా సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, ట్రెజరర్ కృష్ణారావు, నియోజకవర్గ సెక్రటరీ ఉదయ్‌శంకర్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్‌లు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా గాంధీనగర్ - చుండి రోడ్డు పనులు

● ప్రజలు, వాహనదారుల అవస్థలు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 16: మండలంలోని గాంధీనగర్ - చుండి రోడ్డు నిర్మాణ పనులు అంసపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గాంధీనగర్ నుండి అమ్మపాలెం, కాకర్లవారిపాలెం మీదుగా చుండి జాతీయ రహదారి వరకు సుమారు 6.34 కిలోమీటర్లు తారురోడ్డు నిర్మాణానికి నాబార్డు పథకం నుం చి రూ.2.2కోట్ల నిధులు గత వైసీపీ ప్రభు త్వ హయంలో మంజూరయ్యాయి. అప్పట్లో టెండ ర్లు పిలిచారు. కందుకూరు మండలం పందల పాడు గ్రామానికి చెదిన రామాల వెంకట కృష్ణారెడ్డి పనులు దక్కించుకున్నాడు. పనులను అమ్మపాలెం వరికూటి సంజీవ్‌రెడ్డి సబ్ కాంట్రాక్టర్‌గా తీసుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో పనులు ప్రారంభించారు. గాంధీనగర్ నుండి చుండి వరకు రోడ్డుకు రెండు వైపులా సైడ్ బర్మ్ మట్టి పనులు పూర్తి గ్రావెల్ వేయలేదు. వాటర్ క్యూరింగ్ చేయ లేదు.. రోలింగ్ చేయలేదు. అప్పటినుంచి ఇప్పటివరకు పనులు ముందకు సాగలేదు. రోడ్డుంతా కంకర రాళ్లు తేలాయి. నెల్లూరు, కావలి, కలిగిరి కొండాపురం, లింగసముద్రం, గాంధీనగర్, అమ్మపాలెం కాకర్లవారిపాలెం ప్రాంతాల ప్రజలు ప్రతి శనివారం మాలకొండ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి ఈ రోడ్డుపై వెళుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఈ తారురోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణం

అట్టహాసంగా వినాయక నిమజ్జనం

కావలిటౌన్, సెప్టెంబరు 16: కలుగోళమ్మశాంభవి ఆలయ ప్రాంగణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం నిమజ్జన గ్రామోత్సవం అట్టహాసంగా చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పా ల్గొని పూజలు నిర్వహించి వేడుకలు ప్రారంభించారు. ట్రంకురోడ్డు మీదుగా ముసునూరు మందాటి చెరువు వరకు సాగిన వేడుకలో మహిళలు, యువత పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

ఎమ్మెల్యే చొరవతోనే నగల రికవరీ

● ఇంటూరికి బంగారు వ్యాపారుల సన్మానం



ఎమ్మెల్యే ఇంటూరిని సన్మానిస్తున్న బంగారు వ్యాపారస్తులు

కందుకూరు, సెప్టెంబరు 16: ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తమకు ఇచ్చిన హామీ మేరకు అండగా నిలిచారని పట్టణంలోని బంగారు నగల వ్యాపారులు తెలిపారు. ఇటీవల స్థానిక పెద్దబజారులోని గాయ త్రీ జ్యువెలర్ షాపులో దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. స్థానిక పోలీ సులు 24గంటల్లోపు సంబంధిత దొంగలను పట్టుకుని నగలు రికవరీ చేయించి కేసు పెట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే చూపించన చొరవ మరువలేనిదన్నారు. సోమవారం కార్యాలయంలో ది బులియన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతినగల దుకాణం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని విలువైన వస్తువులను కాపాడుకోవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, తుమ్మపూడి సురేష్, కాకుమాని బ్రహ్మయ్య, మురారిశెట్టి సుధీర్, కోట కిషోర్, వేముల సుకుమార్ గుప్తా పాల్గొన్నారు.

గ్రామకొలను పనుల ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి : స్థానిక పెద్ద చెరువును గ్రామ కొలనుగా మార్చేం దుకు వైసీపీ నాయకులు కొంతమేర పనులు చేసి అర్థాంతరంగా నిలిపివేశారు. ఈ పనులు పూర్తి చేసేందుకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం శ్రీకారం చుట్టారు. కలిగిరి పెద్ద చెరువు వద్ద శిలాఫలకం ఆవిష్కరించి పనులు పునఃప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కలిగిరి పెద్దచెరువును గ్రామకొలనుగా తీర్చిదిద్దేందుకు రూ.2.15కోట్లు నిధులు మంజూరు కాగా కేవలం రూ.50లక్షల మేర మట్టి పనులు చేసి నిలిపి నిలిపివేశారని చెప్పారు. తెలుగు దేశం ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో పనులు చేసి ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా గ్రామకొలను నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది తమకు వసతి చూపించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్థానిక పీహెచ్‌సీలో వసతి కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, కార్యదర్శి కాకు మహేష్, రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు, చీమల తాతయ్య, రైతు నరేంద్ర, స్వర్ణ కొండయ్య, కొప్పోలు కొండలరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లతీఫున్నీసా

జలదంకి : వాహనదారులు ట్రాఫిక్ నిభందనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని జలదంకి ఎస్ఐ లతీఫున్నీసా పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ క్రమబద్ధీకరణలో భాగంగా సోమవారం స్థానిక బస్టాండ్ కూడలిలో ఆమె ఆటోడ్రైవర్లు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవాణాశాఖ మంజూరు చేసే డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడకూడదన్నారు. మైనర్ పిల్లలకు మోటార్‌బైక్‌లు, ట్రాక్టర్లు ఇచ్చి రోడ్లపై నడిపిస్తే వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రతి వాహనదారుడు తప్పక గుర్తించాలన్నారు. ప్రతిరోజూ ఈ విషయంపై జలదంకి పోలీసు సిబ్బంది విధిగా రోడ్లపై తనిఖీలు చేపడతారన్నారు. అధికస్పీడుతో వాహనాలు నడిపినా.. ఓవర్‌లోడ్‌తో ప్రయాణికులు తరలించినా చర్యలు తప్పవన్నారు.

వరద బాధితులకు సాయిపేట వాసుల సాయం



వరద బాధితులకు సాయం అందచేస్తున్న సాయిపేట వాసులు

కొండాపురం : సాయిపేట గ్రామానికి చెందిన యువత స్థానిక పంచాయతీ అభివృద్ధి వేదిక సభ్యుల ఆధ్వర్యంలో విజయవాడలోని 250 వరద బాధిత కుటుంబాలకు సోమవారం సాయం అందజేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు చేతుల మీదుగా ఆ శాఖ నెల్లూరు జిల్లా కార్యదర్శి మోహన్, సాయిపేట గ్రామస్థులు భీమిరెడ్డి అరుణ, తాటికొండ ప్రవీణ్ బియ్యం. నిత్యావసర సరుకుల కిట్లను అజిత్‌సింగ్ నగర్, వాంబేకాలనీ, ప్రకాష్‌నగర్, శాంతినగర్, ప్రజాశక్తినగర్ ప్రాంతాల కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంటా శ్రీనివాసులు, షేక్ మహబూబ్‌భాషా, తలసిరి ప్రభాకర్, షేక్ జిలానీ, ఎమ్.ప్రవీణ్, కొమ్మి వెంకటేశ్వర్లు, షేక్ అమీర్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

వింజమూరు : గర్భిణులు పౌష్టి కాహారం తీసుకోవాలని సీ డీపీవో పద్మజాకుమారి సూచించారు. మండల పరిధి లోని నేరుడుపల్లి అంగన్ వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వ హించారు. గర్భిణులకు పాలు, గుడ్లు, అరటిపండ్లు, చిక్కీలు ఇస్తున్నట్లు సీడీపీవో పేర్కొన్నారు. అలాగే చిరుధాన్యాల ప్రయోజనంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, కార్యకర్త లీలావతి, ఆశా వలంటీర్లు అరుణ, ఏఎన్ఎం విజయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ జనని, హెల్త్ ఎడ్యుకేటర్ గిరిజాకుమారి తదితరులు పాల్గొన్నారు.